సంపుటి : 78 సంచిక : 24 పుటలు : 52

జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ చైత్ర శుద్ధ ద్వాదశి
30 మార్చి-05 ఏప్రిల్ 2026
వెల : ₹20/-

మంచి పనికి ఇదే తగిన సమయం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

చైత్రోత్సవాల్లో రాష్ట్రపతి ముర్ము

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మార్చి 19, 20 తేదీలలో అయోధ్య సందర్శించి రామ్‌లల్లా ప్రత్యేక పూజలు, ప్రార్థనల్లో పాల్గొన్నారు. చైత్ర నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన శ్రీరామ యంత్ర ప్రతిష్ఠాపన ఉత్సవానికి హాజరయ్యారు. ఈ యంత్రం సుమారు 150 కిలోల బంగారు పూతతో తయారైంది. అయోధ్య భవ్యమందిర నిర్మాణంలో పాల్గొన్న కార్మికులను సత్కరించారు. 'అయోధ్య భారతీయ సాంస్కృతిక అధ్యాత్మికతకు కేంద్రం. మన సంస్కృతి పునరుజ్జీవానికి చిహ్నం. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా రూపుదిద్దుకునే లక్ష్య సాధనకు శ్రీరాముని ఆశీస్సులు ముఖ్యం' అని రాష్ట్రపతి అన్నారు. అయోధ్య సందర్శనకు ముందు, మధురలోని బృందావన్ సహా ఉత్తరప్రదేశ్‌లోని ఇతర పుణ్యక్షేత్రాలలోని ఆలయాలను సందర్శించారు.



ప్రభుత్వాధినేతగా అరుదైన రికార్డు

దేశ చరిత్రలోనే అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా కొనసాగుతున్న నేతగా ప్రధాన మంత్రి నరేంద్రమోది రికార్డు సృష్టించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా పదమూడున్నరేళ్లకుపైగా సేవలు అందించి, ప్రధానమంత్రిగా 12 సంవత్సరాలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన ఈ ఏడాది మార్చి 22వ తేదీ నాటికి 8,931 రోజులు ప్రభుత్వాన్ని నడిపిన నాయకుడిగా రికార్డు నెలకొల్పారు. ఇప్పటి వరకు సిక్కిం ముఖ్యమంత్రిగా 8,930 రోజులు సేవలు అందించిన పవన్‌కుమార్ చాలింగ్ పేరుతో ఈ రికార్డు ఉండేది. మోది అక్టోబర్ 7, 2001న గుజరాత్ ముఖ్యమంత్రిగా నియమితులై, మే 22, 2014 వరకు కొనసాగారు. ఆ వెంటనే మే 22, 2014లో ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి, వరుస విజయాలతో కొనసాగుతున్నారు. నరేంద్ర మోది గుజరాత్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పనిచేయడమూ ఒక రికార్డే. ఆయన ఇన్‌స్టాగామ్ అనుసరిస్తున్నవారి సంఖ్య పది కోట్లకు చేరడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా అంతమంది 'ఫాలోవర్స్' ఉన్న తొలి అంతర్జాతీయ నేతగా కూడా చరిత్రకెక్కారు.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

యుద్ధం ప్రతికూలతనే కాదు, ప్రత్యామ్నాయాన్నీ తప్పనిసరి చేస్తుంది. కీలక రంగాల్లో సరికొత్త మార్గాల అన్వేషణకు దారులు వేస్తుంది. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్‌యుద్ధం భారత ఇంధన రంగాన్ని అతలాకుతలం చేస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ ఇంధనవనరుల వేట అనివార్యంగా మారింది. దిగుమతుల భారాన్ని తగ్గించే పునరుత్పాదక వనరుల ప్రాధాన్యత పెరుగుతోంది. సౌరశక్తి, పవన శక్తి, హైడ్రోజన్ శక్తిని పెంచేందుకు ఇదే సరైన సమయమని భావించాలి. యుద్ధానికి ముందే భారతదేశ ముడిచమురు దిగుమతి విలువ గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రెండింతలు పెరిగింది. దేశ ముడి చమురు దిగుమతి విలువ వంద మిలియన్ అమెరికన్ డాలర్లు దాటిందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ గత ఫిబ్రవరిలో ప్రకటించింది. గత సెప్టెంబర్‌లో జీఎస్టీ హేతుబద్ధీకరణ ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు చేరిన డబ్బంతా యుద్ధం కారణంగా ఆవిరయింది.

యుద్ధం ప్రభావంతో చమురు ధరలు ప్రపంచంపై దాడి చేస్తున్నాయి. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరుగుతూ స్టాక్ మార్కెట్లు పతనమవుతున్నాయి. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతి దేశం. వర్ధమాన దేశాల్లో కంటే చమురు వినియోగం భారత్‌లోనే అధికమని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ అంచనా వేసింది. శిలాజ ఇంధన వినియోగం విపరీతంగా పెరుగుతున్న సమయంలో పశ్చిమాసియా సంక్షోభం వచ్చి పడింది. దేశంలో కేవలం 74 రోజులకు సరిపడ చమురు నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

ఇలాంటి స్థితిలో శిలాజ ఇంధనాల వాడకానికి స్వస్తి పలికి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగంపై ప్రజలు దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది. కేవలం ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో మార్పువల్ల మాత్రమే చమురు సంక్షోభాన్ని నివారించలేం. 140కోట్ల మంది ప్రజలు సంప్రదాయ, ప్రత్యామ్నాయ వనరుల వినియోగాన్ని పెంచడం, పొదుపు చర్యలు పాటించడం వల్ల మాత్రమే దిగుమతుల భారాన్ని తగ్గించవచ్చు. దిగుమతుల భారాన్ని తగ్గించడంతో పాటు చమురు సంక్షోభాన్ని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే ప్రయోగం చేసి

శాలివాహన 1948 శ్రీ పరాభవ చైత్ర శుద్ధ ద్వాదశి

లోపలి పేజీలలో...



6లో

ముఖపత్ర కథనం

మంచిపనికి ఇదే తగిన సమయం

ధారావాహిక నవల

29 **గణపతిదేవుడు**

- మత్తి భానుమూర్తి

20లో

వ్యక్తి నిర్మాణం

శ్రీ కాంచీ కామకోటి పీఠం "బడి-గుడి-తల్లి ఒడి"

9లో

జాగృతి

సంపాదకీయం

అద్భుత ఫలితాలు సాధించింది. పెట్రోల్‌లో 10శాతం మేర ఇథనాల్ కలపాలని 2014లో అధికారం చేపట్టినప్పుడే కేంద్రం నిర్ణయించుకుంది. 2022 నవంబర్ నాటికి కేంద్రం ఈ లక్ష్యాన్ని సాధించింది. పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్‌ను కలపడం ద్వారా గత ఏడేళ్లలో సుమారు రూ.50వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని కేంద్రం ఆదా చేసింది.

శిలాజ ఇంధనాల వాడకం మనిషి మనుగడను ప్రశ్నార్థకం చేస్తోంది. పర్యావరణానికి హాని చేస్తోంది. దుబాయి వేదికగా 2023లో ఐరాస వాతావరణ

ఇంధన సంక్షోభం-పాదుపు మంత్రం

మార్పుల సదస్సు-కాప్ 28 జరిగింది. శిలాజ ఇంధనాల వాడకానికి స్వస్తి పలకాలని ఆ సదస్సు తీర్మానించింది. దేశీయ అవసరాలు తీర్చడానికి శిలాజ ఇంధన వనరులు ఉపయోగిస్తూనే, పునరుత్పాదక ఇంధన శక్తి వనరుల అన్వేషణలో భారత్ వేగం పెంచింది. ఇదే విషయాన్ని కాప్-28 సదస్సు వేదికగా స్పష్టం చేసింది.

2030 నాటికి పునరుత్పాదక ఇంధన వనరులను మూడు రెట్లు పెంచాలని కేంద్రం విధాన నిర్ణయం చేసింది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి వ్యవస్థల ఏర్పాటు, పవన, సౌరవిద్యుత్ ఉత్పత్తిలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. శిలాజ ఇంధన రహిత విద్యుత్ ఉత్పత్తిలో 2030 నాటికి 500 గిగావాట్ల సామర్థ్యాన్ని సాధించాలని కేంద్రం ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

చమురు సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త తరహా ఇంధన వనరులను సృష్టించి వినియోగించడం అలవాటు చేసుకోవాలి. నీరు, బొగ్గు, కలప, పెట్రోలు, డీజిల్, కిరోసిన్ వంటివి తరిగిపోయే ఇంధన వనరులు. భూమాతను తొలిచి వెలికితీసే చమురు, గ్యాస్‌లను పొదుపుగా వాడాలి. వాయు శక్తిని, సూర్యకాంతినీ ఆధారం చేసుకుని ఉత్పత్తి చేసే నవీన ఇంధన శక్తులను వినియోగించాలి. అప్పుడే భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావాన్ని, యుద్ధాల కారణంగా ఏర్పడే సంక్షోభాలను అధిగమించవచ్చు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ పశ్చిమాసియా ఉద్రిక్తతలు - దేశం ఎదుర్కొంటున్న సవాళ్లపై పార్లమెంటులో మాట్లాడారు. స్థూలంగా ప్రస్తుత పరిస్థితి, ప్రభుత్వ ఉద్దేశ్యం, ప్రత్యామ్నాయ అన్వేషణలపై కేంద్రం దీర్ఘకాలిక దృష్టి నిలిపినట్లు బోధపడుతుంది. ప్రపంచంలో 5వ వంతు ఇంధన వనరుల రవాణా జరిగే హార్మోజ్ జలసంధిని దిగ్బంధించడం వల్ల సంక్షోభాలను తీవ్రతరం చేస్తుంది. సరఫరాలోని అనిశ్చితి కారణంగా దేశీయ ఉత్పతిని పెంచడంపై ప్రభుత్వం దృష్టి నిలిపింది.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాన్ని ఆమూలాగ్రం పరిశీలిస్తే కేంద్రం దౌత్యాన్ని, లౌక్యాన్ని కలగలిపిన 'పరుసవేది'ని యుద్ధ సమయంలో అనుసరిస్తుందని అర్థమవుతుంది. యుద్ధానికి దిగిన అమెరికా, ఇజ్రాయెల్ సహా యుద్ధాన్ని ఎదుర్కొంటున్న ఇరాన్ భారత్‌కు మిత్ర దేశాలు. ఇరాన్‌కు ప్రత్యక్ష సాయం చేస్తున్న Sష్యా, పరోక్ష సాయం చేస్తున్న చైనాతో సహితం భారత్‌కు ద్వైపాక్షిక సంబంధాలున్నాయి. యుద్ధ ప్రభావాన్ని ఎదుర్కొంటున్న గల్ఫ్ దేశాలతో కూడా భారత్ సుదీర్ఘ కాలం మైత్రి ఉంది. దీంతో భారత ప్రభుత్వం అచీతూచి వ్యవహరిస్తున్నది. ప్రతిపక్షాలు, కొంతమంది మేధావులు ఆరోపిస్తున్నట్లు యుద్ధ విషయంలో భారత్ మౌనంగా ఉందనడం విచారకరం. ఆ వైఖరిని బాధ్యత గల రాజనీతిగా అర్థం చేసుకోవాలి. ★



కథ

ఆధునిక పోకడలు

- వి. శారద



అంకెల్లో ఆకర్షణ-వాస్తవంలో అప్పుల మయం (తెలంగాణ) - 14
వ్యవసాయ, పౌల్ట్రీల్లో యుద్ధ సంక్షోభం (ఆంధ్రప్రదేశ్) - 16
ఎన్నికల కాలం (జాతీయం) - 24
కళాకిరణ అరుణ (మహిళ) - 26
అనవసర యుద్ధంతో అపసోపాలు! (అంతర్జాతీయం) - 28
యుద్ధానంతర పరిణామాలకు సిద్ధం కావాలి (పిలుపు) - 30
యుద్ధాలకు పసిప్రాణాలు బలి (గళమెత్తిన గతం) - 32
సర్దార్ చిరంజీవ్ సింగ్.. (ఆర్ఎస్ఎస్-100) - 34
సాగర సమరంలో మందుపాతరలు (రణతంత్రం) - 36
ఆధునిక యువతలో మిశ్రమ పంథా (సంస్కృతి) - 38
క్రీడాజగత్తులో ఆ నలుగురు...! (క్రీడ) - 43
ఉగ్రవాదుల ఉసురు తీసే 'ఉస్తాద్ భగత్ సింగ్' (సినిమా) - 50



మంచి పనికి ఇదే

రాజ్యంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలంటే న్యాయపాలనలో కుల, మత, వర్గ విభేదాలు ఉండకూడదని, న్యాయం అందరికీ సమానంగా అందాలని, కులమతా లతో సంబంధం లేకుండా పాలన ఉండాలని అపర చాణుక్యుడు చెప్పిన రాజనీతి సూత్రం మన దేశంలో కచ్చితంగా అమలు చేయాల్సిన పరిస్థితులున్నాయి. ఇటీవల అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తూ... "భారత్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలుకు సమయం ఆసన్నమైంది.." అని వ్యాఖ్యానించింది. అయితే ఈ వ్యాఖ్యలు ఓట్ల కోసం బుజ్జగింపు రాజకీయాలు చేసే శక్తులకు మింగుడు పడవు. లౌకికవాదాన్ని భుజానకెత్తుకొని మత వివక్ష చూపే కుహనా సెక్యులరిస్టులు ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫాం సివిల్ కోడ్ 'యూసీసీ') పేరు వింటేనే మన దేశంలో మైనార్టీలకు తీవ్రం అన్యాయం జరిగిపోతుండంటూ పూనకంతో ఊగిపోతారు. దీర్ఘకాలంగా యూసీసీ చట్టం అమలు కోసం ఎదురు చూస్తున్న దేశ ప్రజల్లో సుప్రీం కోర్టు వ్యాఖ్యలు ఆశలు రేకెత్తిస్తున్నాయి. మన దేశంలో మత వివక్ష లేకుండా అందరికీ సమానమైన హక్కులు కల్పించినప్పుడే ప్రజలకు ప్రజాస్వామ్యం ఫలాలు

స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలో బ్రిటిష్ పాలకులు హిందూ, ముస్లిం సామాజిక వర్గాలకు వేర్వేరు చట్టాలు అమలు చేస్తూ ముస్లింల కోసం ప్రత్యేకంగా 1937లో షరియత్ చట్టం తీసుకొచ్చారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం ప్రజల మధ్య విభేదాలు లేకుండా అన్ని మతాల వారికి ఒకేరకమైన చట్టం ఉండాలనే భావనతో యూనీసీ ప్రతిపాదన తెరమీదకు వచ్చింది. కానీ మొదటి నుండి ముస్లిం మైనార్టీలు ఎక్కడ నొచ్చుకుంటారో అనే భయంతో మెజార్టీ హిందువులపై వివక్ష చూపించే కాంగ్రెస్ పార్టీ నాటినుండి నేటివరకూ అదే పంథాను కొన సాగిస్తూ యూసీసీకి అడ్డుపుల్లలు వేస్తోంది. కాంగ్రెస్‌కు కమ్యూనిస్టులు, ఇతర కుహనాశక్తులు కూడా తోడవడంతో పరిస్థితులు ఎలా మారాయంటే యూసీసీ పేరు ఎత్తితేనే దేశం అల్లకల్లోలం అవుతుందనే ఆందోళనలు రేగుతున్నాయి. నిజానికి యూసీసీ ఏ ఒక మతానికి వ్యతిరేకం కాదు. అనుకూలం కాదు. దేశంలోని అన్ని మతాల ప్రజలకు ఒకే రకమైన న్యాయం కలిగించడమే దీని ప్రధాన ఉద్దేశం. బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే శక్తులు యూసీసీ అమలయితే ముస్లింలకు అన్యాయం జరిగిపోతుందని విష ప్రచారం చేయడంతో వాస్తవాలు మరుగున పడిపోయి అవాస్తవాలు, అనత్యాలతో మైనార్టీల్లో భయాందోళనలు పెరిగిపోయాయి.

యూసీసీతో ప్రత్యేకంగా ఏ ఒక్క మతానికి నష్టం జరగదు. సెక్యులర్ దేశంగా చెప్పుకునే భారత్‌లో అన్ని మతాల ప్రజలకు ఒకే విధమైన వ్యక్తిగత చట్టాలు ఉండాలని చెప్పే ప్రతిపాదనే యూసీసీ. ప్రస్తుతం ఒక్కో మతానికి వేర్వేరు చట్టాలు ఉండడంతో ప్రధానంగా మహిళలకు నష్టం జరుగుతోంది. యూసీసీతో మహిళలకు సమాన హక్కులు లభిస్తాయి. దేశంలో ఏకత్వం పెరుగుతుంది. ఒకే చట్టం ఉంటే అందరూ సమానంగా ఉంటారు. యూసీసీతో మహిళల హక్కులకు పూర్తి రక్షణ లభిస్తుంది. ప్రస్తుతం విడివిడి చట్టాలతో ముఖ్యంగా వివాహం, విడాకులు, వారసత్వ హక్కులు, దత్తత, భరణం వంటి అంశాల్లో గందరగోళం నెలకొంటుంది. దీంతో ముస్లిం మహిళల హక్కులపై ఇప్పటికే పలు కేసుల్లో న్యాయస్థానాలు యూసీసీ చట్టాన్ని తీసుకురావాల్సిన ఆవశ్యకతపై వ్యాఖ్యలు చేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశాయి. గతంలో సుప్రీం కోర్టు 1985లో మహ్మద్ అహ్మద్‌ఖాన్ వర్సస్ షాబానో బేగం కేసులో, 1995లో సర్లా ముద్గల్ వర్సస్ కేంద్ర ప్రభుత్వం కేసులో యూసీసీ అమలు చేయాల్సిన ఆవశ్యకతను నర్మగర్భంగా చెప్పింది. ఇప్పుడు సుప్రీం కోర్టు తాజాగా ఉమ్మడి పౌరస్మృతి గురించి వ్యాఖ్యానించడంతో దేశ వ్యాప్తంగా మరోసారి యూసీసీపై చర్చ ప్రారంభమైంది.

మార్చి 10, 2026న సుప్రీం కోర్టులో షరియా

తగిన సమయం

చట్టంలోని కొన్ని నిబంధనలు రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోమాల్య బాగ్చీ, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన త్రిసభ్య బెంచ్ విచారణ జరుపుతున్న సందర్భంలో సీజేఐ వ్యాఖ్యానిస్తూ ఉమ్మడి పౌరస్మృతి దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని చెబుతూ షరియా చట్టంలో మహిళల పట్ల వివక్ష చూపుతున్న నిబంధనలను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను స్వాగతిస్తూ ఇది చాలా మంచి కేసు అన్నారు. ముస్లిం పురుషులతో సమానంగా ఆ మతంలోని స్త్రీలకు కూడా వారసత్వ హక్కులు కల్పించాలని, షరియాలో నిబంధనలు తొలగించి ముస్లిం మహిళలను భారతీయ వారసత్వ చట్టం పరిధిలోకి తీసుకురావాలనే పటిషినర్ల అభ్యర్థనపై సుప్రీం కోర్టు వ్యాఖ్యానిస్తూ ఇది శాసన వ్యవహారాలతో ముడిపడిన విషయమని, తాము నిర్ణయం తీసుకుంటే న్యాయ సంబంధ చిక్కులకు దారి తీయవచ్చునని తెలిపింది. ఈ సమస్యకు ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావడమే సరైన పరిష్కారమని అభిప్రాయం వ్యక్తం చేయడంతో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న యూసీసీ చట్టంపై ఆశలు చిగురించాయి.

దేశంలో అందిరికీ ఒకే చట్టం ఉండాలనే అభిప్రాయం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి వెలువడుతున్నా అడుగు ముందుకు పడలేదు. ముస్లిం ఓట్ల కోసం బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే కాంగ్రెస్ పార్టీయే ఇందులో ప్రధాన ముద్దాయి. రాజ్యంగా రూపకర్త డా.బీఆర్ అంబేద్కర్ యూసీసీ అమలు చేయాలని గట్టిగా కోరుకున్నా తొలి ప్రధాని నెహ్రూ సెక్యూలరిజం పేరుతో వెనకడుగు వేయడంతో అది నేటికీ అపరిష్కృతంగానే మిగిలి పోయింది. దేశ విభజన అనంతరం ముస్లింలు యూసీసీ అమలును వ్యతిరేకిస్తారనే భయంతో నెహ్రూ దాటవేత వైఖరి ప్రదర్శించారు. ముస్లింలకు ఆగ్రహం వస్తుందని యూసీసీ పేరు ఎత్తడానికే ఇష్టపడని నెహ్రూ సంస్కరణల పేరుతో ఎంతో ఉత్సాహంతో హిందూ కోడ్ బిల్లు తీసుకొచ్చారు. 1950వ దశకంలో హిందువులకు వర్తించేలా హిందూ వివాహ చట్టం, హిందూ వారసత్వ చట్టం, హిందూ మైనర్ల సంరక్షణ, హిందూ దత్తత, మనోవర్తి చట్టం, హిందూ ఆస్తి స్వాధీనతా చట్టం.. ఇలా అయిదు చట్టాలు తీసుకొచ్చారు. ఈ చట్టాలే సిక్కు, బౌద్ధ, జైన్ మతస్తులకు కూడా వర్తింపచేస్తున్నారు. అయితే ముస్లిం, క్రైస్తవ, పార్సీ మతస్తులకు మాత్రం వేర్వేరు చట్టాలు ఉండడంతో వివాదం మొదలైంది. అయితే హిందూ మహిళలకు న్యాయం చేయడానికి హిందూ కోడ్ బిల్లు తీసుకురావడాన్ని తప్పు పట్టలేము కానీ ఇదే ఉత్సాహం, నిబద్ధత ఇతర మతాల వద్దకు వచ్చేసరికి ఎందుకు కనిపించలేదో కాంగ్రెస్ పార్టీ నేతలు చెప్పాలి. హిందూ కోడ్‌తో ఆ వర్గంలోని మహిళలకు సమన్యాయం చేశామని చెప్పుకునే కాంగ్రెస్ ముస్లిం మహిళలకు అదే న్యాయం ఎందుకు చేయడం లేదు. సెక్యులరిజం అంటే ఒక మతానికే అన్నీ వర్తిస్తాయా..? వివాహ చట్టం అందరికీ ఒకేలా లేకపోవడంతో బహుభార్యాత్వం, సంతానం విషయంలో నిబంధనలు ఒకేలా లేకపోవడంతో ముస్లింల షరియా చట్టంలో నిబంధనలపై అనేక వివాదాలు రేగుతున్నాయి.

ముస్లింలను ఓటు బ్యాంకుగా చూస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఇతర కుహనా సెక్యులరిస్టులు పరోక్షంగా ఆ వర్గానికి తీవ్ర అన్యాయమే చేశారు. యూసీసీపై ముస్లింలను చైతన్యపరచాల్సిందిపోయి వారిని తప్పుదోవ పట్టించారు. మత స్వేచ్ఛకు భంగం కలుగుతుందని, సంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చినట్టవుతుందనే తప్పుడు ప్రచారానికి వీరు మద్దతిచ్చారు. హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు వేర్వేరు చట్టాలుండే బదులు యూసీసీతో దేశంలో ఒకే చట్టం అమలులో ఉంటే అందరికీ సమన్యాయం లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ ముస్లింలను ఒప్పించలేకపోయింది. యూసీసీతో దేశంలో వివాహం, పునర్వివాహం, కుమారులకు, కుమార్తెలకు సమాన హక్కులు, సామాజిక ప్రయోజనాలు, మతం, లింగం ఆధారంగా భేదాలు లేకుండా చట్టాలు చేసే ప్రయోజనాలు యూసీసీ ద్వారా లభిస్తాయని తెలిసినా ముస్లింలను కొంత మంది తప్పుదోవ పట్టిస్తూ, ఈ చట్టాన్ని బూచిగా చూపుతూ స్వార్థ రాజకీయాలకు పాల్పడ్డారు. విభిన్న సంప్రదాయాలు, సంస్కృతులు, ఆచారాలు ఉన్న భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం తెచ్చేందుకు యూసీసీ ఉపయోగపడుతుందని తెలిసినా కూహనా సెక్యులరిస్టులు ముందడుగు వేయలేదు. ప్రజాస్వామ్యానికి లౌకికవాదం పునాది అని ధంకా భజాయించే ఈ పెద్దలు బ్రిటిష్ వారి విభజించు,

పాలించు సూత్రాలను అనుసరిస్తూ గందరగోళం చట్టాలతో ముస్లిం మహిళలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ చూపిస్తున్న ఈ వివక్ష నెహ్రూ కాలం నుండి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం వరకు కొనసాగింది.

డా.బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగం రూపొందించినప్పుడు యూసీసీపై తన వాదనలు గట్టిగానే వినిపించినా నెహ్రూ వైఖరితో చట్టం సాధ్యం కాలేదు. దేశంలో కాంట్రాక్టు, క్రిమినల్ లా వంటి సివిల్ విషయాల్లో ఒకే చట్టం సాధ్యమైనప్పుడు వ్యక్తిగత చట్టాలకు కూడా ఒకే కోడ్ ఉండడం అసాధ్యం కాదని అంబేద్కర్ భావించారు. రాజ్యాంగం రూపొందించే సందర్భంగా రాజ్యాంగ నిర్ణాయక సభలో యూసీసీపై లోతైన చర్చే జరిగింది. రాజ్యంగసభ అధ్యక్షులు అంబేద్కర్ యూసీసీ ఉండాలని కోరుకున్నా నెహ్రూతో ఆయన మద్దతుదారులు వ్యతిరేకించడంతో గొప్ప ప్రయత్నానికి బ్రేకులు పడ్డాయి. యూసీసీపై ముస్లింలను ఒప్పించే దిశగా ప్రయత్నించాలని అంబేద్కర్ భావించినా కాంగ్రెస్ పెద్దలు అందుకు సమ్మతించలేదు. ముస్లింలు ఎక్కడ బాధపడతారో, ఎక్కడ తిరగబడుతారో అనే జంకుతో రాజ్యాంగం హక్కుల్లో భాగం కావాల్సిన యూసీసీ అంశాన్ని 44వ అధికరణ కింద ఆదేశిక సూత్రాల్లో చేర్చి ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావడానికి రాజ్యం కృషి చేయాలని ఆ అధికరణ నిర్దేశించింది. దీన్ని అడ్డుపెట్టుకొని 25 నుండి 28వ అధికరణ వరకూ పౌరులకుండే మత స్వేచ్ఛ హక్కులను ప్రస్తావిస్తూ 44వ అధికరణలో ఉన్న యూసీసీపై గత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించాయి.

కేంద్రంలో 2014 నుండి మోదీ అధికారం చేపట్టాక యూసీసీపై ఆశలు చిగురించాయి. బీజేపీ ఎన్నికల నినాదమైన ఒకే దేశం ఒకే చట్టం వారు అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందనే భావన ప్రజల్లో ఏర్పడింది. 2024 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ యూసీసీ గురించి ప్రస్తావించారు. దేశంలో ప్రస్తుతమున్న 'మతతత్వ పౌరస్మృతి' స్థానంలో 'సెక్యులర్ పౌరస్మృతి' ఉండాలని పిలుపు నిచ్చారు. సీఏఏ, త్రిబుల్ తలాక్, కాశ్మీర్ 370 ఆర్టికల్ రద్దు వంటి కీలక నిర్ణయాలు తీసుకొని తన ప్రత్యేకతను నిరూపించుకున్న మోదీ యూసీసీపై వ్యూహాత్మంగా అడుగులేస్తారని దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరాఖండ్‌లో యూసీసీ చట్టం అమలు చేస్తుండడంతో కేంద్రంలో కూడా మోదీ ప్రభుత్వం అదే దిశలో పయనిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉత్తరాఖండ్‌లో బీజేపీ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామీ వ్యూహాత్మకంగా వ్యవహరించి ఆ రాష్ట్రంలో 2024లో యూసీసీ చట్టాన్ని తీసుకొచ్చారు.

దేశంలో యూసీసీ చట్టాన్ని అమలు చేస్తున్న మొట్టమొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. అంతకు ముందు నుండే గోవాలో యూసీసీ చట్టం అమల్లో ఉంది. 1867లో అక్కడ పోర్చుగీస్ ప్రభుత్వం యూసీసీ తీసుకొచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం యూసీసీ చట్టం తెచ్చిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ చరిత్రలో నిలిచిపోయింది. మరోవైపు బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్, అసోం రాష్ట్రాల్లో కూడా యూసీసీ చట్టం తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తాజాగా మరోసారి సుప్రీం కోర్టు యూసీసీ చట్టం ఆవశ్యకతపై వ్యాఖ్యానించడంతో కేంద్రంతో పాటు ప్రధానంగా బీజేపీ పాలిత రాష్ట్రాలు దీనిపై దృష్టి సారించే అవకాశాలున్నాయి.

లౌకికవాద దేశం కాబట్టి భారత్‌లో యూసీసీ అమలు చేయకూడదని వాదిస్తున్న సెక్యులరిస్టులు కుహనా లౌకికవాదులని బలంగా చెప్పవచ్చు. భారత రాజ్యాంగం రూపొందించినప్పుడు లేని సెక్యులరిజం పదాన్ని తమ స్వార్థ, బుజ్జగింపుల రాజకీయాల కోసం కాంగ్రెస్ పార్టీ చేర్చింది. ఇంకా దురదృష్టకరమైన విషయం ఏమిటంటే లౌకికత్వాన్ని వల్లెవేస్తూ లౌకికత్వానికి కుహనా సెక్యులరిస్టులు తిలోదకాలిస్తున్నారు. దేశంలో ఏ మతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వకుండా అన్ని మతాల్ని సమానంగా గౌరవించడమనే లౌకికత్వం ప్రాథమిక సూత్రానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దేశంలో మెజార్టీలైన హిందూ చట్టాల్లో సంస్కరణలు తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీలైన ముస్లిం షరియా చట్టం వైపు చూడడానికే భయపడడం లౌకికవాదమవుతుందా..? అందరికీ సమానమైన హక్కులు, చట్టాలు లేకుండా వివక్ష చూపడం సెక్యులరిజమా..? సెక్యులరిజం పేరుతో సెక్యులరిజం సిద్ధాంతాలకు తూట్లు పొడవడం సెక్యులరిస్టుల దిగజారుడుతనం రాజకీయాలకు నిదర్శనం.

భారత దేశంలో ప్రజల మధ్య విభేదాలు లేకుండా యూసీసీ చట్టం అమలుకు ఇదే సరైన సమయమని సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మార్గదర్శకంగా తీసుకొని ముందడుగు వేయాలి. వందేళ్లకు పైగా చరిత్ర గలిగిన పార్టీగా బాజాలు కొట్టుకునే కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు ధోరణితో దేశ పౌరుల ప్రయోజనాలను విస్మరించింది. లౌకికవాదం పేరుతో ఆ పార్టీ చేసిన రాజకీయాలను ఎండగడుతూ మోదీ ప్రభుత్వం యూసీసీ చట్టం కోసం కంకణం కట్టుకోవాలి. ఇప్పటికే సీఏఏ, త్రిబుల్ తలాక్, ఆర్టికల్ 370 రద్దు సున్నితమైన అంశాలపై ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించి విజయవంతమైన బీజేపీ ప్రభుత్వం అదే స్ఫూర్తితో యూసీసీ చట్టం తీసుకొస్తుందని ప్రజలు వారిపై భరోసాతో ఉన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం కేంద్రంలో గట్టి నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం అధికారంలో ఉండడంతో సుప్రీం కోర్టు చెప్పినట్టు ఒక మంచి పనికి సమయం ఆసన్నమైందనే విశ్వాసం దేశ ప్రజల్లో కలుగుతోంది.

– శ్రీపాద

శ్రీ కాంచీ కామకోటి పీఠం “బడి-గుడి-తల్లి ఒడి”

శాంతా మహాంతో నివసంతి సంతః వసంతవల్లోక హితం చరంతః।
తీర్ణాః స్వయం భీమ భవార్ణవం జనాన్ అహేతునాఽన్యానపి తారయంతః ॥ – వివేకచూడామణి

శాంతచిత్తులయిన మహాత్ములు వసంత రుతువు లాగా లోక హితాన్ని కోరుతూ, వ్యవహరిస్తూ, తాము స్వయంగా అతి భీకరమైన సంసార సాగరాన్ని దాటి, ఏ కారణము, ఏ ప్రయోజనము లేకుండానే ఇతరులను కూడా దాటిస్తారట. – వివేకచూడామణిలో శ్రీ శంకర భగవత్పాదుల ఉపదేశం ఇది.

దీనికి ప్రత్యక్ష ఉదాహరణమే సప్త మోక్ష నగరాలలో ఒకటి అయిన శ్రీ కాంచీపురంలోని శ్రీ ఆదిశంకర ప్రతిష్ఠిత మూలామ్నాయ కామకోటి పీఠంలో అక్షరాల ఆచరణలో ఉన్నది. యావత్ హైందవ సమాజాన్ని సమైక్యపరచటానికి 2,500 సంవత్సరాలుగా ఈ పీఠం మహాచార్య పరంపర అనుగ్రహ దృష్టి, వారి ఆచరణ యోగ్యములైన ఉపదేశాలు ఎంతో అమూల్యమైనవి. వారు చూపించిన దారి సామాన్య ప్రజానీకానికి కూడా భక్తి, ముక్తులను ప్రసాదించగలిగిన ఎంతో ప్రశస్తమైన విధానాలు అవి. ప్రజల భాగ్యవశాత్తు కాంచీపురం ఆలయంలోని కామాక్షి అమ్మవారి చల్లని ఒడిలో సమస్త ఆస్తికలోకానికి సేద దీరే మార్గం ఈ మహాత్ముల బోధనలలో లభిస్తుంది. ఆ బోధనలు ఒక ఎత్తు. ఈ మఠం ద్వారా ప్రజలకు అందుతున్న జ్ఞాన భిక్ష మరొక ఎత్తు. మోక్షనగరపు గుడి నీడలో, ఆ జగన్మాత ఒడిలో, పారమ్యాన్ని దర్శింపచేసే చదువుల బడిలో జీవితాన్ని సనాతన ధర్మమార్గంలో ఆదర్శవంతంగా చక్కదిద్దుకోవాలి అనుకునే వారికి ఒక దివ్యమైన మార్గాన్ని చూపే స్థానం శ్రీ కామకోటి పీఠం. భారతీయ సంస్కృతి పరిరక్షణలో శ్రీ కాంచీ కామకోటి పీఠం విశిష్టమైన స్థానం కలిగిన ఆధ్యాత్మిక సంస్థ. జగద్గురు ఆదిశంకరభగవత్పాదుల ఆధ్యాత్మిక పరంపరలో కొనసాగుతున్న ఈ పీఠం శతాబ్దాలుగా ధర్మప్రచారం మాత్రమే కాకుండా సమాజ నిర్మాణంలో కూడా కీలకపాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా వేదాలు, శాస్త్రాలు, ఆగమాలు, సంప్రదాయ కళలు, సంస్కార విలువలను పరిరక్షిస్తూ విద్యా రంగంలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. సమాజాన్ని ధార్మికంగా, సాంస్కృతికంగా, నైతికంగా బలపరచడానికి శ్రీ కాంచీ కామకోటి పీఠం ఒక గొప్ప దార్శనికతను ప్రతిపాదించింది. అది “బడి – గుడి – తల్లి ఒడి” అనే సూత్రం. ఈ సూత్రం వ్యక్తి జీవిత నిర్మాణానికి అవసరమైన మూడు ప్రధాన ఆధారాలను సూచిస్తుంది.

ఆచార్య రాణి సదాశివమూర్తి
ఉపకులపతి,
శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, తిరుపతి

బడి - విద్య ద్వారా వ్యక్తిత్వ వికాసం

ఇక్కడ బడి అంటే విద్యావ్యవస్థ. విద్య మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే ప్రధాన సాధనం. జ్ఞానం మాత్రమే కాకుండా నైతిక విలువలు, సంస్కారం, కర్తవ్యబోధ కూడా విద్య ద్వారానే అభివృద్ధి చెందుతాయి. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని శ్రీ కాంచీ కామకోటి పీఠం అనేక విద్యాసంస్థలను నిర్వహిస్తోంది. వేద పాఠశాలలు, శాస్త్ర పాఠశాలలు, ఆగమ శిక్షణ కేంద్రాలు, నాదస్వర పాఠశాలలు వంటి అనేక విద్యాసంస్థలు పీఠం ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. వీటిలో విద్యార్థులకు సంప్రదాయ గురుకుల విధానంలో విద్యను బోధిస్తున్నారు. వేదాధ్యయనం, సంస్కృత శాస్త్రాలు, దేవాలయ ఆగమ సంప్రదాయాలు, దేవాలయ సంగీతం వంటి అంశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇవే కాకుండా సమాజంలోని యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి వృత్తి విద్యా పాఠశాలలను కూడా నిర్వహిస్తున్నారు. కుంభకార కళ వంటి సంప్రదాయ వృత్తులను పరిరక్షించడానికి కుంభకార పాఠశాలలను నడుపుతున్నారు. అదేవిధంగా గోసంరక్షణకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఈ విధంగా విద్యా రంగంలో సంప్రదాయం, ఆధునిక అవసరాలను సమన్వయపరచే ప్రయత్నం జరుగుతోంది.

గుడి - ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రం

గుడి భారతీయ సమాజానికి ఆధ్యాత్మిక కేంద్రం. దేవాలయాలు భక్తి, ధర్మం, సాంప్రదాయ విలువలను ప్రజల జీవితంలో నిలబెట్టే ప్రధాన స్థావరాలు. దేవాలయాల ద్వారా సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందుతుంది. ఈ కారణంగా శ్రీ కాంచీ కామకోటి పీఠం దేవాలయ సంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యాన్ని ఇస్తోంది. ఆగమ పాఠశాలల ద్వారా దేవాలయాలలో జరిగే పూజా విధానాలు, ఆచారాలు, ఆగమ శాస్త్రాలను బోధిస్తోంది. దీని ద్వారా శాస్త్రోక్తంగా దేవాలయ సేవ చేయగల అర్చకులు, పండితులు తయారవుతున్నారు. దేవాలయ సంప్రదాయం సమాజంలో ఆధ్యాత్మిక విలువలను బలపరచే శక్తిగా కొనసాగుతోంది.

తల్లి ఒడి - సంస్కారాల మొదటి పాఠశాల

కుటుంబం మనిషి జీవితానికి మొదటి పాఠశాల. తల్లి ఒడిలోనే పిల్లలు ప్రేమ, కరుణ, సేవాభావం, ధర్మబోధ వంటి విలువలను నేర్చుకుంటారు. తల్లి ఒడి అనేది కేవలం కుటుంబాన్ని సూచించడమే కాకుండా సంస్కారపూర్వకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తుంది.

జగద్గురు ఆదిశంకరాచార్యుల పరంపరలోని ఆచార్యులు విద్యా రంగంలో విశేష కృషి చేశారు. సంక్షిప్తంగా ఈ పీఠం చేస్తున్న విద్యాసేవలు ఇలా ఉన్నాయి.

1. వేద పరిరక్షణ

దేశవ్యాప్తంగా అనేక వేదపాఠశాలలను స్థాపించి నిర్వహిస్తోంది. రుగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణవేదం పాఠాలను గురుకుల విధానంలో బోధిస్తోంది. వేదాధ్యయనానికి విద్యార్థులకు ఉచిత విద్య, భోజనం, వసతి కల్పిస్తోంది. వేదపండితులకు సన్మానాలు, వేతనాలు, వేదరక్షణ నిధులు అందిస్తోంది.

2. శాస్త్ర విద్యా అభివృద్ధి

సంస్కృత వ్యాకరణం, మీమాంస, న్యాయ, వేదాంత, సాహిత్య శాస్త్రాలు బోధించే పాఠశాలలు, విద్యా కేంద్రాలను నిర్వహిస్తోంది. శాస్త్ర పండితుల తయారీలో పీఠం కీలక పాత్ర పోషిస్తోంది. శాస్త్రసదస్సులు, ఉపన్యాసాలు నిర్వహించి సంస్కృత పాండిత్యాన్ని ప్రోత్సహిస్తోంది.

3. ఆగమ విద్య

దేవాలయ ఆరాధనకు అవసరమైన శైవ, వైష్ణవ, శాక్త ఆగమ సంప్రదాయాలపై శిక్షణ అందిస్తోంది. అర్చకులు, ఆగమపండితుల తయారీకి ప్రత్యేక శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తోంది.

4. సంస్కృత విద్యా ప్రచారం

సంస్కృత పాఠశాలలు, కళాశాలలు స్థాపించి భాషాభివృద్ధికి కృషి చేస్తోంది. సంస్కృత గ్రంథాల ప్రచురణ, పునర్ముద్రణ, వ్యాఖ్యానాలు చేయిస్తోంది. విద్యార్థులకు విద్యాబహుమతులు, ఉపకారవేతనాలు ఇస్తోంది.

5. గ్రంథరక్షణ, పరిశోధన

పూర్వకాలపు పాండులిపుల సంరక్షణ, సేకరణ, ప్రచురణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వేద, ఆగమ, శాస్త్ర విషయాల్లో పరిశోధనను ప్రోత్సహిస్తోంది.

6. ఆచార్యుల ప్రేరణ

మహాపెరియవా శ్రీశ్రీశ్రీ జగద్గురు చంద్ర శేఖరేంద్ర సరస్వతి మహాస్వామివారు వేదరక్షణకు విశేష ఉద్యమం చేశారు. తదనంతర జగద్గురుశ్రీ శ్రీ శ్రీ శంకర జయేంద్ర సరస్వతీ మహా స్వామివారు, శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి వారు కూడా వేద-శాస్త్ర విద్యాభివృద్ధిని ధర్మకార్యంగా కొనసాగిస్తున్నారు.

యావత్ హైందవ సమాజాన్ని ఒక్క తాటిపై నడపడానికి శ్రీ కాంచీ కామకోటి పీఠం వేద-శాస్త్ర విద్యతో పాటు సామాన్యులకు ఉపయుక్తమయ్యే వృత్తి విద్య (Vocational Education) అభివృద్ధికి కూడా సేవ చేస్తోంది. ఈ పీఠం నిర్వహిస్తున్న లేదా ప్రోత్సహిస్తున్న వృత్తి విద్యా కార్యక్రమాలు ముఖ్యంగా సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ఉంటాయి.

1. శిల్పకళాశిక్షణ

దేవాలయ నిర్మాణానికి అవసరమైన శిల్పకళ, స్థపత్యశాస్త్రం, ప్రతిమా నిర్మాణం వంటి విద్యల్లో శిక్షణ.రాయి, లోహం, చెక్కలతో విగ్రహాలు తయారు చేసే కళాకారులకు ప్రోత్సాహం.

2. చేతివృత్తులు (Handicrafts)

హస్తకళలు, చేతిపనులు, సంప్రదాయ కళలు నేర్పించే శిక్షణ కేంద్రాలు. గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేందుకు కుట్టు, నేయడం వంటి నైపుణ్య శిక్షణ.

విద్యా క్షేత్రంలో సేవలు

వేద పాఠశాలలు

దేశంలోని అనేక ప్రాంతాలలో వేదపాఠశాలలను స్థాపించి గురుకుల విధానంలో విద్యను అందిస్తున్నారు. రుగ్వేద, యజుర్వేద, సామవేద మొదలైన వేదశాఖలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. సంహితా పఠనం మాత్రమే కాకుండా బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్తులు, వేదాంగాల అధ్యయనం కూడా జరుగుతుంది. విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, విద్యాసామగ్రి, అవసరమైన ఇతర సౌకర్యాలను పీఠం సమకూర్చుతోంది. గురువుల సన్నిధిలో విద్యార్థులు నివసిస్తూ విద్యాభ్యాసం చేయడం వల్ల వేదాధ్యయనం సంపూర్ణతను పొందుతుంది. బెంగళూరు, ఆంధ్రప్రదేశ్‌లోని ముక్కామల వంటి ప్రాంతాలలో కూడా పీఠం

నిర్వహిస్తున్న వేద పాఠశాలలు కొనసాగుతున్నాయి.

1. కామకోటి వేద పాఠశాల, తిరుపతి, ఆంధ్రప్రదేశ్

2. శుక్ల యజుర్వేద పాఠశాల, విజయనగరం, ఆంధ్రప్రదేశ్

3. వేద పాఠశాల, చెరుకుపల్లి, హైదరాబాద్, తెలంగాణ

4. వేద పాఠశాల, అమర్‌కంటక్, మధ్యప్రదేశ్

5. వేద పాఠశాల, జగ్గయ్యపేట, ఆంధ్రప్రదేశ్

6. వేద పాఠశాల, మహేంద్ర మంగళం, తమిళనాడు

7. వేద పాఠశాల, రాణీపూల్, సిక్కిం

8. వేద పాఠశాల, తండలం, తమిళనాడు

9. యజుర్వేద పాఠశాల, ముక్కామల, ఆంధ్రప్రదేశ్

10. కాంచీ కామకోటి పీఠం వేద పాఠశాల, తిరువానైకోయిల్, త్రిచీ

శాస్త్ర పాఠశాలలు

వేదాధ్యయనానికి అనుబంధంగా సంస్కృత శాస్త్రాలలో కూడా పీఠం ప్రత్యేక పాఠశాలలను నిర్వహిస్తోంది. వ్యాకరణం, మీమాంస, న్యాయ, వేదాంత, సాహిత్యం మొదలైన శాస్త్రాలలో ఉన్నత స్థాయి అధ్యయనం ఈ పాఠశాలలలో జరుగుతుంది. పాణినీయ వ్యాకరణం, మీమాంస సూత్రాలు, న్యాయ తర్కశాస్త్రం, ఉపనిషత్తులు, వేదాంత సిద్ధాంతాలు వంటి విభాగాలలో విద్యార్థులకు గాఢమైన శిక్షణ ఇవ్వబడుతుంది.

11. శంకర సంస్కృత పాఠశాల, బెంగళూరు, కర్ణాటక

10. శంకర సంస్కృత పాఠశాల, తిరుపతి, ఆంధ్రప్రదేశ్

12. శంకర సంస్కృత పాఠశాల, గదౌలి ధామ్, ఉత్తరప్రదేశ్

13. శాస్త్ర సరణి పాఠశాల, కాంచీపురం, తమిళనాడు

14. కామకోటి త్రివేణి విద్యార్థి వసతి గృహం, పొదిలి, ఆంధ్రప్రదేశ్

15. కాంచీ కామకోటి సుందర హనుమాన్ పాఠశాల,విజయవాడ, ఆంధ్రప్రదేశ్

16. శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి రామాయణ పాఠశాల, పూనమల్లీ, చెన్నై

17. వేదిక్ హయ్యర్ లెర్నింగ్ సెంటర్, నెరూర్, తమిళనాడు

ఆగమ, పౌరోహిత్య పాఠశాలలు

దేవాలయ ఆరాధన విధానాలు ఆగమ శాస్త్రాల ఆధారంగా జరుగుతాయి. ఈ సంప్రదాయాన్ని పరిరక్షించడానికి శ్రీ కాంచీ కామకోటి పీఠం ఆగమ విద్యకు ప్రత్యేక ప్రాధాన్యాన్ని ఇస్తోంది. శైవ, వైష్ణవ, శక్త ఆగమాల ప్రకారం ఆలయాలలో జరిగే పూజా విధానాలు, ఆలయ నిర్వహణ పద్ధతులు, ఆచార సంప్రదాయాలను బోధించే శిక్షణా కేంద్రాలను నిర్వహిస్తోంది. ఈ పాఠశాలల ద్వారా దేవాలయాలలో శాస్త్రోక్తంగా సేవ చేయగల అర్చకులు, ఆగమ పండితులు తయారవుతున్నారు. అలాగే గృహ సంస్కారాలన్నీ ధర్మశాస్త్రములపై ఆధారపడి ఉంటాయి. వాటికోసం పౌరోహిత్య పాఠశాలలు అవసరం.

18. కామకోటి ప్రసాద పాఠశాల,కొడిగుడెం, ఆంధ్రప్రదేశ్

19. ఆగమ పాఠశాల, మాయవరం, తమిళనాడు

20. రుషి కృషి పాఠశాల, కావేరిపుంపట్టణం, తమిళనాడు

21. పాంచరాత్ర పాఠశాల, తిరుపతి, ఆంధ్రప్రదేశ్

22. సంగీత పాఠశాల, చెన్నై, తమిళనాడు

23. శంకర పురోహిత పాఠశాల, పరుటిపట్టు, చెన్నై

24. శంకర పురోహిత పాఠశాల తిండివనం, తమిళనాడు

25. శైవాగమ పాఠశాల, తిరుపతి, ఆంధ్రప్రదేశ్

26. శివాగమ పాఠశాల, ముక్కామల, ఆంధ్రప్రదేశ్

27. స్మార్త పాఠశాల, వూలపల్లి, ఆంధ్రప్రదేశ్

28. స్మార్త పాఠశాల, తిరుపతి, ఆంధ్రప్రదేశ్

29. స్మార్త పాఠశాల, సామర్లకోట, ఆంధ్రప్రదేశ్

30. వైఖానస పాఠశాల, అవడి, చెన్నై, తమిళనాడు

31. మహా ప్రసాద పాఠశాల, తిరుపతి, ఆంధ్రప్రదేశ్

సంప్రదాయ పాఠశాలలు

భవిష్యత్ తరాలు తల్లి ఒడికి దూరం కాకూడదనే సదాశయంతో పీఠం ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా సంప్రదాయ పాఠశాలలను నిర్వహిస్తోంది. ఈ పాఠశాలలలో విద్యార్థినులకు సాధారణ విద్యతో పాటు భారతీయ సంస్కృతి ఆధారిత శిక్షణను అందిస్తున్నారు. చదువుతో పాటు సంస్కారం, సద్గుణాలు, కుటుంబ విలువలను బోధిస్తున్నారు. ఈ పాఠశాలలలో సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి కళలలో నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు భారతీయ సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నారు.

32. సంప్రదాయ పాఠశాల, మహబూబ్‌నగర్, తెలంగాణ

33. సంప్రదాయ పాఠశాల, విజయవాడ, ఆంధ్రప్రదేశ్

34. సంప్రదాయ పాఠశాల, పూణే, మహారాష్ట్ర

35. సంప్రదాయ పాఠశాల,హైదరాబాద్, తెలంగాణ

36. సంప్రదాయ పాఠశాల, నాసిక్, మహారాష్ట్ర

37. సంప్రదాయ పాఠశాల, తిరుపతి, ఆంధ్రప్రదేశ్

38. సంప్రదాయ పాఠశాల, తిరువానైకోయిల్, తమిళనాడు

వృత్తి విద్యా పాఠశాలలు

పీఠం విద్యా కార్యక్రమాలు కేవలం వేద-శాస్త్ర విద్యలకే పరిమితం కాకుండా సమాజంలోని యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే వృత్తి విద్యకు కూడా విస్తరించాయి. సంప్రదాయ కళలు, చేతివృత్తులు, సాంకేతిక నైపుణ్యాలలో శిక్షణ ఇచ్చే వృత్తి విద్యా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా గ్రామీణ యువత స్వయం ఉపాధి సాధించడానికి అవసరమైన నైపుణ్యాలను పొందుతున్నారు.

నాదస్వర పాఠశాలలు

దక్షిణ భారత దేవాలయ సంస్కృతిలో సంగీతానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా నాదస్వర వాయిద్యం దేవాలయ ఉత్సవాలలో, నిత్యసేవలలో ప్రధానపాత్ర పోషిస్తుంది. ఈ సంప్రదాయాన్ని పరిరక్షించడానికి పీఠం నాదస్వర పాఠశాలను నిర్వహిస్తోంది. ఈ పాఠశాలలో విద్యార్థులకు నాదస్వర వాయిద్యం, సంగీతశాస్త్రం, దేవాలయ సంగీత విధానాలలో శిక్షణ ఇస్తారు. ఈ విద్యను అభ్యసించిన విద్యార్థులు తరువాత దేవాలయాలలో సంగీత సేవను కొనసాగించడమే కాకుండా ఉన్నత విద్యను కూడా అభ్యసించే అవకాశాలను పొందుతున్నారు. కొంతమంది విద్యార్థులకు ఉపకారవేతనాల ద్వారా ఆర్థిక సహాయం కూడా అందుతోంది.

39. నాదస్వర పాఠశాల-బాలురు, కార్వేటి నగరం, ఆంధ్రప్రదేశ్

40. నాదస్వర పాఠశాల -బాలికలు, కార్వేటినగరం, ఆంధ్రప్రదేశ్

41. నాదస్వర పాఠశాల, బెంగళూరు, కర్ణాటక

42. నాదస్వర పాఠశాల, ముక్కామల, ఆంధ్రప్రదేశ్

కుంభకార పాఠశాల

భారతీయ సంప్రదాయంలో కుంభకార కళకు ప్రత్యేక స్థానం ఉంది. మట్టి పాత్రలు, దీపాలు, యజ్ఞకుండాలు, ఆలయ అవసరాలకు సంబంధించిన అనేక వస్తువులు ఈ కళ ద్వారా తయారవుతాయి. ఈ సంప్రదాయ కళను పరిరక్షించడానికి పీఠం కుంభకార పాఠశాలను కూడా నిర్వహిస్తోంది. ఈ పాఠశాలలో మట్టితో వివిధ రకాల పాత్రలు తయారు చేసే విధానం, సంప్రదాయ రూపకల్పన పద్ధతులు, కళాత్మక నైపుణ్యాలను విద్యార్థులకు బోధిస్తున్నారు.

43. కాంచీ కామకోటి ప్రజాపతి కుంభకార పాఠశాల, కార్వేటినగరం, ఆంధ్రప్రదేశ్

గోసంరక్షణ పాఠశాల

భారతీయ సంస్కృతిలో గోమాతకు అత్యంత పవిత్రమైన స్థానం ఉంది. గోసంరక్షణ, గోపోషణ భారతీయ ధార్మిక సంప్రదాయంలో ముఖ్యమైన అంశం. ఈ నేపథ్యంలో పీఠం గోసంరక్షణకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోంది. గోపోషణ, పశుసంరక్షణ, గోశాల నిర్వహణ, గో ఉత్పత్తుల వినియోగం వంటి అంశాలలో శిక్షణ ఇస్తోంది. ఇది వ్యవసాయ ఆధారిత జీవన విధానాన్ని బలోపేతం చేయడంలో కూడా సహాయపడుతోంది.

44. భారతీయ గో విజ్ఞాన పాఠశాల, అదవిపల్లి, ఆంధ్రప్రదేశ్

విద్యార్థి సహాయ కార్యక్రమాలు

విద్యాసంస్థల నిర్వహణతో పాటు విద్యార్థులకు పీఠం వివిధ సహాయ కార్యక్రమాలను అమలు చేస్తోంది. వేదపాఠశాల విద్యార్థులకు పోషణ, వసతి, విద్యాసామగ్రి ఉచితంగా అందిస్తోంది. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఇతర ఆర్థిక సహాయాన్ని కూడా సమకూరుస్తోంది. సారాంశంగా చెప్పాలంటే, శ్రీ కాంచీ కామకోటి పీఠం ప్రతిపాదించిన "బడి-గుడి-తల్లి ఒడి" అనే సూత్రం భారతీయ సమాజ నిర్మాణానికి సమగ్ర మార్గదర్శకంగా నిలుస్తోంది. విద్య, ఆధ్యాత్మికత, కుటుంబ సంస్కారాలను సమన్వయ పరుస్తూ భవిష్యత్ తరాలను సంస్కారవంతమైన, ధార్మికమైన జీవన విధానంలో తీర్చిదిద్దే మహత్తర ప్రయత్నాన్ని ఈ పీఠం కొనసాగిస్తోంది. భారతీయ సంస్కృతి పరిరక్షణలో ఈ సేవలు చిరస్మరణీయమైనవిగా నిలుస్తాయి. ★

మార్క్సిజం-శ్రీరామరాజ్యం

రూసో చెప్పిన తత్వం

ది సోషల్ కాంట్రాక్ట్ - ఎమిలే వంటి రచనలకు ప్రసిద్ధి చెందిన రూసో, మానవులు సహజంగానే మంచివారే కానీ సమాజం వల్ల కలుషితమవుతారని వాదించాడు. ఆయన ప్రజా సార్వభౌమాధికారం, ప్రత్యక్ష ప్రజాస్వామ్యం, సమతుల్యమైన వ్యక్తిగత స్వేచ్ఛ ప్రాముఖ్యత అనే భావనలను సమర్థించాడు. సామ్రాజ్యం అనే పదాన్ని వ్యతిరేకార్థంలో అతడు వినియోగించాడు. ఇది రామరాజ్య భావనకు వ్యతిరేకమైనది.

1722లో పదేళ్ల వయస్సున్న ఫ్రాన్స్‌కి చెందిన బాలుడు రూసో ఒక ఫాదిరీ (క్రైస్తవ మతబోధకుడు) వద్ద పనికి కుదిరాడు. తన చెడు ప్రవర్తన కారణంగా ఆ పని పోగొట్టుకున్నాడు. తరువాత అతడు మరో ఉద్యోగాన్ని వెతుక్కున్నాడు. అక్కడ అతడు పూర్తిగా అబద్ధాలకోరుగా, దొంగగా, చెడుతిరుగుళ్లు తిరిగేవాడిగా మారిపోయాడు. అతడికి తన మిత్రుల వల్ల అన్ని సహకారాలూ అందుతుండేవి. అటుపైన ఒక ధనవంతురాలి కారణంగా అతనికి చదువుకునేందుకు వీలు కలిగింది. అప్పుడు కూడా అతడు పేదలతోనే కలిసి ఉండేవాడు. అతడికి మద్యం దుకాణంలో పనిచేసే ఒక స్త్రీతో సంబంధం ఏర్పడింది. పెళ్లి కాకుండా అతడికి అయిదుగురు పిల్లలు పుట్టారు. 1749 నాటికి అతడు, 'విజ్ఞానం-కళలు అభివృద్ధి చెందడం వల్ల నైతికత వృద్ధి చెందిందా లేక అవనతం అయిందా?' అనే అంశంపై వ్యాసం రాసి, పారితోషికం పొందాడు. ఈ వ్యాసం రాసే క్రమంలో అతడి జీవితంలో పరివర్తన ఏర్పడింది. ఆ వ్యాసంలో అతడు, 'విజ్ఞానం-కళలు అభివృద్ధి చెందగా... నైతికత వృద్ధికాలేదు సరికదా పతనం చెందింది' అని రాశాడు. ఆ తరువాత అతడు అనేక పుస్తకాలు రాశాడు. దాంతో ఆవారాగా తిరిగిన రూసో కాస్తా దార్శనికుడిగా మారిపోయాడు. 'అసమానతలు ఎలా పుట్టాయి' అనే అంశంపై 1754లో ఒక పుస్తకం రచించాడు. దానిలో ప్రాకృతిక స్థితిని, రాజ్యం పుట్టుకను వివరించాడు. ఒక వ్యాసంలో, 'ఆదర్శవంతమైన సామాన్యుల కోరికలు' 'ఆదర్శ రాజ్యం' అనే అంశాలను వర్ణించాడు. విద్యా సంబంధమైన పుస్తకంలో, 'మతం చేత ప్రభావితం అయ్యే విద్య'ను తిరస్కరించాడు. దానివల్ల అతడికి తాత్కాలికంగా మతబోధకుల లోనూ, ప్రభుత్వంలోనూ విభేదాలు పొడసూపాయి.

రూసోకాలంలో రైతుల పరిస్థితి శోచనీయంగా ఉండేది. మధ్యతరగతి ప్రజల్లో నిరాశ, నిస్పృహల నీడలు కమ్ముకుని ఉండేవి. ఆయన అభిప్రాయంలో, 'మానవులలో భావనాబలం వివేకం చేతనే పెరుగుతుంది...ఆధునిక కాలంలోని సభ్యత మానవుడిని నీతిలేని వాడిగా, వ్యభిచారిగా మార్చి వేసింది. ఇలాంటి సభ్యత ఏర్పడడానికి పూర్వం వ్యక్తుల జీవనం ఆదర్శమయంగా ఉండేది. ఆ కాలంలోని ఇతర తాత్వికులంతా నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇస్తే... రూసో మాత్రం స్వతంత్రతకు సర్వోన్నత స్థానం కల్పించాడు. అతడు రాజతంత్రానికి ప్రబల విరోధి. ఎల్లవేళలా పేదలు, రైతుల గురించి మాత్రమే మాట్లాడిన ఆదర్శ దార్శనికుడు.

అతడి అభిప్రాయంలో, ప్రాకృతిక యుగంలో... ఆధునిక కాలంలో కనిపించే విపరీత ధోరణులు ఉండేవి కావు. అలాగే ఆధునికులలోని మంచితనం కూడా వారికి లేదు. సంక్షిప్తంగా.... అదో మంచి వాళ్లతో కూడిన ఆటవిక స్థితి అని చెప్పడం ఉత్తమం. ప్రాకృతిక మానవులకు న్యాయం, అన్యాయం, మృత్యువు వంటి వాటికి సంబంధించిన జ్ఞానం కూడా లేదు. వారితో చెడ్డతనం అనేది సమాజంతో సంపర్కం వల్లనే వచ్చిపడింది. హాబ్స్ చెప్పిన 'నైతికత' అనేది సమాజం నుంచే పొందాలి' అనే తత్వ సిద్ధాంతాలను రూసో ఖండించాడు.

భారతీయ ఆర్ష సాహిత్య దృష్టితో చూసినప్పుడు, హాబ్స్ - రూసో ఇద్దరూ చేసిన ప్రాకృతిక స్థితి వర్ణనలు అసంగతాలుగా అనిపిస్తాయి. ఎందుకంటే మనవారి అభిప్రాయంలో సత్వగుణం వికసిస్తున్న కాలంలోనే నైతికత, నాగరికత ఉండేవి. హాబ్స్ ప్రకారం నాయకులను అనుసరించే మానవులే నాగరికతకు జన్మదాతలుగా మారారు. వ్యక్తిగత సంపత్తి, అసమానతలే నాగరికతలు ఏర్పడడానికి మూలం అయ్యాయి.

రూసో విశ్వాసం ప్రకారం, 'మానవుడు మంచివాడే. కానీ సమాజ పరిస్థితుల్లో తప్పుదారి పట్టాడు.' సంప్రదాయం, సామ్రాజ్యం, నాగరికత మొదలైన శబ్దాల అర్థాలు శ్రేష్ఠమైనవే అయినప్పటికీ పాశ్చాత్య దేశాలలో వాటిని చెడ్డగా ఉపయోగించినందువల్ల వాటిని 'మతోన్మాదం', 'అణగదొక్కడం', 'అసమానత' వంటి అర్థాల్లో వినియోగించసాగారు.

రామరాజ్యంలోని సామ్రాజ్య భావన ఇటువంటి అర్థాన్నే ఇస్తుంది. రామరాజ్యంలో మానవులకే కాదు... పశుపక్ష్యాదులకు సైతం సరళమైన,సరియైన న్యాయం లభిస్తుండేది. రూసో ప్రకారం, 'అసమానతలను పోగొట్టకుండా కాపాడడానికే పోలీసు,ప్రభుత్వ యంత్రాంగాల అవసరం ఏర్పడింది. ఈ యంత్రాంగం ద్వారానే ధనవంతుల దుష్ప్రవర్తన శాశ్వతంగా ఉండిపోవడానికి తోడ్పాటు దొరికింది.

మానవుడు స్వేచ్ఛా జీవి. కానీ అనేక సంకెళ్లతో బద్ధుడయ్యాడని రూసో రాశాడు. స్వతంత్రతను సురక్షితం చేసుకోవడానికి సువ్యవస్థిత రాజ్యం ఏర్పడింది. పౌరులను కొన్ని పరిమితులకు లోబడి నడుచుకునేలా చేయకుండా... ఏ ఒక్క సంఘమూ ఏర్పడి ఉండే అవకాశం లేదు. సమాన హక్కులను, ఉద్దేశ్యాలనూ పూర్తి చేయడానికి అందరినీ ఏక తాటిపైకి తీసుకురావడానికి... అందరి మనస్సులూ ఇచ్ఛలనూ ఒక పరిమితి లోనికి తీసుకురావడమే వాస్తవిక రాజ్యస్థాపన అవుతుంది.

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

రాష్ట్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంచనాలు గత యేడాది కంటే పెరిగాయి. అయితే పైకి ఈ అంకెలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నా ఈ బడ్జెట్ వెనక దాగిన ఆర్థిక వాస్తవాలు మాత్రం అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని ప్రతిపక్షాల నాయకులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను మార్చి 20న ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో, శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధరబాబు శాసనమండలిలో ప్రవేశపెట్టారు. మొత్తం రూ. 3,24,234 కోట్ల పద్దులో రెవెన్యూ వ్యయం కోసం ఏకంగా రూ. 2,34,406 కోట్లు, మూలధన వ్యయం కోసం రూ. 47,267 కోట్లు కేటాయించారు.

విద్య, మానవ వనరులకు రూ. 26,674 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ. 23,179 కోట్లు, వైద్య ఆరోగ్య శాఖకు రూ. 13,679 కోట్లు, విద్యుత్ శాఖకు రూ. 21,285 కోట్లు, పౌర సరఫరాల శాఖకు రూ. 7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ. 1,529 కోట్లు కేటాయించారు. కార్మిక సంక్షేమానికి రూ. 999 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి రూ. 3,143 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ. 11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి – రూ. 7,937కోట్లు, బీసీ సంక్షేమానికి రూ. 12,511 కోట్లు, మైనారిటీ సంక్షేమానికి రూ. 3,769 కోట్లు కేటాయించారు. గృహ నిర్మాణశాఖకు రూ. 7,430 కోట్లు, ఐటీ శాఖకు రూ. 875 కోట్లు, పరిశ్రమల శాఖకు రూ. 3,490 కోట్లు, చేనేతశాఖకు రూ. 258 కోట్లు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ. 33,688 కోట్లు, సాగునీటి ప్రాజెక్టులకు రూ. 22,615 కోట్లు, రవాణా శాఖకు రూ. 12,759 కోట్లు, న్యాయ శాఖకు రూ. 2,367 కోట్లు పట్టణాభివృద్ధి, పురపాలక శాఖకు రూ. 17,907 కోట్లు, పర్యాటక శాఖకు రూ. 1,224 కోట్లు ప్రతిపాదించారు. అదే విధంగా శాంతి భద్రతలకు రూ. 11,907 కోట్లు, గోదావరి పుష్కరాలకు రూ. 500 కోట్లు, కేటాయించారు. పథకాల వారీగా చూస్తే... మహాలక్ష్మి పథకానికి రూ. 4,305 కోట్లు, చేయూత పథకానికి రూ. 14,861 కోట్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రూ. 5,500 కోట్లు, రాజీవ్ యువ వికాసం పథకానికి రూ. 6వేల కోట్లు కేటాయింపులు జరిగాయి. అలాగే, పశుసంవర్ధక శాఖకు రూ. 1,529 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ. 23,179 కోట్లు కేటాయించారు.

కాంగ్రెస్ తమ ఎన్నికల మానిఫెస్టోలో ప్రకటించిన పలు పథకాలు, కార్యక్రమాలు ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కావడంలేదు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఇప్పుడు మరో కొత్త పథకాన్ని బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ జూన్ 2వ తేదీ నుంచి ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కాలేజీల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేస్తామని, ఐటీఐ విద్యార్థులకు నెలకు రూ. 2,000 చొప్పున ఉపకార వేతనం అందించనున్నట్లు ప్రకటించారు. అమలు కాని పాత పథకాలకు తోడు.. కొత్తవిబ ఎలా అమలవుతాయో, ఎప్పటి నుంచి ప్రారంభమవుతాయో అన్న చర్చ అప్పుడే మొదలయ్యింది.

క్లిష్టంగా ఆర్థిక పరిస్థితి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత గడ్డు స్థితిలో ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యమంత్రే బహిరంగంగా చేసిన ప్రసంగాలు, వ్యాఖ్యలను ఉటంకిస్తున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లెక్కల ప్రకారం రాష్ట్ర ఆర్థిక లోటు రూ. లక్షల కోట్లలో ఉంది. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను కొనసాగించడం కోసం ప్రభుత్వం అనివార్యంగా కొత్తగా అప్పులు చేయాల్సి వస్తోందని మంత్రులు, అధికారులే చెబుతున్నారు. ఇప్పుడు బడ్జెట్‌లో చేర్చిన వ్యయాల కోసం కూడా మళ్లీ భారీగా అప్పులు తీసుకోవాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.

అప్పుల మీదనే ప్రభుత్వం ఆధారపడ్డట్లు ఈ బడ్జెట్‌తో స్పష్టమవుతోందని ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. విద్యాశాఖకు 15 శాతం నిధులు ఇస్తామన్న ప్రభుత్వం చెబుతున్నా గత మూడు బడ్జెట్లలో ఆ మేరకు కేటాయించలేదని విమర్శిస్తున్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఈ బడ్జెట్‌ను 'ఫెయిల్డ్ బడ్జెట్'గా అభివర్ణించారు. రైతులకు బకాయిలు చెల్లించకపోవడం, విద్యకు సరిపడా నిధులు కేటాయించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

అప్పుల మీదనే ప్రభుత్వం ఆధారపడ్డట్లు ఈ బడ్జెట్‌తో స్పష్టమవుతోందని ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. విద్యాశాఖకు 15 శాతం నిధులు ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా గత మూడు బడ్జెట్లలో ఆ మేరకు కేటాయించలేదని విమర్శిస్తున్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఈ బడ్జెట్‌ను 'ఫెయిల్డ్ బడ్జెట్'గా అభివర్ణించారు. రైతులకు బకాయిలు చెల్లించకపోవడం, విద్యకు సరిపడా నిధులు కేటాయించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

ఆకర్షణ – లో అప్పుల మయం

ఈ బడ్జెట్‌ను 'నంబర్ గారడీ' అని ఆరోపించారు. బీసీ సబ్ ప్లాన్ ఊసే లేదని, బడ్జెట్లో బీసీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. సామాజిక న్యాయమని గొంతు చించుకునే కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇది హాట్రిక్ చీటింగ్ బడ్జెట్, ఊహా జనిత బడ్జెట్ అని, హామీల అమలు ప్రస్తావన లేదని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారెంటీలకు కేటాయింపులు లేవని, మైనార్టీలకు బడ్జెట్‌లో మొండిచేయి చూపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్న రేళ్లలోనే రూ. 3.5 లక్షల కోట్లు అప్పు తెచ్చిందని, ఆ తెచ్చిన అప్పులు దేనికి ఖర్చు చేశారని ప్రశ్నించారు.

2023 ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఆరు గ్యారెంటీల పేరుతో మేనిఫెస్టో విడుదల చేశారు. హామీలు గుప్పించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వాటిలో ప్రధానంగా చెప్పుకోవచ్చు. అయితే, ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయినా, ఆ హామీలు పూర్తిగా అమలు కావడం లేదు. కొన్ని మాత్రం అమలవుతున్నా.. పూర్తి హామీల అమలు ప్రశ్నార్థకంగానే కనిపిస్తోంది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇప్పటికే ఆందోళనకరంగా ఉంది. ఈ బడ్జెట్ గణాంకాలను పరిశీలిస్తే, రాష్ట్రం వేగంగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్న విషయం అర్థమవుతోంది. వచ్చే ఏడాది మార్చి నాటికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులు రూ. 8.64 లక్షల కోట్లకు చేరనున్నాయి. ఇందులో ప్రభుత్వం నేరుగా ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో చేసిన అప్పులు రూ. 5.62 లక్షల కోట్లు కాగా.. గ్యారంటీలు, కార్పొరేషన్ల బాకీలు కలిపి మరో రూ. 3.01 లక్షల కోట్లుగా ఉంటాయి. రాష్ట్రంలో ఒక్కొక్కరిపై రూ. 2.46 లక్షల అప్పు ఉంది. ఒకవైపు సంక్షేమ పథకాల అమలుకు నిధుల వేట కొనసాగిస్తూనే, మరోవైపు పాత అప్పులకు వడ్డీలు, అసలు కట్టాల్సి రావడం రాష్ట్ర ప్రభుత్వానికి తలకు మించిన భారంగా మారింది.

వచ్చే ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి సర్కారు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోని నేరుగా చేసే అప్పులే రూ. 5,62,363 కోట్లకు చేరుకుంటాయి. ఇది రాష్ట్ర జీఎన్‌డీపీలో ఏకంగా 29 శాతం కావడం గమనార్హం. సాధారణంగా ఈ మొత్తం 25 శాతంలోపే ఉండాలి. 2023-24లో 27 శాతంగా ఉన్న ఈ అప్పుల శాతం, కేవలం మూడేళ్లలో 29 శాతానికి పెరగడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారుతుందనడానికి నిదర్శనమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ అప్పులకు తోడు ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రతి ఏటా కొత్తగా అప్పులు చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. కేవలం వచ్చే సంవత్సరంలోనే బహిరంగ మార్కెట్ నుంచి రూ. 73,383 కోట్ల రుణాలను సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది కాకుండా కేంద్రం నుంచి రూ.5,500 కోట్లు, ఇతర రుణాలు రూ. వెయ్యి కోట్లు, ఇతర డిపాజిట్లు, అడ్వాన్స్‌లతో రూ. 2,986 కోట్లు అప్పు తీసుకోనున్నట్టు వెల్లడించింది.

ఇటు కార్పొరేషన్లు ఇతర సంస్థలకు సర్కారు గ్యారంటీపై తీసుకున్న అప్పులు కూడా కొండలా పేరుకుపోతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఉన్న అప్పులు రూ.2,41,743 కోట్లు ఉండగా, గ్యారంటీ లేని కార్పొరేషన్ అప్పులు మరో రూ. 60,092 కోట్లు ఉన్నాయి. ఫలితంగా, నాన్- ఎఫ్ఆర్? బీఎం అప్పులే రూ. 3,01,835 కోట్లకు చేరుకున్నాయి.

ప్రజల నెత్తిన వడ్డీ భారం

రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం 2026-27లో రూ. 1,48,186 కోట్లుగా ఉండవచ్చని అంచనా వేస్తున్నప్పటికీ, అందులో దాదాపు సగం మొత్తం పాత అప్పుల చెల్లింపులు, వడ్డీలకే వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలతో దేశంలోనే ముందున్నామని చెప్పుకుంటున్నా, దానికి సమాంతరంగా ప్రతి పౌరుడిపై లక్షలాది రూపాయల అప్పుల భారం పెరిగిపోతోంది. అప్పుల ఊబి నుంచి గట్టెక్కేందుకు తక్కువ వడ్డీ రుణాల వైపు మళ్లుతున్నామని, ఆఫ్ -బడ్జెట్ రుణాలను బడ్జెట్ పరిధిలోకి తెస్తున్నామని ప్రభుత్వం వివరిస్తున్నా, అసలు రుణభారం మాత్రం పెరుగుతూనే ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 19,639 కోట్ల వడ్డీ చెల్లింపులు ఉంటాయని అంచనా వేయగా, జనవరి నాటికే రూ. 24,085 కోట్లు చెల్లించారు. మార్చి నాటికి ఈ మొత్తం రూ. 30,000 కోట్లకు చేరే అవకాశం ఉంది. ప్రజా సంక్షేమానికి వినియోగించాల్సిన డబ్బులు బ్యాంకులకు వడ్డీల రూపంలో వెళ్తోంది. దీనికి బాధ్యులు ఎవరు? ఈ ప్రశ్నకు రాష్ట్రాన్ని పాలించిన, పాలిస్తున్నవారు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

వ్యవసాయ, పౌల్ట్రీల్లో యుద్ధ సంక్షోభం

పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం దేశ వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి. భౌతికంగా యుద్ధం పశ్చిమ దేశాల్లో జరుగుతున్నప్పటికీ, దాని ఆర్థిక ప్రకంపనలు ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. భారతీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు ప్రధాన కేంద్రమైన గల్ఫ్, పశ్చిమాసియా మార్కెట్ల రవాణా మార్గాలు మూసుకుపోవడంతో వేలాది కోట్ల రూపాయల వ్యాపారం నిలిచిపోయి, రైతులు, ఎగుమతిదారులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారు.



మనదేశం నుంచి పశ్చిమాసియా దేశాలకు గతేడాది ఏకంగా రూ.1,08,898 కోట్ల విలువైన ఆహారోత్పత్తులు ఎగుమతి అయ్యాయి. ఇది మన దేశ మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో ఐదో వంతుకు పైమాటే. ఇందులో కేవలం బియ్యం ఎగుమతుల విలువే రూ.40,876 కోట్లు. ఈ బియ్యం ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు హరియాణా, కర్ణాటక, పంజాబ్, మహారాష్ట్రల నుంచి ఎగుమతి అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా భారత్ నుంచి ఎగుమతి అయ్యే బియ్యంలో ఇది 36.7 శాతం. అయితే, ఈ ఎగుమతి, దిగుమతుల రవాణాకు అత్యంత కీలకమైన 'హోర్మూజ్ జలసంధి' యుద్ధ భయాల కారణంగా మూతబడటం లేదా అత్యంత ప్రమాదకరంగా మారడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. సాధారణ రోజుల్లో చెన్నై, కాకినాడ, విశాఖ, ముంబై, ముంద్రా వంటి ప్రధాన రేవుల నుంచి గల్ఫ్ దేశాలకు (యూఏఈ, సౌదీ అరేబియా, ఒమన్, కువైట్) రోజూ 2500 నుంచి 3000 కంటెయినర్ల ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యేవి. ఇందులో 25% వాటా త్వరగా పాడయ్యే గుడ్లు, పండ్లు, కూరగాయలు, మాంసం (పెరిషబుల్ గూడ్స్) ఉత్పత్తులదే. సముద్ర మార్గంలో దాడుల భయంతో ప్రస్తుతం ఈ కంటెయినర్ల సంఖ్య 1200 – 1500కు పరిమిత మైంది.అంటే ఎగుమతులు 40–50 శాతం క్షీణించాయి. సుమారు 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఓడరేవుల్లోనే నిలిచిపోయాయి. ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ, చెన్నై, కృష్ణపట్నం ఓడరేవుల నుంచి వెళ్లాల్సిన చేపలు, రొయ్యలతో పాటు సుమారు 3 లక్షల టన్నుల బియ్యం మార్గమధ్యంలోనే ఆగిపోయాయి. నాసిక్ నుంచి దుబాయ్‌కి వెళ్లాల్సిన 800 కంటెయినర్ల ద్రాక్ష (సుమారు 10 వేల టన్నులు) రేవుల్లోనే ఉంది. ఉల్లిపాయలు, అరటిపండ్లు నింపిన 300 ఏసీ కంటెయినర్లు, ఒక్కో పోర్టులో 10 వేల టన్నుల ఇతర పండ్లు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ముంబయి, గుజరాత్, చెన్నై పోర్టుల నుంచి వెళ్లాల్సిన సుగంధ ద్రవ్యాల పరిస్థితి కూడా ఇదే.

అరటి రైతులకు యుద్ధ సెగ

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 70 వేల హెక్టార్లకు పైగా అరటి సాగువుతోంది. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి, ప్రకాశం, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల రైతులు దీనిని ప్రధాన నగదు పంటగా సాగు చేస్తున్నారు. యూఏఈ, ఖతార్, సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్‌లో రంజాన్ మాసంలో జి9, రోబస్టా రకం అరటికి అత్యంత డిమాండ్ ఉంటుంది. కానీ యుద్ధ ఉద్రిక్తతల వల్ల ఎగుమతులపై అనిశ్చితి నెలకొనడంతో వ్యాపారులు కొనుగోలు ధరలను అమాంతం తగ్గించేశారు. ఫిబ్రవరిలో టన్నుకు రూ.25 వేలు అరటి ధర, ఇప్పుడు స్థానిక మార్కెట్లలో రూ.16 వేలకు పడిపోయింది. ఎరువుల ధరలు, రవాణా ఖర్చులు, కార్మికుల కొరతతో సతమత మవుతున్న రైతులకు ఈ ధరల పతనం చావుదెబ్బగా మారింది.

కుదేలైన కోనసీమ కొబ్బరి మార్కెట్

ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్

కోనసీమ, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, శ్రీకాకుళం జిల్లాల్లో దాదాపు 1.1 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు జరుగుతోంది. రంజాన్ మాసంలో దుబాయ్, కువైట్, ఒమన్, సౌదీ అరేబియా లాంటి దేశాలకు ఇక్కడి నుంచి కొబ్బరికాయలు భారీగా ఎగుమతి అవుతాయి. కానీ, ముంబయి, చెన్నై, తూత్తుకుడి పోర్టుల్లో కంటెయినర్లు నిలిచి పోవడం, షిప్పింగ్ షెడ్యూళ్లు రద్దు కావడంతో స్థానిక మార్కెట్లో కొబ్బరికాయల సరఫరా విపరీతంగా పెరిగిపోయింది. నెల క్రితం వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.18,000 – 20,000 వరకు ఉండగా, ప్రస్తుతం అది రూ.13,000 – 14,000కు పడిపోయింది (దాదాపు 30% క్షీణత). మార్కెట్లో రిటైల్ ధర రూ.50 నుంచి రూ.30 కి పడిపోవడం వల్ల వినియోగ దారులకు లాభం చేకూరినా, రైతులు మాత్రం శివరాత్రి, ఉగాది, శ్రీరామనవమి పండుగలపై పెట్టుకున్న ఆశలన్నీ అడియాశ లయ్యాయి. నిల్వ ఉంచితే సరకు పాడయ్యే ప్రమాదం ఉండటంతో తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

నిలిచిపోయిన మామిడి గుజ్జు

అమెరికా, ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా మధ్యప్రాచ్య ప్రాంతానికి ఆంధ్రప్రదేశ్ నుంచి జరిగే మామిడి గుజ్జు ఎగుమతులు ఒక్కసారిగా నిలిచి పోయాయి. రాష్ట్రంలో మామిడి గుజ్జు ఉత్పత్తి చిత్తూరు జిల్లాలో కేంద్రీకృతం అయింది. ప్రస్తుతం మామిడి సీజన్ ప్రారంభ దశలో ఉండగా, తాజా పరిస్థితి రైతులు, పరిశ్రమల యజమానులను ఆందోళనకు గురి చేస్తోంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా గతేడాది మామిడి గుజ్జు (పల్ప్) ఎగుమతులు ఆగిపోయాయి. కిలో మామిడి నాలుగు రూపాయలు కూడా పలక లేదు. ఈ సంవత్సరం మామిడి గుజ్జు ఎగుమతులు ప్రారంభమై సగం పల్ప్ ఎగుమతి అయింది. ఇంతలో అమెరికా–ఇరాన్ యుద్ధం రావడంతో పల్ప్ ఎగుమతులు పూర్తిగా ఆగిపోయాయి. క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే లోపు ఈ పల్ప్ ఎగుమతులు పూర్తికాకుంటే, ఈసారి కూడా మామిడి రైతులకు కష్టాలు తప్పవని వ్యవసాయ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ప్రధానంగా పండే తోతాపురి రకం మామిడి గుజ్జుకు గల్ఫ్ దేశాల్లో మంచి డిమాండ్ ఉంటుంది. ఏటా మార్చి చివరి వారంలోనే మధ్యప్రాచ్య దేశాల నుంచి కొనుగోలు ఒప్పందాలు జరుగుతాయి. ఈసారి ఇరాన్ యుద్ధ పరిస్థితుల ప్రభావంతో సముద్ర మార్గంలో నౌక రవాణాపై అనిశ్చితి నెలకొంది. ఫలితంగా దిగుమతి దారులు ఇప్పటికే కుదుర్చుకున్న సరుకు పంపిణీ ఒప్పందాలను తాత్కాలికంగా రద్దుచేస్తున్నట్లు పరిశ్రమల యజమానులు పేర్కొంటున్నారు.

జిల్లాలో ప్రస్తుతం 47 మామిడి గుజ్జు తయారీ పరిశ్రమలు ఉన్నాయి. గతేడాది నాలుగు లక్షల టన్నుల మామిడికాయలను ప్రాసెస్ చేశారు. రెండు లక్షల టన్నుల పల్ప్ ను ఉత్పత్తి చేశారు. వేసవి కావడంతో ఉత్పత్తి చేసిన గుజ్జు నిల్వల ఎగుమతులు ఇప్పుడిప్పుడే ప్రారంభ మయ్యాయి. లక్ష టన్నుల వరకు ఎగుమతి జరిగింది. ఈ సమయంలో యుద్ధం కారణంగా ఎగుమతులు ఆగిపోయాయి. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో నౌకల రవాణాకు అంతరాయం ఏర్పడటం వల్ల సౌదీ అరేబియా, ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి గల్ఫ్ దేశాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. ప్రస్తుతం లక్ష టన్నులకు పైగా మామిడి గుజ్జు నిల్వగా ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

ఆక్వా ఉత్పత్తులపై ప్రభావం

అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఆంధ్రప్రదేశ్ ఆక్వా రంగాన్ని నిలువునా ముంచేస్తున్నాయి. గల్ఫ్, యూరప్ దేశాలకు వెళ్లాల్సిన సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు అమాంతం ఆగిపోయాయి. తాజా నివేదికల ప్రకారం.. సుమారు 300 మిలియన్ డాలర్ల విలువైన 'సీ ఫుడ్' కంటైనర్లు వివిధ పోర్టుల్లో నిలిచిపోయాయి. ఈ భారీ నష్టంలో దాదాపు 60 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌దే కావడం ఆందోళనకరం. విశాఖపట్నం, ముంబై పోర్టుల నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన రొయ్యలు, చేపల కంటైనర్లు కదలడం లేదు. ఎర్ర సముద్రం, స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ మార్గాల్లో దాడుల భయంతో షిప్పింగ్ నిలిచిపోయింది. ఒకవైపు ఎగుమతులు ఆగిపోతుంటే.. మరోవైపు షిప్పింగ్ కంపెనీలు చార్జీలను రెట్టింపు చేశాయి. ఒక్కో కంటైనర్‌పై 1500 నుండి 4000 డాలర్ల వరకు ఎమర్జెన్సీ సర్‌చార్జీలు వసూలు చేస్తున్నాయి. ముఖ్యంగా రొయ్యలు పాడవకుండా ఉంచే రిఫ్రిజిరేటెడ్ కంటైనర్ల అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. "అమెరికా టారిఫ్‌ల దెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో.. ఈ యుద్ధం మా వెన్ను విరిచింది" అని సీ ఫుడ్ ఎగుమతిదారుల సంఘం తెలిపింది. కోల్డ్ స్టోరేజీలు నిండిపోవడంతో, స్థానిక మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేశారు. దీనివల్ల పల్లెల్లో రొయ్యల ధరలు దారుణంగా పడిపోయే ప్రమాదం కనిపిస్తోంది.

పౌల్ట్రీ రంగంపై మోయలేని భారం

దేశంలో గుడ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. జాతీయ ఉత్పత్తిలో 18 శాతం వాటాతో, రాష్ట్రంలో రోజుకు 5 కోట్లకు పైగా గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి (ముఖ్యంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో). అయితే, యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో సరఫరా గొలుసు దెబ్బతిని, కోళ్ల పెంపకానికి అత్యంత కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్ (ఫీడ్) ధరలు 20 నుంచి 30 శాతం పెరిగాయి. పౌల్ట్రీ ఉత్పత్తి వ్యయంలో 70 శాతం ఫీడ్ కే ఖర్చవుతుంది. రవాణా ఖర్చులు పెరగడం, ఫీడ్ ధరలు ఆకాశాన్నంటడంతో లాభాలు లేక చిన్న, మధ్య తరహా రైతులు కోళ్ల సంఖ్యను తగ్గించుకుంటు న్నారు. కొత్త బ్యాచ్‌లు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. ఇది భవిష్యత్తులో గుడ్లు, మాంసం కొరతకు దారి తీసే ప్రమాదం ఉంది.

బియ్యం, ఇతర ఉత్పత్తులపై అనిశ్చితి

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సీజన్ ధాన్యం మార్కెట్లోకి భారీగా వస్తున్న సమయంలో ఎగుమతులు స్తంభించడం మిల్లర్లలో, రైతుల్లో ఆందోళన పెంచు తోంది. చెన్నై, విశాఖ, కాకినాడ పోర్టుల నుంచి ధాన్యం పశ్చిమ ఆఫ్రికా (నైజీరియా, బెనిన్, టోగో), తుర్కియే, గల్ఫ్ దేశాలకు వెళ్లే ఎగుమతులు ఆగి పోయాయి. ఈ నెల ప్రారంభంలో గల పుట్టి (850 కిలోలు) ధాన్యం ధర రూ.22,500 ఉండగా అది రూ.21,000 కి పడిపోయింది, ఇది మరింత తగ్గే అవకాశం ఉందని అంచనా. వీటితో పాటు ఏటా గల్ఫ్ దేశాలకు వెళ్లే మామిడిపండ్లు, మామిడి పచ్చళ్లు, బత్తాయి, నిమ్మ, మిర్చి, పసుపు, చిరుధాన్యాల ఆర్డర్లు కూడా సందిగ్ధంలో పడ్డాయి.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

శతాబ్ది ఉత్సవాల్లో వేగంగా సమాజంలోకి సంఘం

హిందూ సంఘటన దిశగా వ్యక్తి నిర్మాణం ఆధారంగా స్వయంసేవకులను తీర్చిదిద్దుతూ సమాజపరివర్తనే ధ్యేయంగా సంఘ కార్యం నడుస్తోందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్ అన్నారు.

హరియాణా, సమాళ్ఖాలో మార్చి 13 నుంచి 15 వరకు జరిగిన ఆర్ ఎస్ఎస్ అఖిల భారత ప్రతినిధి సభలలో సంఘ శతాబ్ది సంవత్సరం సందర్భంగా తెలంగాణలోను, దేశవ్యాప్తంగాను చేపట్టనున్న ప్రత్యేక కార్యక్రమాల గురించి మార్చి 18న హైదరాబాద్‌లో జరిగిన మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో ప్రాంత సంఘచాలక్ సుందర్‌రెడ్డి. క్షేత్ర ప్రచారప్రముఖ్ ఆయుష్, ప్రాంత ప్రచార ప్రముఖ్ కట్టా రాజగోపాల్ పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్‌ని స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయిన తరుణంలో సంఘ సిద్ధాంతాన్ని సమాజంలోకి మరింత వేగంగా తీసుకువెళ్లేందుకు, మరెన్నో ప్రత్యేక కార్యక్రమాలను రూపకల్పన చేస్తున్న వేళ అఖిల భారత ప్రతినిధి సభలు జరిగాయన్నారు.

1925లో సంఘం ప్రారంభమైనప్పటి నుంచీ అనేక రకాల సమస్యలు, అవరోధాల నడుమ సంస్థ వృద్ధి చెందుతూ వచ్చిందన్నారు. మీడియా ప్రతినిధులకు కాచం రమేశ్ తెలిపిన ఇతర అంశాలు...

కాచం రమేశ్ సుందర్‌రెడ్డి

దేశమంతటా శతాబ్ది కార్యక్రమాల నివేదిక

శాఖ నివేదిక: మొత్తం మండలాలు:		59,004
శాఖాయుక్త మండలాలు	:	32,305
మొత్తం శాఖ స్థలాలు	:	55,683
శాఖలు	:	88,949
సాప్తాహిక్ మిలన్	:	32,606
సంఘమండలి	:	13,211
మొత్తం (శాఖ, సాప్తాహిక్, మండలి)	:	1,32,766
సేవా కార్యక్రమాలు	:	96,045
విజయదశమి ఉత్సవాలు	**:**	62, 555
తరుణ	:	27,08,186
బాల	:	5,36,955
మొత్తం సంఖ్య	:	32,45,141
గణవేష్‌లో పాల్గొన్నవారు	:	25,45,818
గృహ సంపర్క అభియాన్		
గ్రామాలు	:	3,89,465
బస్తీలు(నగరాలలో)	:	31,143
ఇళ్లు	:	10,02,12,162
వితరణ చేసిన కరపత్రాలు	:	9,11,88,203
పుస్తకాలు	:	84,13, 552

(ఇంకా 9 ప్రాంతాలలో జరుగవలసి ఉన్నది)

తెలంగాణ

శాఖ నివేదిక : మొత్తం మండలాలు	:	1,616
శాఖయుక్త మండలాలు	:	1,329
మొత్తం బస్తీలు	:	1,504
శాఖయుక్త బస్తీలు	:	1,244
శాఖ స్థలాలు	:	2,112
శాఖలు	:	3,492
సాప్తాహిక్ మిలన్	:	337
సంఘమండలి	:	69
సేవ కార్యక్రమాలు	:	1,823
విజయదశమి ఉత్సవాలు	**:**	4,507
తరుణ	:	2,00,532
బాల	:	53,748
మొత్తం సంఖ్య	:	2,54,280
మహిళలు	:	39,611
గణవేష్‌లో పాల్గొన్నవారు	:	78,184
గృహ సంపర్క అభియాన్:		
గ్రామాలు	:	8,126
బస్తీలు(నగరాలలో)	:	1,504
ఇళ్లు	:	24,98,347
వితరణ చేసిన కరపత్రాలు	:	29,00,000
పుస్తకాలు	:	1,30,000
విశేష వ్యక్తుల సంపర్కం	:	3,560
పనిచేసిన జట్లు	:	10,771
ప్రతిష్ఠిత వ్యక్తుల కార్యక్రమాలు	**:**	46
ఆహ్వానితులు	:	15,983
పురుషులు	:	7,814
మాతృమూర్తులు	:	557
మొత్తం	:	8,371

ఆంధ్రప్రదేశ్

శాఖ నివేదిక:		
మొత్తం మండలాలు	:	1834
శాఖాయుక్త మండలాలు	:	717
బస్తీలు (నగరాలలో)	:	973
శాఖాయుక్త బస్తీలు	:	629
శాఖలు	:	1746
సాప్తాహిక్ మిలన్	:	930
సంఘ మండలి	:	382
సేవ కార్యక్రమాలు	:	1464
విజయదశమి ఉత్సవాలు:	:	2727
తరుణ	:	1,14,530
బాల	:	22,627
మొత్తం సంఖ్య	:	1,37,152
మహిళలు	:	21,124
గణవేష్‌లో పాల్గొన్నవారు	:	46,661
గృహసంపర్క అభియాన్: గ్రామాలు:		6,043
బస్తీలు(నగరాలలో)	:	694
ఇళ్లు	:	39,90,809
వితరణ చేసిన కరపత్రాలు	:	44,62,397
పుస్తకాలు	:	47,011
విశేష వ్యక్తుల సంపర్కం	:	4800
పనిచేసిన కార్యకర్తలు	:	61,342

ప్రతిష్ఠిత వ్యక్తుల కార్యక్రమాలు మార్చి, ఏప్రిల్ మాసాలలో జరుగుతాయి.

ఆర్ఎస్ఎస్ స్థాపన వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో 2025 విజయదశమిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉత్సవాలు నిర్వహించబడ్డాయి. వాటితో పాటు సమాజంలోని వివిధ వర్గాలవారిని కలవడానికి 7 రకాల కార్యక్రమాలు ప్రారంభమైనాయి. శతాబ్ది ఉత్సవాలు ప్రారంభమానికి ముందుగానే కేంద్ర ప్రభుత్వం సంఘశతాబ్దికి గుర్తుగా వంద రూపాయల నాణెం, తపాలబిళ్లను విడుదల చేసింది. నాగపూర్‌లో ప్రసిద్ధిగాంచిన విజయదశమి ఉత్సవానికి శతాబ్ది సందర్భంగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

కార్యకర్తలు విశాలమైన ప్రణాళికతో, కష్టపడి పనిచేయడంతో శతాబ్ది కార్యక్రమాలన్నీ విజయ వంతంగా నిర్వహించబడుతున్నాయి. సమాజంలోని అన్ని వర్గాలవారు సంతోషంగా వాటిని స్వాగతించి సహకారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించడం ద్వారా సంఘానికి సంస్థాగతంగా ఎంతో లాభం కలిగింది. సమాజం లోని కింది స్థాయివరకు చేరుకోవడంలో మంచి విజయాన్ని సాధించాం. విజయదశమి ఉత్సవాల తరువాత అనేక కొత్త స్థలాలలో శాఖలు ప్రారంభ మైనాయి. ఇంటింటిని కలవడం అనే కార్యక్రమం ద్వారా సంఘ ఆలోచనలు దూర ప్రాంతాలవరకు చేరాయి. సద్భావన సమా వేశాలు, ప్రతిష్టిత వ్యక్తుల సమావేశాల ద్వారా సమాజంలో సానుకూల ఆలో చనలు, కార్యచైతన్యం పెరిగింది. సంఘం చేస్తున్న పనిని ప్రజలు సమగ్రంగా అర్థం చేసుకుంటూ, సమాజ జీవితంలో సంఘం నుండి మరింత సేవలను ఆశిస్తున్నారు. "పంచ పరివర్తన" వంటి అంశాలకు కూడా విస్తృత స్వాగతం లభించింది. సంఘం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి, సామాజిక కార్యాలపై అవగాహన పెరుగుతోంది.

మొత్తం 22 ప్రాంతాలలో ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ పర్యటించారు. సామాజిక సద్భావన సమావేశాలు, హిందూ సమ్మేళ నాలు, సమాజంలో ప్రభావవంతులైన వ్యక్తులతో సంభాషణలు వంటి కార్యక్రమాలు అన్ని ప్రాంతాలలో వీరి పర్యటనలో నిర్వహించబడ్డాయి. కొన్ని ప్రాంతాలలో యువ పారిశ్రామికవేత్తలు, పరిశోధకులు, వనవాసి బంధువులతో ప్రత్యేక సంభాషణ కార్యక్రమాలు జరిగాయి. సంఘం 100 సంవత్సరాల ప్రయాణాన్ని ప్రజల ముందుంచి వారి సందేహాలకు సమాధానం ఇచ్చి, కార్యక్రమాలలో భాగ స్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. దేశంలోని నాలుగు మహా నగరాలు-ఢిల్లీ, బెంగళూరు,కొలకతా, ముంబైలో "సంఘం 100 సంవత్సరాలు-కొత్త దిశలు" అనే అంశంపై రెండు రోజులు ఉపన్యాసాలు నిర్వ హించబడ్డాయి. ఈ కార్యక్రమాలకు సమాజంలోని ప్రముఖ వ్యక్తులను ఆహ్వానించారు. వివిధ దేశాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. మొత్తం 55 దేశాలకు చెందిన విద్యా, పరిపాలన, పరిశ్రమ, సామాజిక రంగాలప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు.

తెలంగాణ ప్రాంతంలో హిందూ సమ్మేళనాలు మార్చి 20 ఏప్రిల్ 20వరకు జరుగుతాయి.

సంత్ రవిదాస్ జన్మించిన 650 సంవత్సరాలైన సందర్భంగా వారి జయంతి వేడుకలను ఈ సంవత్సరమంతా జరపాలని సంఘం నిర్ణయించింది.

గో సేవా విభాగం ద్వారా గో విజ్ఞాన్ పరీక్షలను ఈ సంవత్సరం 4,11,890మంది విద్యార్థులతో నిర్వహించి, గెలిచిన వారికి బహుమతులు ప్రకటించడంలో దేశంలోనే తెలంగాణ అగ్రభాగాన నిలిచింది. ఇందుకొరకు 5 లక్షల పుస్తకాలను వితరణ చేశారు. విశ్వధర్మాన్ని ప్రపంచవ్యాప్తం చేయాలనే లక్ష్యంతో 2025 డిసెంబర్ హైదరాబాద్‌లో 75 దేశాల నుండి పాల్గొన్న ప్రతినిధులతో విశ్వసంఘ శిబిరం జరగడం విశేషం. 9వ సిక్కు గురు తేగ్ బహదూర్ బలిదానం 350 సంవత్సరాలు అయిన సందర్భంగా దేశంలో అనేక కార్యక్రమాలు జరిగాయి. హైదరాబాద్‌లో కూడా 2000మంది సిక్కుబంధువులతో కార్యక్రమం జరిగింది. జనవరి 31, ఫిబ్రవరి 1న సర్‌సంఘ చాలక్ హైదరాబాద్ పర్యటన సందర్భంగా పదవీ విరమణ పొందిన ఐపిఎస్, ఐఏఎస్ లాంటి ఉద్యోగస్తులతోను, సెలబ్రెటీస్‌తోనూ, సమాజంలోని వివిధ రంగాలకు చెందిన ప్రతిష్టిత వ్యక్తులతో విడివిడిగా 3 కార్యక్రమాలు జరిగాయి.



సుంకవల్లి రామకృష్ణ

బయ్యా శ్రీనివాసులు

ఆంధ్రప్రదేశ్‌లో

ఆర్ఎస్ఎస్ అఖిల భారత ప్రతినిధి సభలలో సంఘ శతాబ్ది సంవత్సరం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్‌లోను, దేశవ్యాప్తంగాను చేపట్టనున్న ప్రత్యేక కార్యక్రమాల గురించి మార్చి 17న విజయ వాడలో జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రాంత సహ సంఘచాలక్ సుంకవల్లి రామకృష్ణ, ప్రాంతప్రచారప్రముఖ్ బయ్యా శ్రీనివాసులు తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రాంత సహప్రచారప్రముఖ్ సిహెచ్ వాసు పాల్గొన్నారు.

జనవరి 29, 30 తేదీలలో ఆంధ్రప్రదేశ్ వివిధ రంగాల ప్రముఖులతో మొహన్‌భాగవత్ సమావేశాలు విజయవంతమయ్యాయి. సర్‌కార్యవాహ విశాఖపట్నంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జనవరిలో ఆంధ్రప్రదేశ్ అంతటా 2200 స్థలాలలో ప్రతీ మండలం/బస్తీలో హిందూ సమ్మేళ నాలు జరిగాయి. సుమారు 12 లక్షలమంది పాల్గొన్నారు. ★

గణపతిదేవుడు

29

ఆమె ప్రతి మాటా గంగయ మౌనంగా విన్నాడు. ఆమె గణపతిదేవుని నిందిస్తుందని, సింఘణదేవుడిని మెచ్చుకుంటుందని ఊహించిందే. కాని నిజమైన భార్యాభర్తల్లా ఆమె మాట్లాడటం అతనికి లోలోన మనోహరంగా ఉంది. దురదృష్టకరమైన తన జీవితంలో పెళ్లి అనేది మరో దారుణ సంఘటన మాత్రమేనని తర్వాత నిరూపితమయ్యింది. అది కేయూరను ఎంతో కుంగదీసింది. రాజప్రాసాదంలో నిత్యమూ అవమానాలతో బ్రతుకుతున్న తను.. తల్లి చనిపోయాక బయటకు వెళ్లి.. మంచి భార్యను పొంది గౌరవనీయమైన కులీన జీవితాన్ని గడపగలనని కలలు కనేవాడు. అలాంటిది మళ్లీ సింఘణదేవుడు తన అభిప్రాయంతో సంబంధం లేకుండానే తన పెళ్లి చేసేశాడు. ఆ వచ్చిన ఈ భార్య చాలాకాలం దీర్ఘ నిద్రలోనే ఉండేది. ఆరోగ్యం కుదుటపడ్డాక తనతో కాపురం చేయడం అనేది లేదు. తనను పురుగును చూసినట్లు చూసేది. తానెంతో కుంగిపోయాడు. అలా అలా అన్ని బాధలు అవమానాలు భరిస్తూనే బతికాడు.

ఆనాడు అభ్యర్థించినట్లు తిరిగి కాకతీయ రాజ్యాభిషిక్తుడైన గణపతిదేవుడే తనకు తగిన హోదా స్థాయి కల్పించాడు. ఇన్నేళ్ల తర్వాత తన భార్య నిజమైన భార్యగా తనతో మాట్లాడటం కూడా ఆయన ఇచ్చిన గౌరవం వల్లనే కదా అనుకున్నాడు కేయూర.

ఇది ఏమైనా బాల కవ్వలతో ఈ మాత్రం మాటామంతీ కేయూరను మొత్తంగా దిమ్మెరబోయేలా చేసింది. ఓ మధుర భావనామయ జగత్తులోకి తీసుకెళ్లింది. లేచి ఆమె దగ్గరగా వెళ్లాడు. ఇద్దరి శరీరాలు, మనసులు.. పాతికేళ్ల వైవాహిక జీవితం అనుభవించలేదన్న స్పృహతో ఓ ఉదాత్తమైన జీవిత సార్థకత ఏదో అవగతమైనట్లు దగ్గరగా కదలాడుతున్నాయి.

తానిప్పుడు గణపతిదేవుడు చేసిన గొప్ప గౌరవాన్ని ప్రస్తుతిస్తూ మాటలాడితే ఈ ఆలుమగల అనుబంధం మళ్లీ ఛిద్రమయ్యే అవకాశం ఉంది.

"ఏది ఏమైనా నాకేమీ సింఘణదేవునిపై ద్వేషం, గణపతిదేవునిపై గొప్పభక్తి లేవు కవ్వలా! ఉన్నదల్లా నీపై అపారమైన ప్రేమ. అక్క కవ్వలపై అపారమైన కరుణ. నేను ఆమె మనసు గుర్తించి.. ఈ కాకతీయునికి దగ్గర చేశాను. ఒక రకంగా ఆమె మరణానికి నేనే కారణం.." దుఖంతో గొంతు పూడుకుపోయింది.

కరిగిపోయింది కవ్వల. దగ్గరగా హత్తుకుంది. మరింతగా ఆమెను పొదవుకున్నాడు.

పాతికేళ్లుగా ఎరుగని ఆ గాఢపరిష్వంగం వికటాట్టహాసం చేస్తోంది. ఇద్దరూ అలా కౌగిలి వదలకుండానే లోపలికి తల్పం వైపుగా సాగిపోయారు.

అక్కడే మరి కొన్ని రోజులున్నాడు కేయూర.

కొన్నిరోజుల దాంపత్య జీవితం..

సింఘణదేవుడు రానున్నట్లు సమాచారం రావడంతో తిరిగి బయలుదేరాడు కేయూర.

విడువలేక విడిచి పుచ్చింది బాల కవ్వల.

ఆమె అతని భార్యగా అతని రాజ్యానికి వస్తుందా..? ఏమో.. అతడు అడగలేదు.

కాకతీయ రాజ్య సామంతుడిగా ఉన్న భర్త తన పగ, ప్రతికారం నెరవేర్చుకోవడానికి సహకరిస్తాడా.. ఏమో..

ఆమె అడగలేదు.

ఇద్దరూ భార్యాభర్తలుగా కొన్ని రోజులు జీవించారు.. అన్నదే నిజం.

బాల కవ్వల తిరిగి బాలకవ్వలాబాయిగా మిగిలింది.

కేయూర గంగయదేవునిగా తిరిగివెళ్లాడు.

కరువు పూర్తిగా తొలగిపోయింది.

రాజ్యాల కుట్రలు, కుతంత్రాలు మళ్లీ ప్రధాన రంగస్థలిపైకి వచ్చాయి.

మరి కొన్నిరోజులలోనే ఇద్దరూ వారి వారి ప్రధాన వంధాలోనే కొనసాగుతున్నారని బయటపడింది.

* * *

ఆరవ మెట్టు: తెలుగు సంక్షేమరాజ్యం

ప్రాచీనకాలంలో గణాన్ని, జనపథాన్ని, రాజ్యాన్ని కాపాడటమే పాలకుల ప్రథమ కర్తవ్యం. కాబట్టి బలమైన యుద్ధవీరులే తొలిదశలో నాయకులుగా ఎన్నికై, తదనంతరం రాజులుగా ఎదిగారు. వీలయినప్పుడల్లా సరిహద్దు రాజ్యాలపై దాడులు చేస్తూ రాజ్య విస్తీర్ణం పెంచుకొనేవారు. అందువల్ల రాజ్యపరిధిలో మరికొన్ని లాభదాయక వనరులు వస్తాయి. పన్నులు విధిస్తూ ఆదాయం పెంపు ద్వారా సైనిక బలాన్ని మరింత పెంచుకుని బలమైన రాజ్యంగా అందరూ గుర్తించి భయపడేలా పాలించడం రాజ్యవ్యవస్థ ప్రధాన కార్యకలాపంగా స్థిరపడింది.

కానీ ఇప్పుడీ ఆధునిక కాలంలో కేవలం మహారాజు యుద్ధాలు, రక్షణ చూస్తూ పన్నులు వసూలు చేసుకుంటే సరిపోదు. ప్రజా సంక్షేమం కూడా చూడాలి. అశోకుని తర్వాత ఆ స్థాయిలో ప్రజా సంక్షేమం పట్టించుకున్న పాలకుడు లేడు. అదంతా పిచ్చి కాలం. ప్రజలు అమాయకులు. ఇప్పుడు ప్రతి రాజూ అశోకునిలా ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవలసిందేనని ప్రజలు కోరుకుంటున్నారు. లేకపోతే ఊరుకోరు. వారిలో తిరుగుబాటు వస్తుంది. ప్రజల తరఫున పోరాడే ప్రజానాయకులు కూడా ఉద్భవించే కాలం వచ్చేసింది. తస్మాత్ జాగ్రత్త!!

రాజ్యపాలనాశాస్త్ర నిపుణుడు శ్రీ బద్దెనామాత్యుడు, చింతనా శిబిరంలో... మహారాజు కంటే ఇవ్వాళ మహావర్తకుడు ధనవంతుడు. మహారాజులకే అప్పులు ఇవ్వగల విదేశీ వణిజులు మన రాజ్యంలో దాదాపు వందమంది వరకు ఉన్నారని ఓ అంచనా. కాబట్టి ఇప్పుడు రాజు ఎంత శక్తిమంతుడో వణిజుడూ అంతే శక్తిమంతుడు. భాషారాజ్యాలు స్పష్టమౌతున్న ఈ సంధికాలంలో ఇక్కడ తెలుగు రాజ్యాల్లో తెలుగు వణిజుల కంటే కన్నడ వణిజులు, వారికంటే తమిళ వణిజులు మరింత బలంగా సమాజంపై పట్టున్న వాళ్లు. వీళ్లు పూర్తిగా కాకపోయినా కొంతలో కొంత తమ భాషా జనానికి అన్ని తక్కువ ధరలకు.. తెలుగు వారికి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. లాభాల సొమ్మునంతా వాళ్ల రాజ్యాలలోని దేవాలయాలకో రాజులకో కేటాయించుకుంటున్నారు. ఈ

మత్తి భానుమూర్తి

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

తారతమ్యాలను మహారాజు అరికట్టి అన్ని రాజ్యాల్లో.. అన్ని గ్రామాలలో ప్రజలకు ఒకే ధరలో నాణ్యమైన సరుకులు లభించేలా చూడాలి. అంటే వ్యాపారాలను క్రమబద్ధీకరించాలి. 'మేము వణిజులను పట్టించుకోము. ఎందుకంటే వాళ్లు మాకు బోలెడు పన్నులు చెల్లిస్తున్నారు. వాళ్లను మేము ఏమీ గట్టిగా మాట్లాడలేము అంటే కుదరదు. వ్యాపార క్రమబద్ధీకరణ సరుకులు అన్ని ప్రాంతాలలో ఒకే ధరలో లభించేలా చూడటం మహారాజుల తక్షణ కర్తవ్యం.

ఆర్థిక శాస్త్రవేత్త శ్రీ రుద్రధాముడు, చింతనా శిబిరంలో తిండి.. బట్టా.. అందరికి అందేలా జరిగే ప్రక్రియే తొలి దశలో వ్యాపారం. వ్యాపారం అనే కార్యకలాపానికి వస్తువు ఉండాలి. వస్తువులు రెండు రకాలు.. సహజంగా ప్రకృతిలో దొరికేవి.. వస్తువుగా ఉత్పత్తి చేసేవి.. వాణిజ్యం అనేది రెండు రకాలు. ఒకటి మన సహజ వనరులను సమీకరించి దూరప్రాంతాలకు, దూర దేశాలకు ఎగుమతి చేయడం.. రెండవది వస్తువుల ఉత్పత్తి.. ఉదాహరణ ఉప్పు. సహజ రేవులున్న మీ సముద్రతీరాలలో ఉప్పు కావల్సినంత దొరుకుతోంది నిజమే. దానికి అఖండ భారతమంతా వ్యాపారం ఉంది. కాని అది మట్టితో.. బురదతో కలిసి ఉండటంతో అమ్మకానికి మంచి ధర పలకదు. దానిని కొంత సంస్కరించి.. అంటే శుభ్రపరిస్తే.. తెల్లగా నిగనిగ లాడుతుంది. అప్పుడు దానికి మరింత ధర లభిస్తుంది. కాబట్టి అలా శుభ్రవరచే కర్మాగారాలను ప్రభువులు ప్రోత్సహించాలి. అలాంటివి ఇప్పటికే ఉన్నాయి కదా ఇక్కడ? అని ఎవరైనా అనవచ్చు. ఉన్నమాట నాకూ తెలుసు. కాని ఆయా ఉత్పత్తిదారులకు తగిన ప్రోత్సాహాలు, సహాయాలు అందిస్తే వారు ప్రభుత్వానికి తగిన శిస్తులు చెల్లించగలరు. తద్వారా తమరి ఆదాయం మరింత పెరుగుతుంది. కొనుగోలుదారులు అంటే ప్రజలు మరింత ధర చెల్లించగలరు. నాణ్యమైన వస్తువుల వాడకంతో ప్రజల జీవన స్థాయి.. తద్వారా రాజ్యస్థాయి పెరుగుతుంది కదా. ఉత్పత్తి జరగాలంటే ముందు సాధారణ వసతులు అన్ని గ్రామాలలో ఉండాలి. ముఖ్యంగా సహజవనరుల లభ్యత ఉన్న సామంత రాజ్యాలలో, స్థలాల్లో ఈ సాధారణ వసతులు.. ముఖ్యంగా చిన్న చిన్న దేశీయ ఉత్పత్తి దారులున్న గ్రామాలలో ఏర్పాటు చేయాలి. మన వద్ద పెద్ద పెద్ద వణిజులు, మహామహా ఉత్పత్తిదారులు ఉన్నారు. కానీ చిన్న చిన్న ఉత్పత్తిదారులు, సరఫరాదారులు ఉంటేనే ఆ మహావణిజుల విదేశీ, పరరాజ్య వాణిజ్యం పరిఢవిల్లేది. అందుకు తగిన సహాయ విధానాలు ప్రభువులు తీసుకోవాలని నా మనవి.

పండిత సుమేరు భట్టు, ప్రధానాచార్యులు, తక్షశిలా విశ్వవిద్యాలయం...ఈ ఆధునిక కాలంలో రాజ్యం, వాణిజ్యం, మతం..సమాజాన్ని ముప్పేటలా చుట్టుముట్టి ప్రభావితం చేస్తున్నాయి. ఈ మూడింటిని క్రమబద్ధీకరించాల్సింది మహారాజులే. రాజ్యపాలనా వ్యవస్థను క్రమబద్ధీకరిస్తే మిగిలిన రెంటిని నియంత్రించడం సాధ్యమే.

శిబిరాధ్యక్షులు తిక్కనామాత్యులు.

* * *

కాలం ఎన్నడూ ఆగదు. దానికి వరదలు, ఉప్పెనలు.. కరవు కాటకాలు, అంటువ్యాధులు.. అనేవి కొన్ని కొన్ని సంఘటనలు మాత్రమే. కాలం అలా ప్రవాహంలా సాగిపోతూనే ఉంటుంది.

కాకతీయ రాజ్యం, గణపతిదేవుని కుటుంబంలో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. పెద్ద కూతురు గణపాంబ వివాహం జరిపించాడు. అదికూడా ధాన్యకటకమైన ధరణికోట పాలకుల కుటుంబంతో. రెండవ కుమార్తె రుద్రమ చరిత్ర మరో విశేషం. ఆమె పుట్టినప్పుడు ఇద్దరూ ఆడపిల్లలయితే ఆయన వారసులు ఎవరు అనే విషయంలో వచ్చే సందిగ్ధతను నివారించడానికి ఆమెను మగపిల్లవాడుగా ప్రకటించాడు. అందువల్ల తాత్కాలికంగా సమస్య తప్పినా యుక్తవయస్సు వచ్చేసరికి ఆడపిల్లను మగవాడిగా చూపడం పెద్ద సమస్య అయ్యింది. అప్పుడు పెద్దలందరి సలహాతో గతంలో జాతకరీత్యా అబ్బాయిగా ప్రకటించినట్లు, ఇప్పుడు అసలు నిజం.. రెండవ సంతానం కూడా అమ్మాయి అని, ఆమె గొప్ప యుద్ధవిద్యా ప్రవీణురాలని ప్రకటించాడు. సహజంగా తలెత్తిన అలజడి అంతే సహజంగా తగ్గిపోయింది. కారణం రెండవ భార్యకు ఉన్నది ఏకైక కుమారుడు కావడంతో అతడే గణపతిదేవుని వారసుడుగా ప్రజలు భావిస్తుండటంతో ఎలాంటి అలజడులు లేకుండా రాజ్యపాలన జరిగిపోతోంది. గణపాంబ అత్తవారికి వెళ్లిపోగా రెండవ కుమార్తె రుద్రమదేవి, కుమారుడు మురారిదేవుడు పాలనలో గణపతిదేవునికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. రుద్రమ కాస్త బాధ్యత కలిగి తండ్రికి సహకరిస్తుండగా మురారి ఇంకా అల్లరిచిల్లరగా తిరుగుతున్నాడు.

పిల్లల బాధ్యత బావమరిది జాయచోడునిపై ఉంచి తన పూర్తి సమయాన్ని తెలుగురాజ్య స్థాపనకే అంకితం చేశాడు గణపతిదేవుడు.

కరవును అమోఘంగా ఎదుర్కున్న కాకతీయ రాజ్యపాలనావ్యవస్థలో గొప్ప విప్లవాత్మక సంస్కరణలు మొదలయ్యాయి. అది 'రాజ్య విధానాలు' రూపకల్పన చేసి ప్రకటించడం.

రాజ్య అధికార నియోగాల నుంచి విధానాలు అనే కొత్త అంశం పుట్టింది.

మహాప్రధాని నియోగం నుండి ఇలాంటి విధానాలు ప్రకటనల రూపంలో వెలువడుతున్నాయి. అవి రాజ్యమంతటా మండల, విషయ, నాడు, స్థల, గ్రామ పాలకవర్గాలకు ఆదేశాలుగా వెళుతున్నాయి. ఇప్పుడు ధనంతో సంబంధంలేని ప్రజాప్రయోజన

విధానాల ప్రకటనలు విరివిగా వెలువడుతున్నాయి. ప్రజలకన్నా ముందు వివిధ స్థాయిలలోని నియోగాల ఉద్యోగులు వాటిని చూసి ఆశ్చర్యపోతూ అమలు చేస్తున్నారు. అమలు చేసి తీరాలి.

ఈ విధాన ప్రకటనలలో కొన్ని ధనంతో ముడిపడినవి కూడా ఉన్నాయి. ఏడాది పన్నుల వసూళ్లలో ఆరవ వంతు రాజ కోశాగారానికి వెళుతుంది. మిగిలిన మొత్తంలో సింహభాగం గ్రామ స్వపరిపాలనకు కేటాయిస్తారు. అది వేరు వేరు స్థాయిలలో ఉంటుంది. రాజ్యానికి వచ్చే పన్నుల ఆదాయంలో.. కొంత మండల పరిపాలనకు, కొంత నాడు పరిపాలనకు, కొంత స్థల పరిపాలనకు మిగిలింది గ్రామ స్వపరిపాలనకు కేటాయింపు ఉంటుంది. ఇప్పుడు కాకతీయరాజ్యంలో ప్రకటించిన విధానాలకు సొమ్ముకావాలంటే అది పూర్తిగా రాజ్య భండాగారం నుంచే మహారాజుగారి అనుమతితో మహాప్రధాని నియోగం నుంచి ఖర్చు చేస్తారు. చాలకుంటే రాజుగారి కోశాగారం నుంచి కూడా తీసుకోవడానికి ఆయన అంగీకరిస్తున్నారు. వాటి ప్రయోజనాలు మొత్తం సమాజానికి అందుతున్నాయి. ప్రజలు కూడా ఇది కదా మహారాజులు చేయాల్సినది అని చెప్పుకుంటున్నారు.

* * *

మందమాగలహల్లి..

వాయవ్యంగా కాకతీయ రాజ్యం, హోయసల రాజ్యం, దేవగిరి రాజ్యం.. మూడు రాజ్యాల సరిహద్దు వద్ద ఉన్న గ్రామం ఇది.

ఇంకా ఏమాత్రం తెల్లవారలేదు. పిసరంత వెలుతురు కూడా లేదు. రాత్రి ఓ వెలుగు వెలిగిన చందమామ వెళ్లి పోతున్నవేళ అరకొరగా మిగిలిన చిరు మసక వెలుగు..

ఆ సమయానికే గ్రామం లేచిపోయింది. చావిళ్లలో కదలాడుతున్న ఆవులు, గేదెలు వేసిన పెంటను కుండల్లోకి ఎత్తి దాంట్లో నీళ్లు కలిపి కళ్లాపు చల్లుతున్నారు అమ్మలక్కలు. పొలాలకు కదులుతున్న రైతుల అదిలింపులు, ఎడ్ల మెడలలోని పట్టెడ మువ్వల ఘల్లుఘల్లు శబ్దాలు.. రైతుల పలకరింపుల ముచ్చట్లు.. ఆవలగా అప్పటికే తెరచిన గుడి నుండి మంత్రోచ్చాటన..

అలా మొదలైంది గ్రామీణ దైనందినం.

బారెడు పొద్దెక్కాక ఊరిలో వినిపించేవి వడ్రంగుల రంపం, బాడిస.. తదితర పనిముట్లు చేసే శబ్దాలు, మధ్య మధ్య అంబా అంటూ ఆవుదూడల అరుపులు, కుక్కలు, కోళ్లు గుర్రాలు, గాడిదలు, అప్పుడప్పుడు ఎడ్ల బళ్ల గరగరలు.. రైతుల అదిలింపులు..

ఊరి బాటలపై ఎవరెవరో తిరుగాడుతున్నారు. రైతు సాంఖలప్ప ఇల్లు ఎక్కడ అని ఎవరో వాకబు చేస్తున్నారు. చెప్పకపోగా తమరెవరు అని ఎదురు ప్రశ్న. 'వాళ్ల అమ్మాయి పెళ్లికున్నదని విని సంబంధం తెచ్చాను' అన్నాడా ఆగంతకుడు. ఒహోహో పెళ్లిళ్ల పేరయ్యవన్నమాట. అదిగో అటు ముందుకెళ్లి కుడివైపు తిరిగితే మూడో ఇల్లు.. అంటూ ఒకరు

ఈ మహానాడులో పృథ్వీశెట్టిని ఎన్నుకుంటారు. అతను అఖండభారత వాణిజ్యానికి రారాజు. కిరీటం మాత్రం ఉండదు.. అంతే. అతని మాటకు మహా రాజులే కాదు చక్రవర్తులు కూడా తలవొగ్గవలసిందే. ఎందుకంటే అతడు మహారాజులకే సొమ్ములు అప్పు ఇవ్వగలడు. మహారాజులకు యుద్ధ సమయానికి అవసరమైన మిత్ర సైన్యాన్ని అతడే సమకూరుస్తాడు. అంతేకాదు యుద్దాలకు ముఖ్యమైన ఆయుధ సంపత్తి ఎక్కడెక్కడ ఏమేమి ఉన్నాయో.. ఏమేమి ఎలా ఎలా సమీకరించాలో అతనికే తెలుసు. అతని వల్లనే యుద్ధం సాధ్య పడుతుంది. యుద్ధంలో గెలుపోట ములు అతని వల్లనే నిర్ణయమౌతాయి కూడా.

దోవ చూపారు.

ఆయా రుతువులకు తగిన ఆయా పంటలు పండి ధాన్యం ఇంటికి చేరుతున్న చక్కని గ్రామం. అదే వాతావరణం కొరవి రాజ్యంలో.. ఇదే పరిస్థితి వెలనాడు రాజ్యంలో.. ఇదే పరిస్థితి అద్దంకి రాజ్యంలో..

కాకతీయరాజ్యం, దాని సామంతుల రాజ్యాలన్నీ ఓ నిబ్బరమైన.. నిత్యమూ ఎలాంటి వొడుదొడుకులు లేని.. జీవనసౌఖ్యాన్ని అనుభవిస్తున్నాయి.

పగలు రెండవ జాము మొదలయ్యేవేళ గ్రామ మంతా వినపడేలా ఓ మహిళ స్వరం దిక్కులు పిక్కటిల్లేలా వినపడింది. ఆమె గైకమ.. భర్త యుద్ధంలో చనిపోతే పుట్టింటికి వెళ్లింది. అక్కడ వాళ్లు అంగీకరించకపోవడంతో వ్యభిచారిగా ఎక్కడో జీవిస్తోందని ఊరి వారికి తెలిసిన సమాచారం. అలాంటి గైకమ నెత్తిన ఓ మూటతో ఏదో అమ్ముతా నంటూ ఊర్లోకి ప్రవేశించింది.

"అమ్మా.. ఆకులు.. తమలపాకులండి.. వక్కలండి.. సున్నమండి.. దీనికోసం సంత వరకూ ఆగక్కరలేదండి."

ఈ మాటలు చెవిన పడగానే మొత్తం గ్రామం గ్రామమే సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యింది. అందరూ వీధుల్లోకి వచ్చి కళ్లు ఇంతింత చేసుకుని చూడసాగారు.

ఇలా ఊళ్లో.. వీధుల వెంట తిరుగుతూ వస్తువులు అమ్మడం ఏవిటి..

అంతవరకూ వస్తువులన్నీ సంతల్లో మాత్రమే కొనుక్కునేవారు. ఇలా గ్రామంలోకి.. ఇంటింటికీ వచ్చి అమ్మడం వారికి పూర్తిగా కొత్త.. ఊహాతీతమైన అంశం.

అలా కాకతీయరాజ్యంలో ఓ విప్లవాత్మక విధానాన్ని గణపతిదేవుడు ప్రవేశపెట్టాడు.

ఈ కొత్త విధానం రాజ్యమంతటా కాకతాళీయంగా మొదలుకాలేదు. దీని వెనుక చాలా పెద్ద తతంగం జరిగింది.

* * *

మిథిలానగరం. అయోధ్యరాజ్యపు రాజధాని నగరం.

రాజప్రాసాదాన్ని తలదన్నే భవనంలో చప్పన్న (56) రాజ్యాల వణిజశ్రేణుల పెద్దలంతా సమావేశమయ్యారు.

కోట్ల కోట్లకు పడగలెత్తిన ఆ ప్రపంచ ఐశ్వర్య వంతులంతా ఒక్కచోట చేరేసరికి ఆ భవనమే కాదు ఆ నగరమే వెలుగుజిలుగులతో మెరిసిపోతోంది.

మహానాడు..

ఆ నగరంలో మహానాడు వార్షిక సమావేశం జరుగుతోంది. మహానాడు అంటే చప్పన్న రాజ్యాల లోని వణిజ శ్రేణుల సమావేశం. చప్పన్న దేశాలు అంటే 56 రాజ్యాలు. అంగ, వంగ, కళింగ, కశ్మీర, కాంభోజ, కేదార, కల్హార, కళ్యాణ, వేంగీ, కుంతల, కాకతీయ, చేర, కైకేయ, కదంబ, హూణ, గౌహతి, గౌడ, ఢ్రింద, గాంధార, కురు, పాంచాల, నేపాల. భూపాల, అయోధ్య, విదేహ, విదర్భ, బాహ్లిక, హోయసల, పాటలీపుత్ర, ఘూర్జర, బృహద్రధ, త్రిగర్త, మహారాష్ట్రం, మధ్యరాష్ట్ర, కొణిదెన, కొంకణ, మగధ, మాళవ, రాజస్థాని, అవంతి, యవన, విక్రమ సింహపురి, బార్బర, చేది, చోళ, పాండ్య, ఉజ్జయిని, హూణ, మంగి, వేంగి, బిజ్జల, సౌరాష్ట్ర, సింహళ, తుండి, ఉత్కళ, దశార్ధవ..

ఈ రాజ్యాల మధ్య వాణిజ్య శ్రేణి చాలా బలంగా ఉంది. ఉత్తరావర్త రాజ్యాలలో ఎక్కువ శ్రేణులు స్వదేశీ వాణిజ్యంలో బలంగా ఉండే దక్షిణాపథం, దక్షిణావర్త రాజ్యాలు స్వదేశీ, పరదేశీ వాణిజ్యంలో కూడా అత్యున్నత స్థాయిలో ఉన్నాయి. అలాగే నేపాళశీ, సింహళ రాజ్యాలు, సువర్ణభూమి, మలయా.. తదితర అఖండ భారతం లోని దేశాలు అనేకానేక వస్తువుల కోసం ఈ సింధుభూమిలోని అంతర రాజ్యాలపై ఆధారపడి ఉన్నాయి.

ఏడాదికోకమారు ఈ చప్పన రాజ్యాల వణిజ్యశ్రేణులన్నీ సమావేశమౌతాయి.

దానినే మహానాడు అంటారు.

ఈ మహానాడులో పృథ్వీశెట్టిని ఎన్నుకుంటారు. అతను అఖండభారత వాణిజ్యానికి రారాజు. కిరీటం మాత్రం ఉండదు.. అంతే. అతని మాటకు మహా రాజులే కాదు చక్రవర్తులు కూడా తలవొగ్గవలసిందే. ఎందుకంటే అతడు మహారాజులకే సొమ్ములు అప్పు ఇవ్వగలడు. మహారాజులకు యుద్ధ సమయానికి అవసరమైన మిత్ర సైన్యాన్ని అతడే సమకూరుస్తాడు. అంతేకాదు యుద్ధాలకు ముఖ్యమైన ఆయుధ సంపత్తి ఎక్కడెక్కడ ఏమేమి ఉన్నాయో.. ఏమేమి ఎలా ఎలా సమీకరించాలో అతనికే తెలుసు. అతని వల్లనే యుద్ధం సాధ్య పడుతుంది. యుద్ధంలో గెలుపోట ములు అతని వల్లనే నిర్ణయమౌతాయి కూడా.

గణపతిదేవుడు ఈసారి కూడా తన మిత్రుడు అంకాలసెట్టిని వృధ్వీశెట్టిని చేయడానికి విశ్వప్రయత్నం చేశాడు. విజయవంతమయ్యాడు. చప్పన్నదేశాల మహారాజులతో స్నేహ సంబంధాలు నెరపాడు. అన్ని రాజ్యాలకు తన సంధివిగ్రహీలను పంపాడు. సహజంగా గొప్ప బలిష్టమైన రాజ్యంలోని వణిజశ్రేణులను చప్పన్నరాజ్యాల పెద్దలు గౌరవిస్తారు.

ఒక రాజ్యాన్ని.. ఆ రాజ్యపు వణిజ శ్రేణులను గౌరవించడానికి ఒకే ఒక కారణం ఆ రాజ్యం అన్నపూర్ణ కావడం. ఆ రాజ్యంలో పండే పంట, దాని విస్తీర్ణం, ఆ రాజ్యపు విదేశీ వాణిజ్యం, గొప్ప పంటలు, గొప్ప వాణిజ్యం ఉన్న రాజ్యం చప్పన రాజ్యాలలో గొప్ప గౌరవాన్ని పొందుతుంది.

అలాంటి రాజ్యాలలో కాకతీయ రాజ్యం ఒకటి.

వెలనాడు తదితర ధాన్య రాజ్యాలు కలిశాక కాకతీయ రాజ్యం అఖండ భారతంలోనే గొప్ప రాజ్యాలలో ఒకటిగా గుర్తింపు పొందుతోంది. అందుకే కాకతీయ మహారాజు పనికట్టుకుని మరీ కోరుతున్నట్లు అన్నిరాజ్యాల వాణిజ్య శ్రేణి సభ్యులు ఆ రాజ్యపు సమయశెట్టి అంకాలసెట్టిని ఈ ఏడాది మహానాడులో పృథ్వీశెట్టిగా ఎన్నుకున్నారు. అంటే అంకాల గణవతిదేవుని అండదండలతో.. మరోమారు పృథ్వీశెట్టినిగా ఎంపిక అయ్యాడు.

అయోధ్య నుండి తిరిగి వచ్చాక అనుమకొండ రాజప్రాసాదంలో పృథ్వీశెట్టి అంకాలసెట్టికి గొప్ప సత్కారం చేశాడు గణపతిదేవుడు.

"మిత్రమా అంకాలా.. నువ్విప్పుడు రెండవమారు పృథ్వీశెట్టివి. నా విన్నపం ఏవిటంటే మన కాకతీయ రాజ్యం లోని వాణిజ్యాన్ని క్రమబద్ధీకరించాలి. ఇక్కడే కాదు మన మహాసామంత, సామంత రాజ్యా లన్నిటా.. అంటే తెలుగు రాజ్యాలన్నిటా.. అన్ని వస్తువుల ధరలు ఒక్కటిగా ఉండాలి. ఈ చివర దేవగిరి హద్దుల్లో ఉన్న గ్రామంలోనూ.. ఆ చివర విక్రమసింహపురి రాజ్యహద్దులోని గ్రామంలోనూ ఓ వస్తువు ధర.. ఉదాహరణకు ఓ కోక ఖరీదు మాత్రమే కాదు ఓ తమలపాకు, ఓ వక్క ధర కూడా ఒక్కటిగానే ఉండాలి. ఇది నా ఆజ్ఞ లేదా విన్నపం. లేదా సలహా. ఏ రూపంలో తీసుకున్నా ఇది జరిగి తీరాలి."

వినమ్రంగా తలవాల్చి అంగీకరించాడు అంకాల.

"నా కోసం మీ సమస్త శక్తులు ఒడ్డి నన్ను రెండవసారి పృథ్వీశెట్టిని చేశారు మహారాజా! మన రాజ్యలన్నిటా అన్ని తెలుగు రాజ్యాలలో, ప్రాంతాలలో వాణిజ్యాన్ని నియంత్రించి ప్రజలకు అన్ని వస్తువులు సరసమైన ధరలకు అందేలా చర్యలు తీసుకుంటాను."

సభికులంతా ఘోల్లు ఘోల్లున నవ్వారు.

జరిగిన కథ:

"సరసమైన ధర.."

"ధరల్లో సరసం ఏవిటో.."

"సరసం భలే వాడాడు మన శెట్టి.."

ఇలా నవ్వులే నవ్వులు. కాని ఆ రోజు నుండి తెలుగురాజ్యాలలో వాణిజ్య విధానాలు మారి పోయాయి. తెలుగు రాజ్యాల్లో ఎక్కడైనా ఓ వస్తువుకు ఒకే ధర.. అది కూడా సరసమైన ధర. ధర వింటే ఎవ్వరికి కోపం రాదు. సరసంగా అనిపిస్తుంది.

ఒకప్పుడు కేవలం సంతల్లోనే వస్తువులు దొరికేవి. అక్కడే కొనుగోలు చేయాలి. ఇప్పుడు పురాలలో, నగరాలలో, పట్టణాలలో ఎల్లప్పుడూ తెరచి ఉండే దుకాణాలు వెలిశాయి. అవి సహజంగా ప్రజల అవసరాలను బాటు వైశ్యులు ఏర్పాటు చేశారు. పుర ప్రజలకు ఎల్లప్పుడూ దినసరి వస్తువులు అందు బాటులో ఉండటానికి వైశ్య లు ఈ మఠియలను, అంగళ్ళను, కొట్లను, దుకాణాలకు నిర్వహిస్తున్నారు.

అంకాల పృథ్వీశెట్టి అయ్యాక పురాలలో లాగానే పెద్ద గ్రామాలలో కూడా దుకాణాలు ఉండాలని భావించి పెద్ద గ్రామాలలో కూడా దుకాణాలను ఏర్పాటు చేయించాడు.

అదే సమయంలో గణపతిదేవుని పాలనా యంత్రాంగం ఓ కొత్త విధానాన్ని ప్రకటించింది.

"గ్రామాలలో, పురాలలో, పట్టణాలలో.. ఇంటింటికీ తిరిగి వస్తువులను అమ్మకునే వెసులు బాటు కల్పిస్తున్నాం. ఆసక్తి, అవసరం ఉన్నవారు నిత్యావసర వస్తువులు మోసుకుంటూ ఇంటింటికీ తిరిగి అమ్మవచ్చు. అలా అమ్ముకోవడం జీవనోపాధిగా చేసుకోవడానికి ఆసక్తి ఉన్నవారికి వణిజశ్రేణులు సహకరించాలి. వారికి సరుకులు ఇచ్చి అమ్మిన తర్వాత సొమ్ము వసూలు చేసుకోవాలి. మహిళలకు.. ముఖ్యంగా ఒంటరి మహిళలకు ఈ విధానం బాగా ఉపయోగ పడుతుంది. భర్త యుద్ధంలోనో.. ఆరోగ్యరీత్యానో మరణిస్తే ఆమెను అమ్మకందా రుగా ప్రోత్సహించాలి. వీరికి గ్రామాధికారుల నుండి మండలేశ్వరుల వరకూ అన్ని స్థాయులలోని నియోగులు సహకరించాలి. ఇది కాకతీయ ప్రభుత్వ ఉత్తర్వు. అమలు చేయనివారు శిక్షార్హులు.."

అది కాకతీయరాజ్యమంతటా కలకలం సృష్టించింది.

కూరగాయలు, ఆకులు, వక్కలు అమ్మకాలతో మహిళలు గ్రామగ్రామాన అమ్మడంతో మొదలైన ఈ కొత్త అమ్మక విధానం అనతికాలంలోనే కార్చిచ్చులా అనేక వస్తువులకు విస్తరించింది. నిత్యమూ ఈ అమ్మకందారుల కేకలతో గ్రామాలకు గ్రామాలే మార్మోగుతున్నాయి.

"ఉప్పు అండి.. ఉప్పో.."

"నూనె బాబూ నూనె అమ్మా.. కొబ్బరినూనె, ఆముదం, పల్లినూనె.. సంతకు వెళ్ళనవసరం లేదు. మీ ఇంటి ముందుకు వచ్చింది.. రావాలి.. రావాలి.. కొనాలి .. కొనాలి.."

(సశేషం)



ఎన్నికల

ఏప్రిల్, మే నెలల్లో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరిగే శాసనసభ ఎన్నికల్లో ప్రధాన పార్టీల పరిస్థితి ఏమిటి అనే ప్రశ్నకు ఈ రాష్ట్రాల్లో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కంటే ప్రాంతీయ పార్టీలకే పట్టు ఎక్కువగా ఉంది అనే సమాధానం బాగా వినిపిస్తోంది. ప్రాంతీయ సమస్యలపైన మొదటి నుంచి శ్రద్ధ పెడుతూ వచ్చిన ప్రాంతీయ పార్టీలు సహజంగానే జాతీయ పార్టీలకు అడ్డుకట్ట వేయగలుగుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నాయకత్వం నుంచి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని లాగేసుకున్నా, తమిళనాడులో ఎం.కె. స్టాలిన్ నాయకత్వం నుంచి డి.ఎం.కె. ను లాగేసుకున్నా వారికి రాజకీయ అస్తిత్వం పుళక్కి అయిపోతుంది. దేశంలో అనేక రాష్ట్రాల్లో బలహీనపడుతూ వస్తున్న కాంగ్రెస్ పార్టీ ఈసారి కేరళ మీద అనేక ఆశలు పెట్టుకుంది. కేరళలోని వాయనాడ్ పార్లమెంటరీ నియోజక వర్గంలో తాము గెలవడాన్ని ఆధారం చేసుకుని కాంగ్రెస్ పార్టీ కాస్తంత క్రియాశీలంగా వ్యవహరిస్తోంది. ఇక బీజేపీ కూడా తమిళనాడు, పుదుచ్చేరిలలో కంటే పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ రాష్ట్రాల్లో కమలం జెండాను ఎగరేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సుదీర్ఘ కాలంగా అధికారంలో ఉంటూ అరాచకాలు, విధ్వంసాలకు మారుపేరుగా ఉన్న మమతా బెనర్జీని అధికారం నుంచి దించడానికి బీజేపీ తన సర్వశక్తులూ ఒడ్డుతోంది. అధికారాన్ని కాపాడుకోవడానికి మమతా బెనర్జీ కూడా తన శక్తియుక్తులన్నిటినీ వినియోగిస్తున్నారు. ఆమె ప్రస్తుతం తన రాష్ట్రం మీద దృష్టి కేంద్రీకరిస్తున్నారు తప్ప సమీప అసోం రాష్ట్రంలో ప్రచారం చేయడానికి కూడా వెళ్లలేకపోతున్నారు. వాస్తవానికి, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయాలు సాధించిన బీజేపీ శాసనసభ ఎన్నికల్లో మాత్రం ప్రధాన ప్రతిపక్షంగా మిగిలిపోవడం మింగుడుపడని వ్యవహారమే అయినప్పటికీ, ఈసారి మాత్రం సరికొత్త వ్యూహాలు, ప్రచార సరళితో దూసుకుపోతోంది. 'పరివర్తన్' పేరుతో 2021 శాసనసభ ఎన్నికల్లో ప్రచారం చేపట్టిన బీజేపీ 294 శాసనసభ స్థానాల్లో కేవలం 77 స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగింది. బీజేపీ రాజకీయ వ్యూహకర్త అమిత్ షా ఇదివరకటి చేదు అనుభవం నుంచి కొత్త పాఠాలు నేర్చుకున్నట్టు కనిపిస్తోంది.

మమత ఆట కడుతుందా?

మమతా బెనర్జీ మొదటి నుంచి రాష్ట్రంలోకి చొరబడుతున్న బాంగ్లాదేశీయుల మీద తన విజయానికి ఆధారపడుతున్నారు. అక్రమంగా చొరబడుతున్న బాంగ్లాదేశీయులు, రోహింగ్యాలకు ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు, రేషన్ కార్డులు అందజేసి, వారికి కేంద్ర సంక్షేమ పథకాలను, రాష్ట్ర పథకాలను అమలు చేసి, వారిని ఓటు బ్యాంకుగా మలచుకున్న మమతా బెనర్జీకి కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో కొద్దిగా అడ్డుకట్ట వేయగలిగింది. మమతా బెనర్జీకి కంచుకోటల్లాంటి కొన్ని నియోజక వర్గాల్లో చొరబాటుదార్లు అత్యధిక సంఖ్యలో ఉండడం, రాష్ట్రం మొత్తం మీద కోట్లాది మంది అక్రమ చొరబాటుదార్లు శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకోవడం నిజంగానే ఒక రికార్డు సృష్టించింది. ఈ అక్రమ ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికి ఎన్నికల అధికారులు ప్రయత్నించినప్పుడు, ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు మమతా బెనర్జీ చేసిన రాద్ధాంతం కూడా మరచిపోలేనిది.

అంతేకాదు, ఆమె తిరిగి అధికారంలోకి రావడం కోసం, ఓట్లను తారుమారు చేయడం కోసం పన్నిన పన్నాగాలన్నిటినీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల ప్రధానాధికారి తిప్పికొట్టాల్సి వచ్చింది. కీలక పదవుల్లో ఆమె నియమించిన అనుకూల అధికారులను బదిలీ చేయడం, తమిళనాడు గవర్నర్‌గా ఉన్న ఆర్.ఎన్.రవిని పశ్చిమ బెంగాల్‌కు బదిలీ చేయడం వంటి చర్యలను కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలనూ తనకు అనుకూలంగా మార్చుకుని విజయమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న మమతా బెనర్జీ ఈ క్రమంలో ప్రజాస్వామ్య విలువలకు కూడా నీళ్లు వదలడం దిగ్భ్రాంతికరంగా మారింది. ఇక తన ఆటలు ఎక్కువ కాలం పాటు సాగవని గ్రహించిన మమతా బెనర్జీ ప్రజలను భావోద్వేగపరంగా రెచ్చగొట్టడం కూడా ప్రారంభించారు. ప్రాంతీయ తత్వాన్ని నూరిపోయడం, రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను కాలరాయడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ ప్రచారం చేయడం ప్రారంభించారు. దేశ భద్రత దృష్ట్యా కూడా పశ్చిమబెంగాల్‌లో విజయం సాధించడమన్నది బీజేపీకి కీలకంగా మారింది.

జి.రాజశేఖ
సీనియర్ జర్నలిస్ట్

తమిళనాడు పెద్ద సవాలు

డి.ఎం.కె. దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత బలంగా ఉన్న పార్టీగా నిలిచింది తమిళనాడులో డి.ఎం.కె.ను అధికారం నుంచి దించడం అంత తేలికైన విషయం కాదు. ప్రతిపక్షాలన్నీ కకావికలు కావడం, బీజేపీకి పెద్దగా బలం లేకపోవడం ఆ పార్టీకి ఒక సదవకాశంగా పరిణమించింది. తమిళనాడులో కొందరు బలమైన నాయకులను తయారు చేయడంతో పాటు, సరైన పార్టీలతో పొత్తులు పెట్టుకోవడం, తమిళనాడు ప్రజలను ఆకట్టుకోవడానికి చోళుల నాటి సెంగోల్‌ను పార్లమెంట్ భవనంలో ప్రతిష్ఠించడం, వారణాశిలో కాశీ-చెన్నై సంగమాలను ఏర్పాటు చేయడం, పార్లమెంట్ ఆవరణలో ఎడ్విన్ లుట్యెన్స్ విగ్రహం స్థానంలో తమిళనాడుకు చెందిన సి. రాజగోపాలాచారి విగ్రహాన్ని నెలకొల్పడం వంటి చర్యలు తీసుకుంది. అయితే, తమిళనాడులో ద్రవిడ కజగం రాజకీయాల ముందు ఇవన్నీ పని చేస్తాయా అన్నది వేచి చూడాల్సిన విషయం.

ఈ అయిదు చోట్లా కాంగ్రెస్ పార్టీకి కాస్తో కూస్తో

కాలం

బీజేపీ జోరును శక్తిమంతంగా నిలువరిస్తున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఈసారి ఎన్నికలు కీలకంగా మారాయి. బీజేపీకి అసలు సవాలు మాత్రం తృణమూల్ కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించడంలోనే ఉంది. ఇతర రాష్ట్రాలో విజయం సాధించడానికి, ముఖ్యంగా అసోంలో విజయం సాధించడానికి ఏమాత్రం అవకాశం లేని కాంగ్రెస్ పార్టీ తన శక్తియుక్తులన్నిటినీ కేరళ, పుదుచ్చేరిల మీద కేంద్రీకృతం చేస్తోంది.

అనుకూలంగా ఉన్న రాష్ట్రం కేరళ మాత్రమే. కాంగ్రెస్ నాయకత్వంలోని యు.డి.ఎఫ్. ఈసారైనా అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అగ్రనాయకత్వం గట్టి ప్రయత్నాలు సాగిస్తోంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో వామపక్ష కూటమి మాదిరిగానే కేరళలో కాంగ్రెస్ కూటమి దాదాపు అంపశయ్య మీద ఉంది. కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు వామపక్షాలకు చెందిన అధికార కూటమి ఎల్.డి.ఎఫ్. నుంచే కాక, బీజేపీ నుంచి కూడా పోటీ పెరిగింది. మిగిలిన నాలుగు చోట్ల బీజేపీకి సవాళ్లు, సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ, అసోంలో మాత్రం ఈ పార్టీకి నల్లేరు మీద బండిలా సాగిపోయే అవకాశం ఉంది. అసోంలో అధికారంలో ఉన్న బీజేపీ మొదటి నుంచి రాష్ట్రాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటూ వచ్చింది. ఇతర ఈశాన్య రాష్ట్రాలు అసోం అభివృద్ధిని ఆదర్శంగా తీసుకోవడం కూడా ప్రారంభించాయి. గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మాదిరిగానే అసోం కూడా ఒక అభివృద్ధి మోడల్‌గా అవతరించింది. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని నామరూపాలు లేకుండా చేసిన బీజేపీ ఇక్కడ ఒకప్పుడు శక్తిమంతంగా ఉన్న అసోంగణపరిషత్‌ను కూడా ప్రాధాన్యం లేని పార్టీగా మార్చేసింది.

సరికొత్త సమీకరణాలు

అసోంగణపరిషత్ కూడా బాంగ్లాదేశీ చొరబాటుదార్లకు వ్యతిరేకంగానే ఏర్పడింది. ఈ విషయంలో బీజేపీ సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్న అసోంగణ పరిషత్ మద్దతు బీజేపీకి ప్రకటించే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చి బీజేపీలో చేరి, ఇప్పుడు బీజేపీ ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్న హిమంత బిశ్వశర్మ ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన బాంగ్లాదేశీ అక్రమ చొరబాటు దార్లను, రోహింగ్యాలను రాష్ట్రం నుంచి తరిమేసే కార్యక్రమంలో ఉన్నారు. బిశ్వ శర్మ ప్రచార ధాటిని ఎదుర్కోలేకపోతున్న కాంగ్రెస్ పార్టీ గతంలో ఇక్కడ కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా పనిచేసిన తరుణ్ గొగోయ్ కుమారుడు గౌతమ్ గొగోయ్‌ని శాసనసభకు నిలబెట్టింది. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ పార్టీ తరఫున పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్లమెంట్‌సభ్యుడు ప్రద్యుత్ బోర్దోలోయ్, రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు భూపేన్ బోరా బీజేపీలో చేరడం బీజేపీ బలాన్ని బాగా పెంచింది.

బీజేపీ జోరును శక్తిమంతంగా నిలువరిస్తున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఈసారి ఎన్నికలు కీలకంగా మారాయి. బీజేపీకి అసలు సవాలు మాత్రం తృణమూల్ కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించడంలోనే ఉంది. ఇతర రాష్ట్రాలో విజయం సాధించడానికి, ముఖ్యంగా అసోంలో విజయం సాధించడానికి ఏమాత్రం అవకాశం లేని కాంగ్రెస్ పార్టీ తన శక్తియుక్తులన్నిటినీ కేరళ, పుదుచ్చేరిల మీద కేంద్రీకృతం చేస్తోంది. కేరళలో ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువగా ఉన్నందువల్ల దాన్ని తనకు అవకాశంగా మార్చుకోవాలని కాంగ్రెస్ గట్టి పట్టుదలతో ఉంది. ★



కళాకిరణ

నలుగురు నృత్యగురువులు ఆమెకి. వారు పంకజ్‌చరణ్‌దాస్, కేతాచరణ్ మహాపాత్ర, సంయుక్తా పాణిగ్రాహి, సోనాల్. ఆమె – అరుణా మొహంతీ.

ఒడిస్సీ, నాట్య పితామహ పంకజ్. ఆ రాష్ట్రం నుంచి తొలి 'పద్మవిభూషణ్' విజేత కేతాచరణ్.ప్రభుత్వం తరపు సాంస్కృతిక కళాప్రతినిధి సంయుక్త.భారతీయ నర్తన రీతిలో మేటి సోనాల్.వారందరి ప్రియశిష్యురాలు అరుణ. నిరంతరమూ విదేశీ పర్యటనల్లో ఉన్నా, మాతృభూమి ఘనతను చాటి చెప్పే అతిథి అధ్యాపక నిపుణ. ఏప్రిల్ 4న తన పుట్టినరోజు.

కళింగ సాహిత్య ఉత్సవం అనగానే, మనముందు ప్రత్యక్షమయ్యే నర్తకీమణీ – అరుణే!

భారతదేశ పరంగా అతిపెద్ద సాహితీ స్ఫూర్తి ప్రక్రియ కళింగ లిటరరీ ఫెస్టివల్ (కేఎల్ఎఫ్) ఆ వేడుకతోనే ఈమెకు అనుబంధం.

ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు చెందిన నర్తకీమణి అరుణలో సారస్వత, నృత్య రీతుల మేలు కలయికను చూడవచ్చు.

భువనేశ్వర్ అంటే ఆలయాల నగరం. వాటి సంఖ్య వందల్లో ఉంది. లింగరాజ, ముక్తేశ్వర, పరమేశ్వర, రాజారాణి ఆలయాలు ప్రసిద్ధాలు.

త్రిభువనేశ్వర్‌గా లింగరాజ్‌కు పేరు. నిర్మాణ కాలం సహస్రాధిక సంవత్సరాల నాటిది. గుడిచుట్టూ ప్రహరీ ఎంతెంతో విశాలం.

ఒడిస్సీ వాస్తు శిల్పకళకు అద్దం పడుతుంది ముక్తేశ్వర దేవస్థానం. పరమేశ్వర / పరశురామేశ్వర దేవాలయం బహు పురాతనం.

కళింగ ఆలయ శైలికి తలమానికంగా ఉంటుంది రాజారాణి దైవమందిరం. ఏటా సంగీత, సాహిత్య, నృత్య ఉత్సవాలకు ఈ ఆవరణలోనే వేదిక

అక్కడి ఆలయ నృత్యకళను ఆమె శాస్త్రీయ అధ్యయనం చేశారు. కళింగశైలి కోవెలల గురించిన పరిశోధనలు సాగిస్తూ వచ్చారు.

ఒడిశాతోపాటు ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలు కళింగ ఆలయ శిల్ప కళారీతిని ప్రతిఫలిస్తుంటాయి. ఉత్తరాంధ్ర జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ ప్రాంతాల్లోనూ అది కనిపిస్తుంది. భువనేశ్వర్ సహా కోణార్క, పూరి ప్రాంతాల గుడి నిర్మాణ సంప్రదాయాలక, నృత్యవిధానాలకీ అవినాభావ సంబంధముంది.

చారిత్రకంగా పరిశీలిస్తే.. సాధరణ శకం 11వ శతాబ్ది నాటి ముక్తేశ్వర, అదే శతాబ్దంలోని లింగరాయ ఆలయాల నేపథ్యం విఖ్యాత నర్తనరీతితోనే ముడివడి ఉంది. అటు తర్వాత 12వ శతాబ్దం నాటి బాకేశ్వర, వరాహి ఆలయ చరిత్రలకు సంబంధించీ... కళాత్మకత వెల్లివిరిసింది.పలు ఆలయాల మహా మండపాలు సైతం శోభాయమానంగా ఉంటుండేవి. వాటికి జగన్మోహనాలుగా ప్రసిద్ధత.

అక్కడి నాట్య మందిరాలు పూర్ణ కళాత్మకాలు. ఈ అంశాలన్నింటినీ విద్యార్థిని దశ నుంచీ పరిశీలన చేస్తుండేవారు అరుణ.

ముక్తేశ్వర నర్తనోత్సవం భువనేశ్వరంలోనే. ఒడిస్సీ నర్తకీమణులకు ప్రతిష్టాత్మక వేదిక. అక్కడి అనంత వసుదేవ ఆలయంలోని నాట్యమండపం ప్రత్యేక ఆకర్షణ.

ఇటువంటి సమాచార సమీకరణకు తోడు, నర్తన విధానాల మేళవింపుపైన అవగాహన కలిగించారు ఆమె తండ్రి కమల లోచన మొహంతి. ఆయన రచయిత, కళాకారుడు. చిన్నప్పుడే అరుణతో నాట్య అభ్యాసం ప్రారంభింపచేశారు. అప్పట్లో శిక్షకులు శ్రీనాథ్, గోవింద్. ఆమెకి 12 సంవత్సరాల వయసులో (1972) ఉన్నత స్థాయి నృత్య శిక్షణ లభించింది. నాటి గురువు గంగాధర్ ప్రధాన్. పద్మశ్రీ పురస్కార గ్రహీత.

(గురువులానే శిష్యురాలు అరుణ కూడ పద్మశ్రీ పురస్కార స్వీకర్త–2016). అంతకు రెండేళ్ల ముందే ఆ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ నుంచి కూడా అవార్డు. అంతకు నాలుగేళ్ల ముందరే కేంద్ర సంగీత నాటక

అరుణ

అకాడమీ గుర్తింపు, గౌరవం. 2001లో గురువు సంయుక్త పేరిట గల పురస్కృతి అందుకోవడం మరెంతో విశేషం. మరో గురువు పంకజ్‌కి చెందిన రీసెర్చి ఫౌండేషన్‌వారి బహుమతినీ అందుకున్నారు అరుణ. జగన్నాథ సంస్కృతీ వికాసపరిషత్ నుంచి బహూకృతి. అత్యంత విశిష్టాత్మక పురస్కారం 'భారత భవన్'. దీన్ని నాటి భారత రాష్ట్రపతి నుంచి అందుకున్నారామె.ఎంతో అనుభూతి కలిగించినవి ఇవన్నీ. వీటి గురించే ఎన్నో మార్లు సభల్లో చెప్పడం గమనార్హం.

నర్తకిగా, నర్తన శిక్షకురాలిగా అరుణకి ఐదు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం. ఇన్నేళ్లలో ఎన్నెన్నో సాధించారు. భారతీయ పురాణ పాత్రలు (మహిళలు) ఎంత విలక్షణమో ప్రసంగాల్లో, రచనల్లో వివరించారు. స్త్రీల స్థితిగతుల మీద దృష్టిని పూర్తిగా కేంద్రీకరించారు. 'నారి' అనే ప్రఖ్యాత ప్రదర్శన ప్రక్రియను రూపొందించారు.

నృత్యానికి సరిజోడుగా సాహిత్య, ధార్మిక విషయాలను పరిశోధించారు. శాస్త్రీయ శిల్పకళను అంటిపెట్టుకుని ఉన్న నాట్య పద్ధతులను విస్తృత ప్రాచుర్యంలోకి తెచ్చారు. స్వాతంత్ర్యం తదుపరి ఒడిస్సీ నాట్యకళ ఎన్ని పరిణామాలకు నెలవుగా మారిందో పరిశీలనలు జరిపారు. విభిన్న నృత్య సంవిధానాలను వీక్షకుల అవగాహనకు తేగలిగారు.

ఆమెలో ఎంత శాస్త్రీయతో, సాంప్రదాయకతో... అంతటి ఆధునికత,

విశ్లేషణాత్మకతా పరిమళించింది.

కాలిఫోర్నియా, సౌత్ కరోలినా, కార్నెల్ విశ్వవిద్యాలయాలకు అరుణ సేవలు విస్తరించాయి. అతిథి అధ్యాపకురాలిగా అక్కడ విద్యార్థినీ విద్యార్థులెందరో పాఠాలు చెప్పారు. నాట్యశిక్షకురాలిగా యువ కళాకారులనేకమందికి మెళకువలు నేర్పించారు.

ఆమె దృష్టిలో

1. సమాజ రీతులను ప్రతిబింబించేదే కళ.

2. కళ పరమార్థం మనోవికాసం, సామాజిక పురోగమనం.

3. పురోగమనం నాట్యకళతో సులభసాధ్యం.

4. 'సులభసాధ్యం' అనేది నర్తకులకు బాగా అనుభవం.

నాట్య ప్రదర్శనలు ఇచ్చే సందర్భాల్లో ఇంటా బయటా పలు సమస్యలు వస్తుంటాయి. వాటన్నింటినీ అధిగమించి, రంగస్థలం మీద ప్రతిభా సామర్థ్యాలు కనబరచడమే నృత్యకారిణుల అంతిమ లక్ష్యం. ఎన్ని కష్టనష్టాలనైనా భరించి, సహించి, చివరకు వేదికమీద చక్కని ప్రదర్శన ఇవ్వడమే వారి లక్ష్యం.

ఈ అన్ని అరుణా మొహంతి నిబద్ధతను సూచించేవే. సాక్ష్యాధారాలు లెక్కకు మిక్కిలి ఉన్నాయి. మచ్చుకు ఒకటి :

ఎప్పుడో పాతికేళ్ల కిందట (1999) ఒడిశాను అతాకుతలం చేసింది సూపర్ సైక్లోన్. ఆ శతాబ్దపు అత్యంత భీకర ప్రకృతి విపత్తు అది. జనజీవనం పూర్తిగా అల్లకల్లోలమైంది. అటువంటి విపత్కర స్థితిలో ప్రజలందరికీ సహాయం, సేవ అందించేందుకు ఉదారులంతా కదిలి వచ్చారు. వారిలో అక్కడ అగ్రభాగాన నిలిచినవారు అరుణ!

కళలన్నీ సమాజ హితం కోసమే అన్నది ఆమె భావన. సమాజంలోనే కల్లోలం రేగి, ప్రకృతే విరుచుకుపడితే, వెన్నుదన్నుగా నిలవాల్సింది కళాత్మక హృదయమే అని నిరూపించగలిగారు. సాంస్కృతిక ప్రదర్శనలతో వచ్చిన మొత్తాన్ని ఆర్తులకు అందించారు.ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక బాధ్యతలను పూర్తిగా నెరవేర్చారామె.

జయదేవ 'గీతగోవిందం' నర్తనతో ఎంతో కీర్తి అందుకున్నారు.

'కృష్ణశరణం' ప్రదర్శనతోనూ అంతే ఖ్యాతి సంపాదించారు.

– అవన్నీ జాతీయంగా.

అంతర్జాతీయంగా....

జర్మన్ నవలా రచనకు అనుబంధంగా నృత్యదర్శకత్వం వహించారు.

ప్రాంతీయంగా ఒడిశా డ్యాన్స్ అకాడమీకి నేతృత్వ బాధ్యత స్వీకరించారు అరుణ. కార్యక్రమాల్లో భాగంగా, యువనర్తకులను బాగా ప్రోత్సహించారు. సాంస్కృతిక రాయబారిగా ఎన్నో విజయాలు సాధించారు. శిఖరాగ్ర సదస్సుల వేదికల నుంచి ప్రసంగించారు.

నాట్య రీతుల గురించిన కార్యశాలలను వందలాదిగా నిర్వహించారు. సంప్రదాయ పరిరక్షణకు కళింగ లిటరరీ ఫెస్టివల్‌ను వినియోగించారు. సాహిత్య, సంగీత, నృత్య ప్రక్రియలకు సమ ప్రాధాన్యమిచ్చారు.

భాషా సంబంధ పర్యటనలను సమధికంగా ప్రోత్సహించారు అరుణా మొహంతి. సంస్కృతి, నాగరికతలకు కీలకం కళల్లోనే ఉందని ఆచరణాత్మకంగా రుజువు చేసిన ఘనత తనది.ఆమె మాటలు, చేతలు అంతటా స్ఫూర్తినింపాయి. నింపుతున్నాయి. ప్రాంతీయం నుంచి అంతర్జాతీయంవరకు ఆ నృత్యకారిణి కృషి ఫలితాలనిచ్చింది, ఇస్తోంది.

ఎంత ఎదిగినా, మూలాల్ని మరువని వ్యక్తిత్వం తనది. అందుకే ఎప్పుడు ఏ వేదికమీద నర్తించినా ఒడిశా కళాప్రాభవాన్ని స్మరించకుండా ఉండలేదు. లిటరరీ ఫెస్టివల్‌ను ప్రశంసించకుండా ఏ కార్యక్రమంలోనూ లేరు ఆమె. అంతటి వృత్తి నిబద్ధత, అంకిత భావన అరుణ అణువణువునా నిండి ఉంది.

గురువుల పేరు నిలిపిన శిష్యురాలు.

వందల శిష్యులను రూపొందించిన గురుప్రముఖులు. ఆ కారణంగానే 'అరుణ' పేరు సార్థకమైంది.

జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్

అనవసర యుద్ధంతో ఆపసోపాలు!

పశ్చిమాసియా యుద్ధంలో ఎప్పటికప్పుడు పరిణామాలు మారిపోతున్నాయి. ఖతార్‌లోని ఎల్ఎన్‌జీ ప్లాంట్స్, యూఏఈలోని హబ్సన్ గ్యాస్ ఫెసిలిటీ, బాబ్ ఫీల్డ్‌లపై దాడులు జరపడం తాజా పరిణామం. తన సౌత్ ఫార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతీకారంగా ఇరాన్ ఈ చర్యకు పాల్పడటంతో, ట్రంప్ రంగంలోకి దిగి, ఇజ్రాయెల్ చేసింది తప్పే, ఇక ముందు ఇజ్రాయెల్ ఇటువంటి దాడులకు పాల్పడదని హామీ ఇవ్వడంతో పాటు ఖతార్‌లోని చమురు క్షేత్రాలపై దాడులు చేస్తే సహించేదిలేదని ఇరాన్‌ను హెచ్చరించడంతో ఇప్పటివరకు ఎడాపెడా చమురు క్షేత్రాలపై పరస్పరం జరుపుకుంటున్న దాడులకు ఎంతవరకు తెరపడుతుందో చూడాలి.

యుద్ధం పరస్పర చమురు క్షేత్రాల విధ్వంసం దిశగా మళ్లడంతో ఇది కేవలం ఆ దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోంది. నిజానికి ఇరాన్ సౌత్ ఫార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై దాడి జరిగిన తర్వాత అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారల్‌కు 5% పెరిగి 108.66 డాలర్లకు చేరుకోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమయ్యే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఎదుర్కొంటున్న చమురు సమస్య పరిష్కారానికి అమెరికా ప్రభుత్వం జోన్స్ యాక్ట్ నిబంధనలను 60 రోజుల పాటు సడలించింది. ఇదే సమయంలో వెనెజులాకు చెందిన ప్రభుత్వ రంగ చమురు సంస్థ పీడీవీఎస్ఏను కొన్ని లావాదేవీలు జరుపుకునేందుకు అనుమతించింది. ఇక మనదేశానికి నెల రోజుల పాటు రష్యా చమురు కొనుగోళ్లు చేపట్టేందుకు అనుమతినిస్తున్నట్టు ప్రకటించింది. అయితే అమెరికా ఆంక్షల బెదిరింపులను ఖాతరు చేయకుండా రష్యా చమురును మనదేశం మామూలుగా కొనుగోలు చేస్తూనే ఉంది.

ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, ఇరాన్‌కు మద్దతుగా నిలుస్తున్న దేశాలు, అమెరికా ఆర్థిక ఆంక్షలను తప్పించుకునేందుకు యువాన్‌లో చెల్లింపులు జరిపేందుకు సంసిద్ధమవుతుండటంతో, ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే తగ్గిన డాలర్ డిమాండ్ మరింత తగ్గే అవకాశముంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 80% చమురు లావాదేవీలు డాలర్లలో జరుగుతున్నాయి. ఒకవేళ చైనా కరెన్సీ యువాన్‌తో లావాదేవీలు ప్రారంభమైతే ఆసియాలో చైనా మరింత బలీయమైన ఆర్థిక శక్తిగా రూపొందుతుంది.

చైనా సాయం కోరిన ట్రంప్!

మూసివేసిన హార్ముజ్ జలసంధిని తెరిపించడంలో సహాయపడాలని చైనా సహా ఏడు దేశాలను ట్రంప్ కోరడం, చైనా దీన్ని పెద్దగా పట్టించుకోక పోవడం మరో పరిణామం. తన మిత్రులైన ఐరోపా దేశాలనుంచి కూడా ఈ విషయంలో ట్రంప్‌కు మద్దతు లభించలేదు. ట్రంప్ కోరిన మేరకు సహాయానికి వెళితే యుద్ధంలో ఇరుక్కుపోతామన్నది వాటి భయం! ఏ దేశం కూడా తమ ఆర్థిక వ్యవస్థలను పణంగా పెట్టి యుద్ధంలోకి దిగాలనుకోవడం లేదు. ఇప్పటికే అవి ఇంధన సంక్షోభంలో పీకల్లోతు మునిగి వున్నాయి. ఇక ఇరాన్, యుఎస్/ఇజ్రాయెల్ యుద్ధంలో బాగా నష్టపోయిన దేశాలు ఏమైనా ఉన్నాయంటే అవి గల్ఫ్ దేశాలు. ఇక్కడ అమెరికా సైనిక స్థావరాలుండటంతో వాటిని లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడంతో పాటు పనిలో పనిగా వాటి ఆర్థిక వ్యవస్థలకు కేంద్రంగా ఉన్న బ్యాంకులు, విమానాశ్రయాలు, పోర్ట్‌లు, ప్రముఖ ఆర్థిక సంస్థలపై ఇరాన్ దాడులు చేస్తుండటంతో గల్ఫ్ దేశాలు కనీవినీ ఎరుగని సంక్షోభంలోకి నెట్టివేతకు గురవుతున్నాయి. ముఖ్యంగా ఈ దేశాల్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్న భారతీయులు, స్వదేశానికి వార్షికంగా పంపే విదేశీ మారకద్రవ్యం విలువ 51.4 బిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఇది నిలిచిపోతే మన ఆర్థిక వ్యవస్థకు పెను ప్రమాదం.

తప్పిన అమెరికా అంచనాలు

ఇరాన్ విషయంలో అమెరికా అంచనాలు పూర్తిగా తప్పాయి. కీలక నేతలను హతమారిస్తే దేశం తన నియంత్రణలోకి వస్తుందనుకున్న డోనాల్డ్ ట్రంప్‌కు ఇప్పుడు ఇరాన్ అసలు బలమేంటో తెలిసొస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఉన్న రష్యాకు, చౌకధరలో ఆయుధాలను సరఫరా చేస్తున్న ఫలితంగా అదొక ఆయుధ కర్మాగారంగా మారిందని చెప్పాలి. ఇప్పుడు ఇరాన్ అక్షయ తూణీరాల మాదిరిగా ఆయుధాలను సొంతంగా తయారు చేసుకుంటూ ఇజ్రాయెల్, యూఎస్‌లను ముప్పు తిప్పలు పెడుతోంది. విచిత్రమేంటంటే కీలక నాయకులు మరణించినా యుద్ధం చేసే సామర్థ్యం తగ్గక పోగా మరింత రెచ్చిపోయి ఇరాన్ దాడులకు దిగుతుండటంతో అమెరికాకు ఎటూ పాలుపోవడం లేదు. ఫలితంగా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది.

రష్యా చమురు కొనుక్కోవచ్చు

ఈ యుద్ధంతో అమెరికా మిత్రులైన ఐరోపా

దేశాలు, ఇతర ఆసియా దేశాలు కూడా పెను సంక్షోభంలో కూరుకుపోతున్న నేపథ్యంలో భారత్ సహా అన్ని దేశాలకు మార్చి 6 నుంచి 30 రోజుల పాటు రష్యా చమురు కొనుగోలుకు అనుమతిస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రష్యాపై విధించిన చమురు ఆంక్షలను సడలించాలని హంగరీ చేసిన ప్రతిపాదనను ఈయూ దేశాలు తిరస్కరించాయి. రష్యా చమురును శాశ్వతంగా బ్యాన్ చేయడమే తమ నిర్ణయమని కుండబద్దలు కొట్టడమే కాకుండా ఇందుకు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణలో తలమునకలుగా ఉన్నాయి. అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా చమురు కొనుగోళ్లను మనదేశంలోని ప్రైవేటు కంపెనీలు నిలిపేసాయి. అమెరికాలో ఉన్న తమ వ్యాపారాలు కుప్పకూలి పోతాయన్న భయమే ఇందుకు కారణం. కాకపోతే మన దేశ ప్రభుత్వ రంగ సంస్థలు చమురు కొనుగోళ్లు

కొనసాగిస్తున్నాయి. అమెరికా ప్రకటన నేపథ్యంలో మనదేశానికి చెందిన చమురు సంస్థలు కేవలం ఒక్క వారంరోజుల్లోనే 30మిలియన్ బ్యారళ్ల రష్యా చమురును కొనుగోలు చేయడం విశేషం. ఇటీవలి కాలంలో రష్యా చమురును ప్రధానంగా కొనుగోలు చేస్తున్న దేశం చైనా. అయితే అమెరికా ఆంక్షలు ఎత్తివేసిన నేపథ్యంలో భారత్‌కు చెందిన కొనుగోలు కంపెనీలు ఒక్కసారిగా పోటీలుపడి మరీ చమురుకు ఆర్డర్లు ఇవ్వడంతో, చైనాకు సరఫరా చేసే చమురు నౌకలను రష్యా మనదేశానికి తరలిస్తోంది. ఫలితంగా రాబోయే కొద్ది రోజులో ఏడు రష్యా చమురు నౌకలు మనదేశంలోని వివిధ పోర్టుల్లోకి రానున్నాయి. వీటివల్ల ముంబయి, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో ఇప్పటికే మూతపడిన వివిధ వ్యాపార సంస్థలకు తాత్కాలిక ఊరట లభించనుంది. ప్రస్తుతం మనదేశం 74రోజుల పాటు దేశంలో చమురు

నిల్వలుండేలా జాగ్రత్తలు తీసుకుంటోంది.

జాక్‌పాట్ కొట్టిన రష్యా

కేవలం మనదేశం మాత్రమే కాదు, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు కూడా రష్యా చమురు కొనుగోలుకు ముందుకు రావడంతో రష్యా ఉరల్స్ ఆయిల్ బ్యారల్‌కు 98.93 డాలర్లకు చేరుకుంది. ఇప్పటివరకు మనకు రాయితీ ధరకు రష్యా చమురు సరఫరా కాగా, పెరిగిన ధరలకు చమురు కొనుగోళ్లు చేస్తుండటంతో, ఒకరకంగా రష్యా పంట పండిందనే చెప్పాలి. గత ఫిబ్రవరి 27 నుంచి రష్యా చమురు ధరలు ఒక్కసారిగా 70% పెరిగిపోయాయి. అంతకు ముందు రాయితీ ధరకు అంటే బ్యారల్‌కు సుమారు 40 డాలర్లకు మనకు చమురు సరఫరా చేసింది. ప్రస్తుతం అమెరికా ఆంక్షల ఎత్తివేత కేవలం మార్చి 5వ తేదీకి ముందు లోడ్ చేసిన చమురు నౌకలకు మాత్రమే వర్తిస్తున్న నేపథ్యమే, రష్యా హడావుడిగా చైనాకు సరఫరా చేయాల్సిన చమురు నౌకలను కూడా భారత్‌కు మళ్లించడం వెనుక ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో ఈ ముడి చమురు దిగుమతి కోసం మనదేశంలోని వివిధ పోర్టులను సిద్ధం చేస్తున్నారు.

చిక్కుకుపోయిన నౌకలు

యుఎస్/ఇజ్రాయిల్–ఇరాన్ యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 27వ తేదీ నాటికి దాదాపు ముడి చమురు, ఎల్ఎన్‌జీతో కూడిన 150 నౌకలు హోర్ముజ్ జలసంధి వద్ద చిక్కుకుపోయాయి. వీటిల్లో 38 నౌకలు మనదేశానికి రావలసినవి. వీటిల్లో 22 నుంచి 24 వరకు పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకుపోగా మిగిలినవి గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో నిలిచిపోయాయి. మార్చి 12న ప్రధాని నరేంద్రమోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో టెలిఫోన్‌లో సంభాషించిన నేపథ్యంలో ఈనౌకల్లో కొన్నింటిని మాత్రం సురక్షితంగా హోర్ముజ్ జలసంధి నుంచి పంపేందుకు ఇరాన్ అంగీకరించింది. ఈ యుద్ధంలో తటస్థ వైఖరి అనుసరిస్తున్నందున భారత్ నౌకలకు ఎటువంటి ఆటంకం ఉండదని ఇరాన్ సూచించడం గమనార్హం. నౌకల అనుమతి నిరాకరణ కేవలం అమెరికా, దాని మిత్ర దేశాలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. భారత్–ఇరాన్‌ల మధ్య జరిపిన చర్చలు ఫలవంతం కావడం ఇందుకు దోహదం చేసిందనే చెప్పాలి. ఇప్పటివరకు నాలుగు నౌకలు సురక్షితంగా మన దేశానికి చేరుకోగా పర్షియన్ గల్ఫ్ వద్ద నిలిచిపోయిన మిగిలిన నౌకలకు విముక్తి లభించనుంది. మనదేశానికి అవసరమైన చమురులో 55% చమురును మధ్యప్రాచ్య దేశాల నుంచే కొనుగోలు చేస్తుంది. ఈ చమురు మొత్తం ఈ జలసంధి గుండానే రవాణా అవుతుంది.

ఈ ప్రాంతంలో ప్రయాణించే నౌకల ఇన్సూరెన్స్ ప్రీమియం ఆరు రెట్లు పెరగడంతో పాటు ఇతర కారణాలవల్ల మార్చి నెలలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారల్‌కు 102.27 డాలర్లకు చేరుకుంది. ఈ నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఏదోవిధంగా తెరిపించాలన్న ఉద్దేశంతో దీనికి సమీపంలోని ఇరాన్ క్షిపణీ వ్యవస్థలపై 5వేల పౌండ్ల బరువున్న బంకర్ బస్టర్ బాంబులను అమెరికా ప్రయోగించినా ప్రయోజనం కలుగలేదు. యుద్ధం ఇలాగే కొనసాగితే 2026 తొలి అర్ధభాగంలో ప్రపంచ జీడీపీ వృద్ధి 0.6% పడిపోయే ప్రమాదముందని జె.పి. మోర్గాన్, గోల్డ్‌మన్ సాచ్ సంస్థలు హెచ్చరించాయి. ఇరాన్ అణ్వాయుధాలు ప్రయోగిస్తుందన్న భయంతో యుఏఈ, ఖతార్, కువైట్, ఇరాక్ వంటి దేశాలు చమురు ఉత్పత్తిని రోజుకు 6.2–6.9 మిలియన్ డాలర్లకు కుదించాయి. ఇక చమురు ఉత్పత్తి చేసే దేశాలు (ఓపెక్), ఏప్రిల్ నుంచి రోజుకు 2,06,000 బ్యారళ్ల వరకు ఉత్పత్తిని పెంచాలని నిర్ణయించాయి. పరిస్థితి మరింత విషమిస్తే ముందు జాగ్రత్త చర్యగా చెబుతున్నా, ప్రపంచ అవసరాలతో పోలిస్తే పెంపు చాలా తక్కువ.

గడువు తర్వాత పరిస్థితేంటి?

అమెరికా ఇచ్చిన సడలింపు గడువు ముగిసిన తర్వాత దేశంలో చమురు, గ్యాస్ సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అత్యవసర సరుకుల చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రాధాన్యతా క్రమంలో చమురు, గ్యాస్‌ను సరఫరా చేస్తూ కొన్ని పరిమితులు విధించే అవకాశముంది. హోర్ముజ్ జలసంధి నుంచి చమురు సరఫరాను 40%కు తగ్గించేందుకు చర్యలు తీసుకుంది. మిగిలిన 60% చమురును రష్యా, పశ్చిమ ఆఫ్రికా, అమెరికా, సెంట్రల్ ఆసియా దేశాలనుంచి దిగుమతి చేసుకోనుంది. ఇక గ్యాస్ కొరత నుంచి బయటపడటానికి ఆస్ట్రేలియా, కెనడా, నార్వే, యూఎస్‌లతో చర్చలు జరుపుతోంది. అంతేకాదు ఇరాన్‌తో సముద్ర గర్భం గుండా గ్యాస్ పైప్‌లైన్‌ను భారత తీరం వరకు నిర్మించే విధంగా మనదేశం చర్చలు జరుపుతోంది.

ఇది కార్యరూపం దాలిస్తే రోజుకు 31.5 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ మనదేశానికి సరఫరా అవుతుంది. ప్రస్తుతం మనదేశం విశాఖపట్టణం, మంగళూరు, పడూరుల్లో 5.33 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురును నిల్వ చేస్తున్నది. వీటికి తోడు ఐఓఎల్, బీపీఎల్, హెచ్‌పీసీఎల్‌లకు తమ సొంత నిల్వ కేంద్రాలున్నాయి. ప్రస్తుతం దేశంలో ఉన్న వ్యూహాత్మక పెట్రోలియం నిల్వ కేంద్రాలు (ఎస్‌పీఆర్)లలో 50%ను వాణిజ్యానికి ఉపయోగించడం ద్వారా వచ్చే ఆదాయంతో బికనీర్, బినా ప్రాంతాల్లో పెద్ద పెట్రోలియం నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మంగళూరులోని నిల్వ కేంద్రాన్ని విస్తరించాలన్న యోచనలో వుంది. వీటికి తోడు 2025–26లో 20% ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుంది. దీనివల్ల ఏటా 44మిలియన్ బ్యారళ్ల చమురు దిగుమతులు తగ్గుతాయి. గ్రీన్ హైడోజన్ మిషన్ కింద, హైడ్రోజన్ ఇంధన వాడకాన్ని పెంచడం ద్వారా 2030 నాటికి లక్షకోట్ల రూపాయల విలువైన చమురు ఇంధన దిగుమతులను తగ్గించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది.

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

యుద్ధానంతర పరిణామాలకు సిద్ధం

భౌగోళిక ప్రాంతాల వ్యాప్తంగా కరెన్సీ, చమురు, బులియన్, కమోడిటీస్ మార్కెట్లలో అస్థిరత, వినియోగ డిమాండ్‌లో తగ్గుదల, సరఫరా గొలుసులో అంతరాయం, బహిర్గతంగా అనిశ్చితి వంటివి మధ్యకాలికంగా ప్రభావం చూపవచ్చు.

దాదాపు అరడజను సంఘర్షణలు ఏక కాలంలో జరుగుతున్నందున, మధ్యకాలికంగా ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఎవరూ హామీ ఇవ్వలేరు. వాటిలో చాలావరకు రక్తపాతంతో కూడుకున్నవి. అవి భారీ సంఖ్యలో ప్రాణనష్టం, ఆస్తి, మౌలిక సదుపాయాల నష్టానికి దారితీయడంతో పాటు సైనిక సామర్థ్యాలను కూడా కుంటుపరుస్తాయి.

రష్యా–ఉక్రెయిన్ సంఘర్షణ నాలుగేళ్లుగా కొనసాగుతున్నప్పటికీ, అది ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించనప్పటికీ, ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం దాని పర్యవసానాలతో చాలా కాలం పాటు కొనసాగవచ్చని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇరాన్‌లో 1979 విప్లవం తర్వాత రాజకీయ అధికారంతో మత నాయకత్వం నడుపుతున్న పాలనను మార్చాలన్న తన బహిరంగ లక్ష్యాన్ని సాధించడం అమెరికాకు అంత సులభం కాదనేది చాలా వర్గాల్లో వినిపిస్తున్న మాట.

ఇది భద్రతా యంత్రాంగానికి లంచం ఇచ్చి, జనవరి 3, 2026న వెనిజులా అధ్యక్షుడి ఇంటిలోకి ప్రవేశించి, దేశాధినేత నికోలస్ మదురోను అపహరించి, అజ్ఞాత ప్రదేశానికి విమానంలో తరలించడం లాంటిది కాదు.

బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని ఇజ్రాయెల్ నాయకత్వంతో కలిసి ఇరాన్ చుట్టూ అమెరికా చేపట్టిన నౌకాదళ సమీకరణను బట్టి చూస్తే, అది దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధపడి ఉండాలి. ఇరాన్‌కు అణ్వాయుధాలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని నిరాకరించడం, పశ్చిమ ఆసియాలో అధికార సమీకరణాలను తిరిగి రూపొందించడం, తద్వారా ఆ ప్రాంతంలో రష్యా–చైనా కూటమిని బలహీన పరచడం అమెరికా, ఇజ్రాయెల్ రెండింటి బహిరంగ లక్ష్యం.

మరో సిద్ధాంతం ప్రకారం, అధ్యక్షుడు ట్రంప్, వైట్ హౌస్‌ను నడుపుతున్న ఆయన రిపబ్లికన్ 'ఎ' టీమ్, 157 బిలియన్ బ్యారెళ్లకు పైగా చమురు సంపద కలిగిన ఇరాన్ వద్ద ఉన్న భారీ హైడ్రోకార్బన్ నిల్వలపై కన్నేశారు. అలాగే, గల్ఫ్ ఆఫ్ హోర్ముజ్ ఇరుకైన మార్గాలలో వాణిజ్య, నౌకాదళ నౌకల కదలికలపై పూర్తి అధికారాన్ని పొందడం కూడా వారి ఉద్దేశం. అమెరికన్ డీప్ స్టేట్, దాని అనుచరుల కోసం వెనిజులా చమురు పరిశ్రమను తన నియంత్రణలోకి తీసుకోవడం ద్వారా, ఆదర్శవాద అధ్యక్షుడు ట్రంప్ విజయం రుచి చూసినట్లు కనిపిస్తోంది.

గత సంవత్సరం జూన్ 13 నుండి 26 వరకు ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ ముగియడానికి పట్టిన పన్నెండు రోజుల మాదిరిగా, ఈ తీవ్రమైన, సాంకేతికతతో నడిచే యుద్ధం మరో రెండు వారాల్లో ముగిసినప్పటికీ, దాని పర్యవసానాలు యావత్ మానవాళిపై పడతాయి, అయితే ఇప్పటివరకు మానవాళి వాస్తవంగా ఒక మూగ ప్రేక్షక పాత్రకే పరిమితమైంది.

ఐరోపాలోని కొన్ని దేశాలు ఈ రక్తపాత యుద్ధంలో చేరతామని బెదిరించినప్పటికీ, ఇతర దేశాలు మాత్రం ఇప్పటివరకు ఇజ్రాయెల్ సహా పశ్చిమ ఆసియా అంతటా నగరాల తర్వాత నగరాలు నాశనం కావడాన్ని పక్కనుండి చూస్తూనే ఉన్నాయి.

ముఖ్యంగా ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరణించినట్లు వార్తలు వచ్చిన తర్వాత, ఈ యుద్ధం తన విధ్వంసకర పంజాను పశ్చిమ ఆసియా అంతటా వ్యాపింపజేసి, తద్వారా మొత్తం విమాన ప్రయాణం, ఉమ్మడి జలమార్గాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, రవాణా మౌలిక సదుపాయాలను వాస్తవంగా స్తంభింపజేసింది.

యుద్ధం కారణంగా ఈ ప్రాంతంలో వేలకొద్దీ విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. వివిధ ప్రాంతాల మీదుగా క్షిపణులు దూసుకువస్తుండటంతో, రోడ్లు, రైలు, జలమార్గాల నెట్‌వర్క్‌లో ప్రయాణం అసురక్షితంగా, అనూహ్యంగా మారింది. ఆతిథ్య రంగం స్తంభించిపోయింది. ఈ ప్రాంతం అంతటా వస్తువులు, సేవలతో వ్యవహరించే వాణిజ్య సంస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతంలో వాణిజ్య సంస్థలను నడుపుతున్న లక్షలాది మంది నిపుణులు అకస్మాత్తుగా అభద్రతకు, ఆందోళనకు గురయ్యారు.

అమెరికా–ఇజ్రాయెల్ బాంబు దాడులు ఆగడం

కె.ఎ.బదరీనాథ్
డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్,
సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ అండ్
హోలిస్టిక్ స్టడీస్, న్యూఢిల్లీ.

కావాలి

లేదు. మరోవైపు, ఇరాన్ షియా నాయకత్వం పదకొండు దేశాల్లోని చమురు కేంద్రాలతో పాటు అరడజను రాజధానులు, ఓడరేవులు, విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని భారీ సంఖ్యలో క్షిపణులతో ప్రతీకారం తీర్చుకుంది.

పశ్చిమ ఆసియా కేంద్రంగా ఉన్న చమురు మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. కార్గో బీమా నష్టభయాలు ఆకాశాన్నంటాయి. పశ్చిమ ఆసియా ఆర్థిక రాజధాని దుబాయ్‌పై ఇరాన్ క్షిపణి దాడి చేసిన నేపథ్యంలో కరెన్సీ మార్కెట్లు కూడా భారీ హెచ్చుతగ్గులకు లోనయ్యాయి.

భారత దృక్కోణం నుండి చూస్తే, సంభావ్య ఆర్థిక ప్రభావంపై ప్రమాద ఘంటికలు ఇంకా మోగలేదు. మార్చి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పుడు, బ్యారెల్‌కు 60-62 డాలర్ల చమురు ధరలను ఆమె పరిగణనలోకి తీసుకున్నారని నివేదికలు, స్వతంత్ర విశ్లేషకులు సూచిస్తున్నారు.

ఒకవేళ, స్పాట్ మార్కెట్, దీర్ఘకాలిక ముడి చమురు కాంట్రాక్టులు రెండింటిలోనూ అస్థిరత కొనసాగితే, మధ్యకాలికంగా భారతదేశం దాని వేడిని అనుభవిస్తుంది. ముడి చమురు దిగుమతులపై దేశం భారీగా ఆధారపడి ఉన్నందున, చమురు ధరలలో ప్రతి డాలర్ పెరుగుదలకు దేశం అదనంగా ఒక బిలియన్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.

అదృష్టవశాత్తూ, పశ్చిమ ఆసియాలో రష్యా-ఉక్రెయిన్, ఆఫ్ఘనిస్తాన్-పాకిస్తాన్ మధ్య జరిగిన రక్తపాత ఘర్షణల ఫలితంగా చమురు, కరెన్సీ మార్కెట్లలో ఏర్పడే తాత్కాలిక ఒడిదుడుకులను తట్టుకునే స్థితిస్థాపకత భారత ఆర్థిక వ్యవస్థకు ఉంది. ముమ్మందు సరుకు రవాణా, కరెన్సీ మార్పిడులు, చమురుపై ప్రీమియంలు పెరిగే నేపథ్యంలో, యుద్ధాల సమిష్టి ప్రభావం మధ్యకాలికంగా ప్రతిబింబించే అవకాశం ఉంది.

కేంద్ర ప్రభుత్వ రుణాలు బడ్జెట్‌లో కేటాయించిన రూ. 14.82 లక్షల కోట్ల కంటే చాలా తక్కువగా ఉండటం, ప్రతి నెలా రూ. 1.83-1.93 లక్షల కోట్ల మేర వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు భారీగా జరుగుతుండటంతో, కనీసం రాబోయే రెండు త్రైమాసికాల వరకు యుద్ధాల సంయుక్త ప్రభావాన్ని అధిగమించేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం పూర్తి నియంత్రణలో ఉంది.

అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వ ఖర్చులు బడ్జెట్‌లో కేటాయించిన రూ. 50.65 లక్షల కోట్ల పరిధిలోనే ఉండటం, చివరి రెండు నెలల్లో (ఫిబ్రవరి - మార్చి 2026) ఖర్చుల జోరు ఉన్నప్పటికీ, స్థూల ఆర్థిక గణాంకాలు అదుపు తప్పకపోవచ్చు. ఏప్రిల్ 2025 - జనవరి 2026 మధ్య, కేంద్ర ప్రభుత్వ వ్యయం రూ. 36.90 లక్షల కోట్లను దాటలేదు. యుద్ధాల అనంతర పరిణామాలను ఎదుర్కోవడంలో అత్యంత బలహీనమైన అంశం విదేశీ వాణిజ్య రంగం. ఇక్కడ ప్రతికూల సెంటిమెంట్ చాలా తక్కువగా ఉండటం, వినియోగానికి డిమాండ్ తగ్గడం, చెల్లింపుల సంక్షోభం తీవ్రంగా పొంచి ఉండటంతో సేవలు, వాణిజ్య వస్తువుల ఎగుమతులు అనిశ్చితిని ఎదుర్కోవచ్చు. భారతదేశంలోని ప్రధాన మౌలిక సదుపాయాల సంస్థలు అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి పనిచేసి, యుద్ధానంతర పునర్నిర్మాణ ఒప్పందాలను కుదుర్చుకోవడం ద్వారా డిమాండ్‌లో తగ్గుదలను కొంతవరకు భర్తీ చేయగలవు. ఈ ఒప్పందాల విలువ బిలియన్ల డాలర్లకు పైగా ఉంటుంది. మధ్యకాలికంగా యుద్ధ పరిణామాలను ఎదుర్కోవడానికి సన్నద్ధం కావడాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం తన ఆర్థిక అజెండాలో భాగంగా ప్రాధాన్యతగా పరిగణించాలి. ★

పంచ పరివర్తన్

పంచ పరివర్తనము ప్రతి యెదలో రావాలి
పుడమి పులకరించాలి శాంతి వెల్లి విరియాలి
పదం పదం కలిపి మనం నడుద్దాం
చేయి చేయి కలిపి ముందుకేగుదాం ॥పంచ॥

కులమత భేదాలు లేని సమాజమ్ము కావాలి
మనుషులంత ఒక్కటనే భావన పెంపొందాలి
సామాజిక సమరసతను చాటుదాం
సామరస్యమే గమ్యమనీ సాగుదాం ॥పంచ॥

కుటుంబ ప్రబోధనము అందరికీ తెలుపుదాము
కలిసి భుజిద్దాము ప్రేమ సుధలు పంచుదాము
అనురాగం ఆత్మీయత నిండగా
మమతల మాధుర్యములు పండగా ॥పంచ॥

మన వేషం మన భాష మనకెంతో గర్వము
మన దేశపు వస్తువులే వాడడం మన ధర్మము
స్వదేశీ విధానమ్మే ముద్దురా
పరదేశీ వ్యామోహం వద్దురా ॥పంచ॥

చుక్క చుక్క నీటిబొట్టు ఒడిసి పట్టుకుందాము
మొక్కలను పెంచుదాము ధరణిని కాపాడుదాము
ప్లాస్టిక్ భూతాన్ని పారదోలుదాం
ప్రకృతిమాత ఒడిని సేద తీరుదాం ॥పంచ॥

క్రమశిక్షణ కలిగినట్టి పౌరులుగా ఎదుగుదాం
చట్టాన్ని గౌరవించి ధర్మాన్ని పాటిద్దాం
బాధ్యత గల పౌరులుగా మెలగుదాం
భరతమాత సేవ కొరకు కదలుదాం ॥పంచ॥

- బండిరాజుల శంకర్, 9948050608



యుద్ధం అనే చిన్నపదం ప్రపంచానికి మాత్రం చాలా ప్రమాదం. మహాభారత యుద్ధానికి ముందు పాండవుల తరపున శ్రీకృష్ణుడు రాయబారానికి కౌరవుల వద్దకు దూతగా వెళ్తాడు. ఆ సందర్భంలో "నీ పిల్లలు పాపలున్ ప్రజలు పెంపు వహింపగ పొందు సేసెదో / ఎల్లి రణం బెగూర్చెదవో ఏర్పడజెప్పుము కౌరవేశ్వరా" అని హితవు పలుకుతాడు. (దుర్యోధన నీ పిల్లలు, పాపలు, ప్రజలు వృద్ధి చేసెడి శాంతి కావాలా, నాశనాన్ని తెచ్చే యుద్ధం కావాలా అని అర్థం), కాని కౌరవేశ్వరుని బుద్ధి యుద్ధానికే మొగ్గు చూపింది. సమరం ముగిసే నాటికి సర్వనాశనమైంది. బూడిద మిగిలింది. "నీ ఒంట్లో నువ్వుండాలంటే – నీ ఇంట్లోనే నువ్వుండు" అని యుద్ధం మనిషిని శాసిస్తుంది.

శ్రీనాథుడు చెప్పినట్లు "పోరు మంచిది కాదు భూమి నెక్కడను, పాడౌను దేశమ్ము పగమించెనేని" ఇది త్రికాల సత్యం. ధర్మరాజు చెప్పినట్లు మొత్తం దొరకేదంతా నెత్తురు కూడే, పారేదంతా రక్తపుటేరే. మనిషి భవిష్యత్తు మాడిపోతుంది. ఇది కసి చేసే కరాళ నృత్యం, మసిచేసే విషాద కృత్యం. దీనిలో గెలిచేది ఎవరైనా ఓడేది మాత్రం మనిషి.

విశ్వ ఆర్థిక, సామాజిక, రాజకీయ పునాదులు కుదేలవుతాయి. ఒకప్పుడు యుద్ధమంటే ఇద్దరు రాజులకో, రెండు రాజ్యాలకో పరిమితం. ఇప్పుడలా కాదు "ధరణీ చక్రంబు తల్లడ మందగ, పృథు గోత్ర శైలముల్ పెల్లగిల్లె" అని భాస్కర రామా యణంలో చెప్పినట్లు భూమండలమంతా కంపిస్తు న్నది. ''విలయ వయోధి మగ్నమయె విశ్వమహీ వలయంబు" అని భారతంలో ఎర్రా ప్రగడ చెప్పిన మాట మన కళ్ల ముందు బొమ్మలా కదులుతుంది. మనిషి భవిష్యత్తు మాడిపోతుంది. అమీర్ మినాయ్ అనే ఉర్దూ కవి చెప్పినట్లు "కత్తి పోటు ఎవరి మీద పడిన కొట్టుకొనేది నేనే, లోకంలోని శోకమంతా నా ఎదలోనే కొట్టుకొంటుంది" అనేది మానవ జాతి మొత్తానికి వర్తిస్తుంది.

ఎపిరస్‌కు చెందిన పైరస్ (క్రీ॥పూ॥ 319–272) ఒక ప్రఖ్యాత హెలెనిస్టిక్ జనరల్ అతనికి పై పళ్లు విడిగా కాకుండా ఒకే ఎముకలా ఉండేది. దానితో భయంకరంగా ఉండేవాడు. శత్రువులకు అతడంటే భయం అని ప్రచారం చేసుకునేవాడు. ఇతడు చేసిన యుద్ధాలు ఇప్సస్ యుద్ధం(బి.సి.301), పిరిక్ యుద్ధం(బి.సి.280–275), హెరాక్లియా యుద్ధం (బి.సి.280) అస్కుల యుద్ధం (బి.సి.279) బెనెవెంటమ్ యుద్ధం (క్రీ.పూ.275) సిసిలియన్ ప్రచారం (బి.సి. 278–276). సిసిలియన్ ప్రచారం, గ్రీకు ప్రచారంతో సంపద మొత్తం ఖర్చు అయిపోయి అప్పుల పాలయ్యాడు. అందుకే "పెరిక్ విక్టరీ" అనే పదం పుట్టింది. అంటే గెలిచినా దేశాన్ని బూడిద చేసుకోవడం. యుద్ధాలలో గెలిచాడే గాని అప్పుల పాలయ్యాడు. అయినా గొప్ప వ్యూహకర్త (అలెగ్జాం డర్ తరువాత 2వ గ్రేట్ జనరల్). దేశ సంపద, జన సంపద నాశనం చేసిన మహావ్యక్తి. గెలిచి బూడిద మిగిల్చాడు. ఇప్పుడు జరిగేవన్నీ పెరిక్ విక్టరీలే, గెలిచిన వారికి, ఓడిన వారికి అతి భారీ ధన, ప్రాణ నష్టాలతో దివాలాతీసి ప్రజలను వీధిన పడేస్తారు.

యుద్ధానికి కొన్ని ధర్మాలను నిర్దేశించారు. ఈ క్రింది వారిని చంపరాదు. వెరచిన వాని (భయపడే వాడిని) ధైన్యము వెదురు నొందిన (ఆలోచన తోచని) వానిని, నిద్రలో ఉన్న వారిని, స్త్రీ, బాల, వృద్ధ జనాన్ని హింసించడం, చంపడం మహా అపరాధమని భాగవతం చెప్పిన సూక్తి నేడు బధిర శంఖారావం అవుతున్నది.

యుద్ధాలూ, సాయుధ ఘర్షణలతో మానవజాతి చరిత్ర నెత్తుటితో తడిసిపోతుంది. అగ్రరాజ్యాల సామ్రాజ్య వాదానికి ముష్కర మూకల పైశాచికత్వం జతకలిసి నిండు జీవితాలను నిలువునా కబళిస్తు న్నాయి. 1989–2024 మధ్యలో ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక మారణకాండల్లో 39 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని అంచనా. వీరిలో ఆఫ్రికా, పశ్చిమాసియా, ఆసియా, ఓషియానియా లలో అత్యధికంగానూ, ఐరోపా, అమెరికా ఖండాలలో అల్పంగాను నష్టపోయారు. యుద్ధాలు మిగిల్చే చేదు గాయాలు చిన్నారులను అనునిత్యం వెంటాడుతూ, వారి జీవితాలను నరకప్రాయం చేస్తాయి. బాలలకు భద్రమైన భవిష్యత్తు అందించలేనప్పుడు ప్రపంచం ఎంత ప్రగతి సాధించీ నిష్ప్రయోజనమే. స్వార్థ ప్రయోజనాలకోసం యుద్ధ రక్కసి కోరలకు పదును పెడుతున్న దేశాలు ఈ సత్యాన్ని గుర్తించ ట్లేదు. అసహాయ చిన్నారుల ఆక్రందనలను ఆలకించ ట్లేదు.

అదే దౌర్భాగ్యం, ఎన్నో సంసారాలు చల్లారి పోయాయి. జన సందోహం మరణించగా అసహాయులు హా హా కారాలు చేస్తున్నారు.

రెండవ ప్రపంచయుద్ధంలో అమెరికా, జపాన్ లోని హిరోషిమా (ఆగస్టు 6, 1945) నాగసాకి (ఆగస్టు 9, 1945)పై జరిపిన అణుదాడిలో లక్షల్లో అమాయక ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అణుబాంబుల ప్రభావం నేటికి కనపడుతున్నది. జపాన్ అమెరికా ఓడరేవు పెరల్ హార్బర్‌పై జరిపిన దాడి (డిసెంబర్ 7, 1941)లో 2,400 మంది అమెరికా సైనికులు, పౌరులు మరణించారు.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఎనిమిది కోట్ల ప్రాణాలు బుగ్గిపాలు అయ్యాక 1945, జూన్ 26న అంతర్జాతీయ శాంతి, భద్రతను కాపాడటానికి ప్రాథమిక చట్టపరమైన పత్రం ఐక్యరాజ్యసమితి చార్టర్ (కానిస్టిట్యూషన్) రూపొందింది. 193 సభ్యదేశాలతో 6 ప్రధాన విభాగాలతో న్యూయార్క్ నగరంలో ప్రధాన కార్యాలయము ఉంది. నేటి కార్యదర్శి ఆంటానియో గుటెర్స్. యు.ఎన్. ప్రియాం బుల్‌లో "ఐక్యరాజ్య సమితి మా తరం వారిని యుద్ధ భయం నుండి రక్షించి యుద్ధాలను నివారించడానికి, సమాన హక్కులను గౌరవించడానికి, అంతర్జాతీయ సహకారంతో మెరుగైన జీవన ప్రమాణాలను సాధించడానికి ఏర్పడిన సంస్థ" అని ఉంది. ఇదే విధంగా మొదటి ప్రపంచ యుద్ధానంతరం నాలుగు కోట్ల మందిని పొట్టన పెట్టుకున్నాక నానాజాతి సమితి ఏర్పడింది. ఏమి సాధించలేని పరిస్థితుల్లో దాన్ని మూసేశారు.

యుద్ధాల వల్ల విపరీత ప్రాణనష్టమే కాకుండా తరాల మానవ శ్రమ ఫలితమంతా నాశనమవు తుంది. సహజ వనరులు, మౌలిక వసతులతో పాటు శాంతియుత జీవనము ఛిద్రమవుతుంది. కరవులూ, వ్యాధులను సైతం మోసుకొచ్చే వినాశకర సమరాలు సాయుధ ఘర్షణలు. గడచిన వందేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా 23 కోట్ల మందిని పొట్టన పెట్టుకున్నాయి.



2003-2011 మధ్యకాలంలో ఇరాన్-ఇరాక్ యుద్ధం 10 లక్షల మంది ఉసురు తీసింది. సుదీర్ఘంగా సాగిన వియత్నాం పోరు సుమారు 30 లక్షల మంది, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇరువైపులా సుమారు 5 లక్షల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

మాస్కో విచ్చలవిడి దాడి మూలంగా ఉక్రెయిన్ పంట భూముల్లో 16 శాతం దెబ్బతిన్నాయి. ధాన్యం, నూనెగింజల దిగుబడులు 18 శాతం క్షీణించాయి. కీవ్ నుండి గోధుమ, పొద్దు తిరుగుడు ఎగుమతులు సన్నగిల్లడంతో చాలా ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఆహార అభద్రత నెలకొన్నది. ముష్కర మూకల అంతమే ధ్యేయమంటూ హమాస్ భారీ హత్యల తరువాత గాజాను చెరబట్టిన ఇజ్రాయెల్ అక్కడ 67 వేల మంది పాలస్తీయన్లను చంపేసింది. 92 శాతం గృహాలు కూలిపోయాయి.

ఉక్రెయిన్‌పై కయ్యానికి దిగిన రష్యా సైతం మానవతను మంటగలుపుతుంది. ఇప్పుడు ఇరాన్‌పై విరుచుకుపడుతున్న అమెరికా, ఇజ్రాయెల్ కూడా నీతి నియమాలకు నీళ్లొదిలి నెత్తుటేళ్లను పారిస్తున్నాయి. పాఠశాలలపై మరణాయుధాలు ఎక్కు పెడుతున్నాయి. మొన్న అమెరికా-ఇజ్రాయిల్ అమానుష దాడిలో దక్షిణ ఇరాన్‌లోని ఓ పాఠశాల శిథిలాల కుప్పగా మారి 165 మంది బాలికలు కడ తేరిపోయారు. ఈ కిరాతకంపై బాలల హక్కుల పరిరక్షణపై ఏర్పాటైన ఐక్యరాజ్యసమితి నిపుణుల సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతకన్నా ఏమి చేయగలరు. (జంధ్యాల పాపయ్య శాస్త్రి) కరుణశ్రీ, పుష్ప విలాప పద్యాలే గుర్తుకు వస్తున్నాయి. అక్కడ పుష్పాలు, ఇక్కడ ప్రాణాలు అంతే తేడా.

జార్జ్ ఆర్వెల్ 20వ శతాబ్దపు ఆంగ్లేయ రచయిత. ఈయన అసలు పేరు ఎరిక్ ఆర్థర్ బ్లెయిర్. 1903, జూన్ 25న బీహార్‌లోని మోతీహారిలో జన్మించాడు. యానిమల్ ఫార్మ్ అనే వ్యంగ్య నవలను రాసాడు. సుమారుగా ఇది పంచతంత్రవ్రత కథలను పోలి ఉంటుంది. 2వది అయిన నైన్‌టీన్ ఎయిటీ ఫోర్ (1984) యుద్ధమే శాంతి (War is Peace) నవల బాగా ప్రజాదరణ పొందిన పుస్తకం. యుద్ధాలు, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రాసిన నవల.


TEHRAN TIMES

Trump, Look Them in the Eyes

With hundreds of Iranian children dead, the U.S. president still denies the bombing of Minab's elementary school

ఇరాన్‌లోని మినాబ్ తయ్యిబా ప్రీ స్కూల్‌పై దాడిలో విద్యార్థుల మృతికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను బాధ్యుడిని చేస్తూ మృతుల ఫోటోలతో టెహ్రాన్ టైమ్స్ పత్రిక ముఖపత్రం

"యుద్ధమే శాంతి" అనేది ఒక నిరంకుశ రాజకీయ పార్టీ నినాదము. ఆర్వెల్ "ఓషియానియా" పేరిట ఒక ఊహాజనిత దేశాన్ని సృష్టించాడు. దానిలో ఒక నిరంకుశ రాజకీయ పార్టీని ప్రారంభించారు. దీనిలో ముఖ్యపాత్ర విన్‌స్టన్ స్మిత్. ప్రజలను నిరంతరం భయభ్రాంతులకు గురిచేస్తూ, ఉమ్మడి శత్రువుపై ద్వేషాన్ని పెంచడం ద్వారా అంతర్గత స్థిరత్వాన్ని (శాంతిని) కాపాడుకోవచ్చని, తద్వారా అధికారాన్ని నిలబెట్టుకోవచ్చని ఈ పార్టీ సూచన. ఓషియానియా రాజ్యం నిరంతరం ఎప్పుడూ వేరే దేశంతో యుద్ధం చేయాలి. గెలుపు కోసం కాదు ప్రజల ఆలోచనలను నియంత్రించడానికి ఎదురు తిరిగితే అణచివేయడానికి ఉపయోగపడుతుంది.

నిరంతర యుద్ధం వలన వనరులు సైనిక అవసరాలకే ఖర్చు అవుతాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెరగవు. దీనివల్ల ప్రజలు తమ సమస్యల గురించి కాకుండా శత్రువు గురించి ఆలోచిస్తారు. యుద్ధం జరిగినంత కాలం అంతర్గత తిరుగుబాట్లు ఉండవు. అదే పార్టీకి శాంతినిస్తుంది.

రాజకీయ పార్టీకి చెందిన ఒక వక్త ప్రసంగిస్తున్నాడు. తన ప్రసంగంలో ద్వేషాన్ని నూరిపోస్తున్నాడు. దారుణాలు, ఊచకోతలు, బహిష్కరణలు, దోపిడీలు, అత్యాచారాలు, ఖైదీలను హింసించడం, పౌరులపై బాంబుల దాడి, అబద్ధపు ప్రచారం, అన్యాయమైన దురాక్రమణలు, విచ్ఛిన్న ఒప్పందాలు ఇవే పదాలు ప్రజల చెవులకు ఇంపుగా వినిపిస్తున్నాడు. జన సమూహం కోపంతో ఉప్పొంగింది. వేలాది గొంతుల నుండి అదుపులేని క్రూర గర్జన. ముఖ్యంగా పాఠశాల పిల్లలు గోడలపైకి ఎక్కి పోస్టర్లు చించేశారు. ద్వేషంతో బ్యానర్లను ముక్కలు చేశారు(పేజీ 72). "ప్రజల అజ్ఞానమే వీరికి బలం" అంటాడు ఆర్వెల్.

సాయుధ ఘర్షణల ప్రజ్వలనంతో గతేడాది చివరినాటికి ప్రపంచవ్యాప్తంగా ప్రతీ అయిదుగురు చిన్నారులల్లో ఒకరు అభద్రత, అవిద్య, అనారోగ్యాల బారినపడ్డారు. నిత్యం నెత్తురోడుతున్న ప్రాంతాలలో చిన్నారులపై లైంగిక దాడులు, వారి అపహరణ, హత్యలు, అవయవచ్ఛేదన వంటివి జరుగుతున్నాయి. ఇవి 2024లో 30 శాతం పెరిగాయి. జన సమ్మర్ధన ప్రదేశాలను, పిల్లలను కావాలనే లక్ష్యంగా చేసుకుని యుద్ధ వ్యూహాలను రచిస్తున్నారు. వినాశకర సమరాలు బాలల్లో భయాందోళనలు కలిగించి వారి ఎదుగుదలను దెబ్బతీస్తున్నాయి. యుద్ధాలు

మిగిల్చే చేదు గాయాలు చిన్నారులను అనునిత్యం వెంటాడుతున్నాయి. వారి జీవితాలను నరక ప్రాయం చేస్తున్నాయి.

ఏ యుద్ధంలో చనిపోయాడు మీ వాడు, క్రిమియా యుద్ధం, కొరియా యుద్ధం, ప్రథమ, ద్వితీయ ప్రపంచ యుద్ధాలు బిస్మార్క్ నడుగు హిట్లర్‌ను అడుగు అంటూ ఎందుకిలా వొంగి వొంగి కుంగి కుంగి ఈ సమాధుల చుట్టూ వెతుక్కుంటూ తిరుగుతావు. శవాలు మాట్లాడవు సమాధులు చూపించవు / మృత్తిక గుర్తించదు / మిత్తికి దయఉండదు / మీ రోదన మీలోనే అణుచుకుని / ఇలాగ యిలాగ ఈ పాముల పుట్టమ్మట / ఈ మొండి చెట్లమ్మట ఈ కూలిన గట్లమ్మట / వెళ్లి పొండి, వెళ్లిపొండి, వెళ్లిపొండి, వెళ్లిపొండి అంటాడు తిలక్ తన వెన్నెల కురిసిన రాత్రిలో.

డా. కొశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

వేర్పాటువాదులు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించిన ఒక ప్రశ్నకు భారత్ వల్ల సిక్కు అస్తిత్వానికి ముప్పు లేదు; భారత్ వల్లే అది పరిపూర్ణమవుతుంది అనే సమాధానాన్ని సర్దార్ చిరంజీవ్ సింగ్ జీవితం నిస్సందేహంగా ఇస్తుంది. ఆయనను మొదట "జీ" అని పిలిచిన శాఖ నుండి, సంఘ్ మొదటి సిక్కు ప్రచారక్‌గా ఎదిగే వరకు సాగిన ఆయన ప్రస్థానం, భారత్ బలం విచ్ఛిన్నంలో కాకుండా నాగరిక ఐక్యతలోనే ఉందని గుర్తుచేస్తుంది.

సర్దార్ చిరంజీవ్ సి
ఆర్ఎస్ఎస్ తొలి సి

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో సిక్కు–హిందూ సంబంధాల సుదీర్ఘమైన, తరచుగా అపార్థం చేసుకున్న చరిత్రలో, నాగరిక ఐక్యతను ఇంత సహజ సిద్ధంగా మూర్తీభవించిన వ్యక్తులు చాలా తక్కువ. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మొదటి సిక్కు ప్రచారక్ సర్దార్ చిరంజీవ్ సింగ్.

పంత్‌ను దేశం నుండి విడగొట్టాలని చూసిన వలసవాద చరిత్ర రచన, వేర్పాటువాద ప్రచారం, సైద్ధాంతిక వక్రీకరణల ద్వారా రుద్దిన కృత్రిమ ద్వంద్వాలకు ఆయన జీవితం ఒక నజీవ ప్రతిస్పందనగా నిలుస్తుంది.

ఒక ప్రచారక్‌గా మాత్రమే కాకుండా, ఒక నాగరికతా వారధిగా, సిక్కు అస్తిత్వం, భారతీయ నాగరిక చైతన్యం పరస్పర విరుద్ధం కాదని, ఒకదాని కొకటి పూరకమని సహజంగా అర్థం చేసుకున్న వ్యక్తిగా ఆయన జీవితకాల కృషి ఈ దృఢ విశ్వాసం లోనే పాతుకుపోయింది.

దీర్ఘాయువును ప్రసాదించే నామం, వేలాది మందిని ఆశీర్వదించిన జీవితం

సర్దార్ చిరంజీవ్ సింగ్ రైతు హర్కరన్ దాస్ (తర్లోచన్ సింగ్), ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు ద్వారకా దేవి (జోగిందర్ కౌర్) దంపతులకు జన్మించారు. ఆ దంపతులకు ఆయనకు ముందు ఇద్దరు కుమారులు జన్మించారు కానీ వారు విగతజీవులైనారు. ఆయన తల్లి తీవ్ర దుఃఖంతో, ఆశతో, తన బిడ్డ దీర్ఘాయువు కోసం దైవ ఆశీర్వాదం కోరుతూ గురుద్వారాలలోనే కాకుండా దేవాలయాలలో కూడా ప్రార్థించారు. అందువల్ల, "దీర్ఘాయువు కలవాడు" అని అర్థం వచ్చే చిరంజీవ్ అనే పేరును ఎంచుకున్నారు. తన కుమారుడు దీర్ఘకాలం జీవించడమే కాకుండా, దేశసేవ, క్రమశిక్షణ, ఐక్యత మార్గాన్ని లెక్కలేనంత మందికి చూపించడానికి తన జీవితమంతా అంకితం చేస్తాడని ఆమె ఊహించి ఉండరు.

ఆయన జీవితాన్ని మార్చిన 'జీ'

1944లో ఏడవ తరగతి చదువుతున్నప్పుడు, బాల చిరంజీవ్ తన స్నేహితుడు రవితో కలిసి మొదటి సారిగా ఒక ఆర్ఎస్ఎస్ శాఖకు వెళ్లారు. అక్కడి ఆటలు, క్రమశిక్షణ, ప్రార్థనలు ఆయనను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కానీ ఆయనపై చెరగని ముద్ర వేసింది మాత్రం, పైకి చాలా సరళంగా కనిపించే ఒక విషయం. అదే అందరూ ఆయనను "చిరంజీవ్ జీ" అని పిలవడం. ఆయన వయస్సు,మతం, నేపథ్యం పరస్పర గౌరవంలో లీనమైపోయిన వైనాన్ని తొలిసారిగా అనుభూతించారు. 'జీ' అనే పదాన్ని అందరూ వాడటం సమతావాద భారతీయ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది. ఆ శాఖలో ఆయనే ఏకైక సిక్కు అయినప్పటికీ ఆయనకు ఎన్నడూ తాను బయటి వాడినని అనిపించలేదు.ఆ రోజు నుండి, ఆ శాఖ ఆయనకు రెండవ ఇల్లుగా మారింది. 1946 నాటికి, ఆయన ప్రాథమిక శిక్షా వర్గకి హాజరయ్యారు. ఆ తర్వాత 1952 నాటికి మూడు ప్రధాన సంఘశిక్షా వర్గలను పూర్తి చేసి, ప్రచారక్ జీవితానికి అర్హత సాధించారు.

దేశం కోసం ఖైదు

ఆయన తన ప్రాథమిక శిక్షణ పూర్తి చేసిన కొద్ది కాలానికే, మహాత్మాగాంధీ హత్య ఆర్ఎస్ఎస్‌పై దేశవ్యాప్త నిషేధానికి దారితీసింది. వేలాది మంది స్వయంసేవకుల వలె, సర్దార్ చిరంజీవ్ సింగ్ ఈ అన్యాయమైన నిషేధానికి వ్యతిరేకంగా సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఆయన రెండు నెలల పాటు జైలులో ఉన్నారు. ఇది వ్యక్తిగత త్యాగం అసాధారణం కాకుండా సర్వసాధారణమైన జీవితానికి నాంది పలికింది. ఆయన వేరే మార్గాన్ని ఎంచుకుని ఉంటే, పాఠశాల ఉపాధ్యాయుడు అయ్యేవారు. కానీ, బాబు శ్రీచంద్ జీ వంటి జ్యేష్ఠ ప్రచారక్‌ల స్ఫూర్తితో, ఆయన 1953లో ప్రచారక్ అయ్యారు.

పంజాబ్ పర్యాటక ప్రచారక్

దశాబ్దాలుగా సర్దార్ చిరంజీవ్ సింగ్ మలేర్‌కోట్ల, సంగ్రూర్, అంతటా సేవలందించారు. పాటియాలా, రోపర్, లూధియానా–తహసీల్, జిల్లా, విభాగ్, సహ–సంభాగ్ ప్రచారక్‌గా వ్యవహరించారు. 21 నంవత్సరాల పాటు లూధియానాను తన కర్మభూమిగా చేసుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు శిక్షావర్గలకు బోధకుడిగా సేవలందించారు. నాలుగు సార్లు ముఖ్య శిక్షక్‌గా పనిచేశారు.

1984లో, పంజాబ్‌లో ఉగ్రవాదం అత్యంత తీవ్రంగా ఉన్న సమయంలో, ఆయనకు పంజాబ్ విశ్వహిందూపరిషత్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాధ్యతలు అప్పగించారు. ఆయన 1990 వరకు ఆ పదవిలో కొనసాగారు.

ఇదే విషయమై వీహెచ్‌పీ ప్రస్తుత వర్కింగ్ ప్రెసిడెంట్ అలోక్‌కుమార్ మాట్లాడుతూ ఆ హింసాత్మక సంవత్సరాలలో, తీవ్రవాదుల నేరాలకు సిక్కు సమాజాన్ని నిందించవద్దని స్వయంసేవకులకు బోధించింది సంఘ్, చిరంజీవ్ సింగ్ వంటి నాయకులేనని గుర్తుచేసుకున్నారు. ద్వేషాన్ని పెంచుకోవడం సులభమైన ఆ రోజుల్లో, వారు సామాజిక సామరస్యాన్ని బలోపేతం చేశారు.

విభజన రాజకీయాల నుండి
పంజాబీని కాపాడటం

సర్దార్ చిరంజీవ్ సింగ్ అత్యంత దూరదృష్టి గల చర్యలలో ఒకటి 1961 జనాభా లెక్కలకు ముందు తలెత్తిన భాషాపరమైన ఉద్రిక్తతల సమయంలో జరిగింది. ఆర్యసమాజ్ నాయకులలోని కొన్ని వర్గాలు పంజాబీ హిందువులను హిందీని తమ మాతృభాషగా ప్రకటించుకోవాలని ఒత్తిడి చేస్తూ, పంజాబీ సుబా ఉద్యమ సమయంలో సామాజిక విద్వేషాన్ని తీవ్రతరం చేశాయి. ఈ ప్రమాదాన్ని గుర్తించిన చిరంజీవ్ సింగ్, పరమపూజనీయ గురూజీ (ఎం.ఎస్. గోల్వాల్కర్)ను సంప్రదించారు. గురూజీ పంజాబ్‌కు వెళ్లారు.

ంగ్:
క్కు ప్రచారక్

వంజాబ్‌లోని నివానులందరూ సిక్కులు, హిందువులు, ముస్లింలు పంజాబీని తమ మాతృభాషగా ప్రకటించుకోవాలని ఒక స్పష్టమైన పిలుపును ఇచ్చారు.

గురూజీ పిలుపును అనుసరించి, పంజాబ్‌లోని విద్యాభారతి పాఠశాలలు పంజాబీ విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించాయి. ఈ మార్గదర్శకాలను అనుసరించి, పంజాబ్‌లోని విద్యా భారతి పాఠశాలలు పంజాబీ విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించాయి. సామాజిక ఐక్యతను పెంపొందించడానికి పంజాబ్ కళ్యాణ్ ఫోరమ్ వంటి వేదికలను ఏర్పాటు చేశారు.

జాతీయ సిక్కు సంగత్

1984 నాటి క్రూరమైన సిక్కు వ్యతిరేక మారణ కాండలు దేశ మనస్సాక్షిని కుదిపేశాయి. ధర్మానికి చారిత్రక రక్షకులైన సిక్కుల ఊచకోత చాలా మంది జాతీయవాదులకు భరించరానిదిగా మిగిలింది. ఈ నైతిక సంక్షోభంలోనే ఒక బలమైన, జాతీయవాద సిక్కు వేదిక ఆవశ్యకత ఏర్పడింది. తీవ్రమైన చర్చల అనంతరం, 1986లో గురు నానక్‌దేవ్‌జీ ప్రకాష్ పురబ్ రోజున, అమృత్‌సర్ పవిత్ర భూమిపై రాష్ట్రీయ (జాతీయ) సిక్కు సంగత్ స్థాపితమైంది. ప్రఖ్యాత పండితుడు సర్దార్ షంషేర్ సింగ్ దాని మొదటి అధ్యక్షుడిగా, చిరంజీవ్ సింగ్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1990లో షంషేర్ సింగ్ మరణానంతరం, చిరంజీవ్ సింగ్ అధ్యక్ష పదవిని చేపట్టారు. ఆయన నాయ కత్వంలో, సిక్కు-హిందూ నాగరికతా ఐక్యత విషయంలో ఏమాత్రం వెనుకాడని, ఆత్మవిశ్వాసంతో కూడిన జాతీయవాద వేదికగా సిక్కు సంగత్ ఆవిర్భవించింది.

సిక్కు-హిందూ ఐక్యతకు ప్రపంచవ్యాప్త గళం

చిరంజీవ్ సింగ్ భారత్ అంతటా, ఇంగ్లాండ్, కెనడా, జర్మనీ, అమెరికాలో విస్తృతంగా పర్యటించి సిక్కు, హిందూ ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఖల్సా సిర్జన యాత్ర (పాట్నా, 1999) వంటి కార్యక్రమాలు, న్యూయార్క్‌లో జరిగిన ప్రపంచ ధార్మిక సదస్సు (2000)లో పాల్గొనడం వంటివి ప్రపంచవ్యాప్తంగా సంగత్ పరిధిని విస్తరించాయి. మాననీయ పూర్వ సర్ సంఘచాలక్ కె.ఎస్. సుదర్శన్ ఈ ప్రయత్నానికి సైద్ధాంతిక స్పష్టతను అందించడంలో కీలక పాత్ర పోషించారు.

ఒక పరిశోధనా వారసత్వంగా
పుట్టినరోజు కానుక

2015లో, ఆయన 85వ జన్మదినాన్ని పురస్కరించుకొని "ఇహి జనమ్ తుమ్హారే లేఖే" పేరిట ఆయన ఆత్మకథను ఢిల్లీలో పరమపూజనీయ ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ మోహన్‌భాగవత్ విడుదల చేశారు. అనంతరం, మోహన్ భాగవత్ ఆయనకు ఒక సంచిని అందిస్తూ, ఇది సంఘ్ తరఫున ఒక చిన్న బహుమతి అని చెప్పారు. దానిలో రూ. 85 లక్షల నగదు ఉంది. దీనికి చలించి పోయిన చిరంజీవ్ సింగ్, ఆ మొత్తాన్ని సిక్కు చరిత్రపై పరిశోధన కోసం వినియోగిస్తామని వెంటనే ప్రకటించారు. ఆ నిధులను కేశవ్ స్మారక్ సమితి ద్వారా మళ్లించి, ఆ తర్వాత భాయ్ మణి సింగ్ గుర్మత్ రీసెర్చ్ అండ్ స్టడీస్ ట్రస్ట్‌కు అప్పగించారు. ఇది పాండిత్యం పట్ల, సత్యం పట్ల ఆయన జీవితకాల నిబద్ధతకు చివరి నిదర్శనం.

మార్గదర్శిగా ప్రచారక్

నవంబర్ 20, 2023న ఆయన కన్నుమూసినప్పుడు, ఆయన కుటుంబాన్ని పరామర్శించిన వారిలో అప్పటి హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కూడా ఉన్నారు. ఆయన చిరంజీవ్ సింగ్‌ను తన గురువుగా బహిరంగంగా అంగీకరించారు. నిజానికి, ఆయన మార్గదర్శకత్వంతోనే తరతరాల ప్రచారక్‌లు, స్వయంసేవకులు రూపుదిద్దుకున్నారు. పరమపూజనీయ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్, సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబళే జారీ చేసిన అసాధారణంగా సుదీర్ఘమైన నివాళి సందేశాలు ఆయన చేసిన సేవను లోతును ప్రతిబింబించాయి.

తప్పుడు ద్వంద్వాలకు అతీతమైన వారసత్వం

రాష్ట్రీయ సిక్కు సంగత్ నేడు తమ హిందూ నాగరికతా మూలాల పట్ల అవమానంగా కాకుండా, గర్వంగా భావించే జాతీయవాద సిక్కుల వేదికగా నిలుస్తోంది. జఫర్‌నామాపై సెమినార్లు, సిక్కు అమరవీరుల ప్రదర్శనలు, గురు గోవింద్ సింగ్ జీ రచనల అనువాదాలు, సంగత్ మాసపత్రిక 'సంగత్ సంసార్' ద్వారా చిరంజీవ్ సింగ్ ఆశయాన్ని కొనసాగిస్తోంది.

వేర్పాటువాదులు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించిన ఒక ప్రశ్నకు భారత్ వల్ల సిక్కు అస్తిత్వానికి ముప్పు లేదు; భారత్ వల్లే అది పరిపూర్ణమవుతుంది అనే సమాధానాన్ని సర్దార్ చిరంజీవ్ సింగ్ జీవితం నిస్సందేహంగా ఇస్తుంది. ఆయనను మొదట "జీ" అని పిలిచిన శాఖ నుండి, సంఘ్ మొదటి సిక్కు ప్రచారక్‌గా ఎదిగే వరకు సాగిన ఆయన ప్రస్థానం, భారత్ బలం విచ్ఛిన్నంలో కాకుండా నాగరిక ఐక్యతలోనే ఉందని గుర్తుచేస్తుంది. ఆయనను స్మరించుకోవడం ద్వారా మనం కేవలం ఒక వ్యక్తిని గుర్తు చేసుకోవడం లేదు. కాలపరీక్షకు అతీతమైన ఆయన దృక్పథాన్ని స్మరించుకుంటున్నాము.

– జాగృతి డెస్క్

సాగర సమరంలో మందుపాతరలు

సాగర గర్భంలోని భారీ మందుపాతరలే (సీమైన్స్) ఇరాన్-అమెరికా యుద్ధరీతిని మార్చనున్నాయి. హర్మూజ్ జలసంధి మార్గం సాంతం... ఇరాన్ అమర్చిన లింపెట్, మూర్డ్ అనే రెండు రకాల సీమైన్స్‌తో నిండిపోయి ఉంది. మూడు రకాల సీమైన్స్‌లో ఇవి శక్తివంతమైనవి. అమెరికా దాడి మొదలుపెట్టగానే ఇరాన్‌కు చెందిన ఐఆర్జీసీ బలగాలు కొన్ని వందల మందుపాతరలను సముద్ర గర్భంలోకి జారవిడిచాయి. దీంతో హర్మూజ్ జలసంధిలోకి యుద్ధ నౌకలను మోహరించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భయపడుతున్నారు. అత్యంత వ్యూహాత్మక ప్రాంతమైన హర్మూజ్ తీరంలో రాతి కొండలపై అమెరికా యుద్ధ నౌకలపై దాడికి దిగేందుకు ఇరాన్ బలగాలు కాచుక్కుర్చున్నాయి.

ఇరాన్ దగ్గర సుమారు 7వేల సీమైన్స్ ఉన్నాయని పెంటగాన్ లెక్కలు వేసింది. అంతిమ యుద్ధమే వస్తే ఇరాన్ సైన్యం మొత్తం మందు పాతరలు హర్మూజ్‌లో పేల్చేస్తుంది. దీంతో హర్మూజ్ మాత్రమే కాదు, ప్రపంచంలోకి కీలక ఇంధన మార్గాలను పేల్చాలని ఇరాన్ భావిస్తోంది. దీంతో ఇంధన రవాణా మార్గాలు మూసుకుపోయి, గల్ఫ్ దేశాలు సహా ఇజ్రాయిల్ సైతం చమురు సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. సముద్ర మందుపాతరల పేల్చివేత వల్ల భారత్, చైనా సహా అనేక దేశాలు చమురు సంక్షోభాన్ని ఎదుర్కోవడం ఖాయం.

ఇరాన్ సైనిక బలగాలు రకరకాల సముద్ర మందుపాతరలను అమర్చాయి. లింపెట్ మందు పాతరలకు టైమర్‌ను జతచేసి, నౌకల గోడలకు అంటిస్తే అవి భారీ విధ్వంసం సృష్టిస్తాయి. మూర్డ్ మందుపాతరలు సముద్ర గర్భంలో తేలియాడుతూ ఉంటాయి. శత్రు నౌకలు రాగానే పైకి తేలి పోతాయి. అంతే కాదు, వీటిని రాడార్లు పసిగట్టలేవు. నౌకల కిందిభాగంలో వార్ హెడ్లను పేల్చేస్తాయి.

సముద్ర మందుపాతరలు అత్యంత శక్తిమంతమైనవి. నావికాదళ రక్షణలో, ప్రత్యర్థి దేశాల ఓడలు, జలాంతర్గాములను పేల్చేస్తాయి. భారీ స్థాయి ఉక్కు గుళ్లను పోలిన సముద్ర మందుపాతరలకు కత్తుల్లాంటి కొమ్ములుంటాయి. 14,16 శతాబ్దాల్లో జపాన్‌తో చేసిన యుద్ధంలో చైనీయులు వీటిని వాడారు. ఆ తర్వాత పశ్చిమ దేశాలు 1754 తర్వాత వీటిపై దృష్టి సారించారు. ప్రపంచ యుద్ధ చరిత్రలో ఈ మందుపాతరలు కీలకంగా మారి, యుద్ధాల గెలుపోటములను ప్రభావితం చేస్తున్నాయి. తాజా యుద్ధంలో ఇరాన్ వాడుతున్న కారుచౌక డ్రోన్లు, మందుపాతరలు, క్షిపణులు అత్యంత ఖరీదైన, అధునాతనమైన ఆయుధ వ్యవస్థను భయపెడు తున్నాయి. సముద్ర మందుపాతరలను తొలగించడం చాలా ప్రమాదకరమైన ప్రక్రియ. గుర్తించడం కూడా అంతే కష్టం. ఎప్పటికైనా ఇజ్రాయెల్, అమెరికా దేశాలతో ముప్పు తప్పదనే అంచనాతో ఇరాన్ చాలా ముందునుంచే వీటిని సముద్ర గర్భంలో దింపిందనేది నిపుణుల అభిప్రాయం.

ఇరాన్ సముద్ర మందుపాతరల గురించి 'ఫార్చ్యూన్' పత్రిక Irans simplest weapon is now holding the global economy hostage శీర్షికన ఆశ్చర్యపరిచే నిజాలు వెల్లడిస్తూ కథనం రాసింది. కారు చవక ఆయుధాలు ప్రపంచ మార్కెట్‌ను స్థంభింప చేస్తున్నాయని పేర్కొంది. సముద్ర యుద్ధ రంగ నిపుణుడు స్కాట్ సావిజ్ సముద్ర మందుపాతరల గురించి 'simple, and uncool weapons అంటూ అభివర్ణించారు. అంటే తక్కువ ఖర్చుతో మొరటు డిజైన్లతో కనిపించేవని తేల్చారు. అయితే ఇవి సృష్టించే బీభత్సాన్ని ఊహించ లేము. ఇవి దీర్ఘకాలిక నష్టాన్ని చేకూరుస్తాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో వీటిని విస్తృతంగా వాడారు. ఆ తర్వాత వీటి వాడకం తగ్గింది. ఇప్పుడు ఇరాన్ మరోసారి వీటిని వాడేందుకు సిద్ధమైంది. నౌకలు ప్రయాణిస్తున్న సమయంలో మందుపాతరలు పేలాయంటే నౌక నిలువునా రెండుగా చీలి తునాతునకలైపోతుంది స్కాట్ సావిజ్ పేర్కొన్నారు. ఒక క్షిపణి చేసే నష్టం కన్నా ఎక్కువ నష్టం సముద్ర మందుపాతర వల్ల జరుగుతుంది. లక్షల డాలర్ల నష్టానికి కారణమవుతుంది. 1950లో కేవలం రెండే రెండు సముద్ర మందుపాతరలు అమెరికా యుద్ధ నౌకలకు 77శాతం నష్టాన్ని చేకూర్చాయి. అవి ఏ స్థాయి విధ్వంసాన్నీ, నష్టాన్నీ చేస్తాయో అంచనాకు అందదు. 1980లో జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధ సమయంలో ఇరుదేశాలు కలిసి పర్షియన్ గల్ఫ్ లో కేవలం ఈ మందుపాతరలతో 450 నౌకలను నీటిపాలు చేశాయి. అందుకే దీన్ని 'ట్యాంకర్ వార్' అని పేర్కొన్నారు. 1988లో 10మంది అమెరికా నావికదళ సిబ్బంది ఎం08 మందుపాతర దెబ్బకు కూలారు. ఈ ఎం08 మందుపాతరలు సుమారు 80ఏళ్ల నాటి పరిజ్ఞానంతో రూపొందినవి. ఇవి 1983-1991 మధ్య కాలంలో మూడు అమెరికా యుద్ధవిమానాలను ధ్వంసం చేశాయి. ఇరాన్ సముద్ర మందుపాతరల రుచి చూసిన అమెరికా తాజా యుద్ధంలో తన నౌకలను మోహరించేం దుకు జడుస్తోంది. సముద్ర యుద్ధంలో ఆరితేరిన ఇరాన్ వద్ద వ్యవహారం అంత సులభం కాదని అమెరికాకు తెలుసు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో మనదేశం సముద్ర మందుపాతరలను ప్రయోగించి పాక్ నౌకలను పేల్చింది.

ప్రశాంత్ జోషి
సీనియర్ జర్నలిస్ట్

ఆధునిక సాగు విధానాలతో సంక్షోభ స్థితి

ఆధునిక హరిత విప్లవ పితామహుడు ఎం. ఎస్. స్వామినాథన్ నేతృత్వంలో ప్రవేశ పట్టిన హరిత విప్లవం(గ్రీన్ రెవొల్యూషన్-1965) ఫలితాలతో ఆహార ఉత్పత్తులు పెరగడం, ఆహార భద్రత సుసాధ్యం కావడం చూశాం. సాగు పద్ధతుల్లో అధిక దిగుబడులిచ్చే జన్యు మార్పులతో కూడిన హైబ్రిడ్ పంటలు పండించడం, రసాయన ఎరువులను విరివిగా వాడడం, క్రిమి కీటకనాశనులను విచక్షణా రహితంగా ప్రయోగించడం, అత్యాధునిక వ్యవసాయ పరిశోధనల/సాంకేతిక ఫలాలను అమలు చేయడం, యాంత్రీకరణ వాడుకలోకి రావడం లాంటి మార్పులతో ఆహార కొరతను అధిగమిస్తూ మిగులు దిగుబడుల స్థాయికి చేరాం. 'వ్యవసాయం దండగ కాదు పండగ' అనే స్థాయికి దిగుబడులు రావడంతో రైతుల ఆత్మహత్యలు కూడా గణనీయంగా తగ్గడం గమనించాం.

ఆధునిక వ్యవసాయ దుష్ప్రభావాలు

ఆధునిక వ్యవసాయరంగంలో పంటల దిగుబడులు, పశుగ్రాస ఉత్పత్తి, మాంసఉత్పత్తి, పౌల్ట్రీ, పాడి పరిశ్రమలు, ప్రాసెసింగ్ లాంటి ప్రధాన విభాగాలు ఉన్నాయి. నేడు అధిక దిగుబడుల వేటలో రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులు నేలలో కుమ్మరించడం, పంట చేనుపై అపరిమితంగా క్రిమి సంహారక మందులు పిచికారి చేయడం వల్ల దిగుబడులు కొంత పెరిగినా ప్రజారోగ్యానికి, పర్యావరణానికి తీవ్రమైన విఘాతం కలుగుతోంది. అత్యాధునిక సాగు పద్ధతులను పాటించడంతో మట్టి మర్యాద మంటగలవడం, జీవ వైవిధ్యానికి తూట్లు పడడం, అత్యధిక పోషకాలతో యూట్రోఫికేషన్ సమస్యలు చిగురించడం, సారవంతమైన నేలపై పొర కొట్టుకుపోవడం, పర్యావరణ కాలుష్యానికి రెక్కలు రావడం, పంట దిగుబడిలో పోషక విలువలు తగ్గడం, ఆహార ధాన్యాలు కలుషితం కావడం, వాతావరణ ప్రతికూల మార్పులు చోటు చేసుకోవడం, ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారడం, యాంటీ-రెసిస్టెన్ట్ బ్యాక్టీరియా పెరగడం లాంటి పలు అనర్థాలకు దారి తీస్తున్నాయి.రసాయన ఎరువుల వాడకంతో క్రిమికీటకాలు నాశనం,పక్షులు/ఈగలు విష ప్రభావానికి గురి కావడం, ఇతర జంతువుల జీవనం తడబడడం లాంటి ప్రతికూలతలు బయట పడుతున్నాయి.

నేల ఎడారీకరణ సంక్షోభంలోకి...!

నత్రజని, ఫాల్పరస్, పొటాషియం, ఇతర ఖనిజ లవణాలతో కూడిన రసాయన ఎరువుల వాడకంతో పంట చేను ఏపుగా ఎదిగి దిగుబడులు రెట్టింపు అవుతున్నాయి. నీటిని అధికంగా వినియోగించడంతో సారవంతమైన నేలపై పొర కొట్టుకుపోవడం వల్ల క్రమంగా నేల నిస్సారమై ఎడారీకరణకు దారి తీస్తుందన్న సంగతి మరువరాదు. అడవుల నరికివేత, మైనింగ్, అధిక మొత్తంలో సాగు చేయడంతో నేల కోత, మట్టి నాణ్యత క్షీణిస్తోంది. అనేక ఏళ్ల పాటు రసాయన ఎరువులను అపరిమితంగా పడడం వల్ల నేల సారంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం కూడా తగ్గుతుంది. రసాయన ఎరువులతో కూడిన సాగు పద్ధతుల వల్ల దిగుబడులు తగ్గడం, జీవ వైవిధ్యం దెబ్బతినడం, పంటలకు అధికంగా పురుగులు పట్టడం, కార్బన్ నిల్వలు తగ్గడం లాంటి ప్రభావాలు కనిపిస్తాయి. ప్రతి పంట తర్వాత వ్యవసాయ వ్యర్థాలను చెలకల్లోనే కాల్చడం వల్ల గాలి కాలుష్యం, కార్బన్ ఉద్గారాలు, భూతాపం పెరగడమే కాకుండా నేల సారం కూడా పడిపోతున్నది.

'గ్రీన్ హౌజ్' ప్రభావం

ఆధునిక సాగులో అధిక శక్తి వనరులు వినియోగిస్తున్నారు. ఆధునిక వ్యవసాయం ద్వారా 25% వరకు హరిత గృహ వాయువులు (గ్రీన్ హౌజ్) పెరగడం, భూతాపానికి ఆజ్యం పోయడం కనిపిస్తున్నది. వరి సాగు పెరగడం, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల మిథేన్ లాంటి ప్రమాదకర వాయువు వెలువడుతుంది. పోడు పద్ధతుల్లో వ్యవసాయం పెరగడంతో అడవుల విస్తీర్ణం పెరగడం వల్ల కార్బన్ ఉద్గారాలు పెరుగుతూ పర్యావరణం విచ్ఛిన్నం కావడం, భూమి వెడెక్కడం చూస్తున్నాం.

పంటలకు నష్టం కలిగిస్తున్న క్రిమికీటకాలు, సూక్ష్మ జీవుల వల్ల దిగుబడి చాలా పడిపోతున్నది. దీని వల్ల జీవ విచ్ఛిన్నం కాని రసాయనాలను అధిక మొత్తంలో అనాలోచితంగా వాడడం వల్ల ఆహార పదార్థాలు కలుషితమై ప్రజారోగ్యం పడిపోతోంది. రసాయన ఎరువులను విరివిగా వాడడంతో నేల ఎడారీకరణ, కాలుష్యం పెరగడాన్ని గమనిస్తూ రేపటి తరానికి నివాసయోగ్యమైన భూమిని అందించడానికి సాగు విధానాల్లో తగు జాగ్రత్తలు తీసుకుందాం, భూగోళ సహజత్వాన్ని కాపాడుదాం.

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ఆధునిక యువతలో మిశ్రమ పంథా

కాలంతో పాటు భారతీయ సమాజం అతి వేగంగా మారుతోంది. ముఖ్యంగా హిందూ యువత, అబ్బాయిలు, అమ్మాయిలు, తమ ఆలోచనల్లో, జీవన విధానంలో, విలువలలో గణనీయమైన మార్పులను అనుభవిస్తున్నారు. ఈ మార్పులు ఒకవైపు అవకాశాలను తెస్తుంటే, మరోవైపు కొన్ని ఆందోళనలను కూడా కలిగిస్తున్నాయి. ఆధునిక విద్య, సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచీకరణ ప్రభావంతో వచ్చిన ఈ మార్పులను సమతుల్యంగా అర్థం చేసుకోవడం అవసరం.

ఆధునిక పెంపకం, విలువల మార్పుల ప్రభావం వలన ఇప్పటి తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విద్య, స్వతంత్ర ఆలోచన, సమానత్వ భావనలు నేర్పిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న పిల్లలు సంప్రదాయాలకంటే తార్కికతకు ఎక్కువగా ప్రాముఖ్యత ఇస్తున్నారు. మరోవైపు పల్లెటూరి యువత పట్టణజీవన విధానం వైపు మక్కువ చూపుతోంది. ఇది ఆరోగ్యకరమైన మార్పు అయినప్పటికీ, కొన్నిసార్లు తమ సంస్కృతి, ఆచారాలపై అవగాహన తగ్గిపోవడం గమనించదగిన విషయం. పిల్లలకు సంప్రదాయాలను సరైన సమయంలో తెలియచేయక పోవడంవల్ల యుక్త వయసు వచ్చాకా విచ్చలవిడితనాన్ని ప్రోత్సహిస్తున్నట్టుగా స్పష్టమౌతుంది.

సంప్రదాయాలను, మన అలవాట్లను చిన్నతనం నుంచే అనుసరించకపోతే, యుక్తవయసులో వాటిని నలుగురి మధ్యలో అనుసరించటానికి ఎబ్బెట్టుగా తోస్తోంది. మన కట్టు, బొట్టు నామోషీగా అగుపడుతున్నాయి. మనం జరుపుకునే పండుగలు, పర్వదినాల విలువలు తెలియని యువత, నడి వయసువారు వీటిని మూఢాచారాలుగా కొట్టి పడేస్తున్నారు. హిందూ సంప్రదాయాలు చాలా విస్తృతమైనవి. అయితే వీటిని అర్థం చేసుకోవడానికి బదులు, కొందరు యువకులు వాటిని 'పాతవే' అని పక్కన పెట్టే ధోరణి కనిపిస్తోంది. ఫలితంగా సాంస్కృతిక అనుబంధం కొంతమేర తగ్గుతోంది.

లౌకిక భావాలు, సామాజిక సమతుల్యత పెద్ద సమస్యగా మారింది. భారతదేశం ఒక లౌకిక దేశం. అందువల్ల అన్ని మతాల పట్ల గౌరవం చూపడం మన బాధ్యత. ఈ నేపథ్యంలో హిందూ యువతలో కూడా లౌకిక భావాలు పెరుగుతూ, మతం కంటే మానవత్వాన్ని ప్రాధాన్యంగా భావిస్తున్నారు. ఇది సమాజంలో సామరస్యాన్ని పెంపొందించే మంచి లక్షణం. అయితే, ఈ లౌకిక భావాలు కొన్ని సందర్భాల్లో సొంత మతపరమైన గుర్తింపును నిర్లక్ష్యం చేసే స్థాయికి వెళ్లకూడదు. ఇతర మతాల పట్ల గౌరవం చూపడమే కాకుండా, తమ సంస్కృతిని గౌరవించడం కూడా అవసరం.

సామాజిక భయాలు, అస్థిరత

ప్రస్తుత సమాజంలో కొన్ని వర్గాల మధ్య అపోహలు, అనుమానాలు పెరుగుతున్నాయి. సామాజిక మాధ్యమంలో అసత్య ప్రచారం, పాక్షిక సమాచారంతో యువతలో భయాలు పెరుగుతున్నాయి. 'మన సంస్కృతి ప్రమాదంలో ఉంది' అనే భావన కొందరిలో కనిపిస్తోంది. అయితే తమ సంస్కృతిని నిర్లక్ష్యం చేస్తే తమ ఉనికికి స్వయంగా తామే సమాధి కడుతున్నారని యువత తెలుసుకోవాలి. ఈ విషయం చరిత్ర మనకు ఎన్నోసార్లు రుజువు చేసింది. ఇలాంటి భయాలు చాలావరకు స్పష్టమైన అవగాహన లేకపోవడం వల్లనే వస్తాయి. చరిత్రను, సమాజాన్ని సమగ్రంగా అర్థంచేసుకుంటే, ఈ భయాలు తగ్గే అవకాశం ఉంటుంది. భయం కంటే చైతన్యం ముఖ్యమైనది.

ఇతర సమాజాలు వారి ఆచారాలను బహిరంగంగా ప్రదర్శిస్తుంటే హిందూ సమాజంలోని యువత తమ సంప్రదాయాలను అనుసరించకపోవడంవల్ల సందిగ్ధంలో పడి తప్పుదోవలో వెళ్లటం మనం ఈనాడు ఎక్కువగా చూస్తున్నాము. నేటి యువత ఇతర మతాల, సంస్కృతుల వ్యక్తులతో కలిసిమెలసి జీవించడం సాధారణంగా తోస్తోంది. పాఠశాలలు, కార్యాలయాలు, నగర జీవనంలోని ఒత్తిళ్లకు లోనవుతుంటారు. కొన్ని సందర్భాల్లో మీడియా లేదా వ్యక్తిగత అనుభవాల ప్రభావంతో ఇతర సమాజాల పట్ల అపోహలు కూడా పెరుగుతాయి. ఈ పరిస్థితుల్లో యువత విమర్శనాత్మకంగా ఆలోచించడం, నిజానిజాలను గుర్తించడం చాలా అవసరం.

చరిత్రపై అవగాహన అవసరం.

'మరుగునపడ్డ చరిత్ర' అనే భావన చాలా

డా॥ జె.పి. భారతి కాజా

మందిలో ఉంటుంది. నిజంగా చూస్తే, భారతదేశ చరిత్ర చాలా విస్తృతమైనది. దానిని వివిధ కోణాల్లో అధ్యయనం జరిగింది. అయితే ఒకే కోణంలో మాత్రమే చరిత్రను అర్థం చేసుకుంటే, పూర్తి చిత్రం కనిపించదు. హిందూ యువత చరిత్రను చదవడం, వివిధ వనరుల ద్వారా తెలుసుకోవడం, విశ్లేషణాత్మక దృక్కోణం పెంపొందించుకోవడం అవసరం. చరిత్రను భావోద్వేగంగా కాకుండా, బుద్ధిపరంగా అర్థం చేసుకోవడం ద్వారా సమాజంపై స్పష్టమైన దృక్కోణం ఏర్పడుతుంది.

నేటి సమాజానికి ఉన్న సవాళ్లు ఎన్నో ఎన్నెన్నో. ప్రపంచీకరణ, సాంకేతిక మార్పులు, ఉద్యోగ పోటీ, ఇవి అన్నీ యువత ముందున్న ప్రధాన సవాళ్లు. ఈ నేపథ్యంలో మతం, సంస్కృతి గురించి ఆలోచించడానికి సమయం తక్కువగా ఉంటుంది. అయిన ప్పటికీ, యువత వ్యక్తిగత గుర్తింపులో సంస్కృతి ఒక ముఖ్యమైన భాగంగా గుర్తించి మెలగాలి.

సమాజంలో విభజనలకంటే ఐక్యత అవసరం. మతపరమైన విభేదాలు పెరిగితే, దేశ అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. అందువల్ల యువత సమతుల్య దృక్కోణంతో ముందుకు సాగుతూ తమ సంస్కృతిని అనుసరించాలి. ఈ ఆలోచన అన్ని మతాలవారు అలవరచుకోక పోవడం వల్ల హిందూ యువత సందిగ్ధంలోను, వారి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోంది. ముందుకు వెళ్లే మార్గం అందరం కలసి ఆలోచించాలి.

స్వతంత్ర ఆలోచనతో పాటు, తమ మూలాలను అర్థం చేసుకోవడం హిందూ యువతకు ఉండవలసిన ముఖ్యమైన లక్షణం. ఆధునికతను అంగీకరించడంలో తప్పు లేదు. కానీ అదే సమయంలో సంప్రదాయాలను పూర్తిగా విస్మరించడం కూడా సరైనది కాదు.

హిందూ యువత తక్షణం చేయవలసినది

1. తమ సంస్కృతిపై అవగాహన పెంచుకోవాలి
2. ఇతర మతాల పట్ల గౌరవం చూపాలి
3. తమ మతం, సంప్రదాయం అందరూ గౌరవిస్తున్నారా లేదా తెలుసుకుని మెలగాలి.
4. తమ మతం గురించి అవగాహన పెంచుకోవాలి.
5. అసత్య ప్రచారాలను నమ్మకుండా, నిజాలను తెలుసుకోవాలి.
6. సమాజంలో ఐక్యతను పెంపొందించే విధంగా ఆలోచించాలి, ఇది అందరి బాధ్యతా అని ప్రచారం చేయాలి.
7. రాజకీయ ప్రలోభాలకు లోబడకుండా తమ ఉనికిని చాటాలి.
8. కుల, వర్గాలకు అతీతంగా హిందూ మతాన్ని గౌరవించి, అందరినీ కలుపుకునే మార్గంలో ముందుకు సాగాలి.
9. మన దేవాలయాలను గౌరవించి సంప్రదాయ దుస్తులను ధరించడం అలవాటుచేసుకోవాలి.
10. స్వధర్మం శ్రేయం, పర ధర్మం భయం అని తెలుసుకోవాలి.

ప్రస్తుత కాలంలో హిందూ యువత ఒక కీలక దశలో ఉంది. ఒకవైపు ఆధునిక ప్రపంచం, మరోవైపు సంప్రదాయ విలువలు, ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం వారి ముందున్న ప్రధాన సవాలు. భయాలు, అపోహలు కాకుండా, అవగాహన, సహనం, చైతన్యం ఆధారంగా ముందుకు సాగితే, సమాజం మరింత బలంగా మారుతుంది. ఏ సమాజమైనా తన యువత చేతుల్లోనే భవిష్యత్తును నిర్మించుకుంటుంది. అందువల్ల హిందూ యువత సమగ్ర దృక్కోణంతో, బాధ్యతతో ముందుకు సాగితే, అది కేవలం ఒక మతానికే కాదు, మొత్తం భారతదేశానికి మేలును చేకూరుస్తుంది. తిరిగి భారత దేశం విశ్వగురువుగా వెలుగుతుంది. ★

రెండేళ్లలో బీఏఎస్ తొలి మాడ్యూల్ ప్రయోగం

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)భారతీయ అంతరిక్ష కేంద్రం(బీఏఎస్-01) అయిదు మాడ్యూళ్ల స్థూల నిర్మాణాన్ని ఖరారు చేసింది. తొలి మాడ్యూల్‌ను 2028 నాటికి అభివృద్ధి చేసి ప్రయోగిస్తారు. ఇస్రో సెంటర్లు/యూనిట్లలో బీఏఎస్-01 మాడ్యూల్ సబ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, టెక్నాలజీ అభివృద్ధి ప్రస్తుతం పురోగతిలో ఉంది. భారతీయ అంతరిక్ష కేంద్రానికి అత్యాధునిక లైఫ్-సపోర్ట్ సిస్టమ్‌లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉంటాయి. దిగువ భూ కక్ష్యలో మానవ ఆవాసాలు సుదీర్ఘకాలం పాటు ఉండేలా ఇది వీలు కల్పిస్తుంది. సమాజం పైన, ఆర్థిక వ్యవస్థ పైన సానుకూల ప్రభావం చూపే కొత్త టెక్నాలజీలపై అడ్వాన్స్‌డ్ శాస్త్రీయ పరిశోధన, పరీక్షలకు ఇది మద్దతు ఇస్తుంది. తదుపరి దశలో దిగువ భూ కక్ష్యకు ఆవలకు వెళ్లే మానవ సహిత అంతరిక్ష యాత్రలకు కూడా ఇది అండగా ఉంటుంది. గతంలో నిర్వహించిన అంతరిక్ష యాత్రలను; బీఏఎస్-1 అభివృద్ధి, ప్రయోగాన్ని సవరించిన గగన్‌యాన్ కార్యక్రమంలో చేర్చుతూ కేంద్ర ప్రభుత్వం దాని బడ్జెట్‌ను రూ.20,193 కోట్లకు పెంచింది.

అంతర్జాతీయంగా డిజిటల్ దేశంగా ఎదుగుతున్న భారత్ ఇక ఎంత మాత్రం సాంకేతికతను అనుసరించేదిగా ఉండబోదు. భారతదేశం 4జి విషయంలో ప్రపంచాన్ని అనుసరించిందని, 5జి విషయంలో ప్రపంచంలో కలిసి అడుగేసిందని, 6జి విషయంలో ప్రపంచానికి నాయకత్వం వహించనున్నదని కేంద్ర కమ్యూనికేషన్‌లు, ఈశాన్య ప్రాంత వ్యవహారాల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా పార్లమెంటులో ప్రకటించారు. దేశంలో నగరాలకే పరిమితమైన సాంకేతిక విప్లవం గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తోంది. గ్రామీణ ప్రజల జీవితాలు, విద్య, ఆరోగ్యం, జీవనోపాధి రంగాలను ఉత్తేజితం చేస్తోంది. భారతదేశం 5జి సర్వీసులను ప్రపంచంలోనే అమిత వేగంగా విస్తరించింది. కేవలం 22 నెలల కాలంలో 5జి సేవలను 99.9 శాతం జిల్లాల్లో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం దేశంలో 40 కోట్ల మంది పౌరులు 5జి సర్వీసుల ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. 2030 నాటికి 100 కోట్ల మంది పౌరులకు 5జి కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది.

– 'న్యూ ఇండియా సమాచార్' నుంచి

కథ

ఆధునిక పోకడలు

వి. శారద

పావనికి విసుగ్గా ఉంది. తెల్లారి లేచింది మొదలు చాకిరీ తప్ప, ఇంట్లో ఎవరూ మాట్లాడరు. వాళ్ల సంభాషణ ఫోన్లోనే గడుస్తోంది. మానసికంగా ఎవరు ఒకరికి ఒకరు దగ్గరగా లేరు. ఒక్క ఫోన్లకి తప్ప అనుకుంది పావని. పావనికి ఇద్దరు పిల్లలు. పాప రమ్య ఇంటర్ చదువుతోంది. కొడుకు వంశీ 8వ తరగతి చదువుతున్నాడు. భర్త రఘు సాఫ్ట్వేర్ ఇంజనీర్.

అతను సాఫ్ట్వేర్ కాబట్టి ఎటూ పగలు రాత్రి లాప్టాప్‌తో కుస్తీ పట్టడం తప్పదు.

పావని ఈమధ్య గమనిస్తోంది. పిల్లలకి చదువు మీద ధ్యాస తగ్గింది. ఎప్పుడు చూసినా ఫోన్లలో గేమ్స్ ఆడడం, చాటింగ్‌లు ఎక్కువయ్యాయి. "చదువుకునే పిల్లలకి ఫోన్ అవసరమా? అంటే ఈ రోజుల్లో ఫోన్లు లేకపోతే ఎలా? పిల్లల యోగక్షేమాలు తెలియద్దూ" అంటూ ఇద్దరికీ మొబైల్స్ కొన్నాడు రఘు.

"పిచ్చాడి చేతిలో రాయిలాగ" ఏ వస్తువుని ఎంతవరకు ఉపయోగించుకోవాలో పిల్లలకి తెలియకుండా పోయింది.

ఒకరోజు పావని బజార్‌కి వెళ్తే అక్కడ. "పావనీ! నువ్వేనా! ఎవరో అనుకున్నాను''. అంటూ పలకరించింది చిన్ననాటి స్నేహితురాలు ఉమ.

"ఓ! ఉమా! నువ్వా! ఎన్ని సంవత్సరాలు అయింది నిన్ను చూసి. ఎలా ఉన్నావ్? ఎప్పుడొచ్చావ్ సిటీకి" అంటూ ఆతృతగా అడిగింది పావని.

"అన్ని ప్రశ్నలు ఒక్కసారేనా! నువ్వు ఏం మారలేదు. నీ చిన్నతనంలో గలగలా మాట్లాడే దానివి. అప్పుడు నిన్ను అనేవాళ్లం."మీ ఆయనకి అన్నం పెట్టకుండా కబుర్లతో కడుపు నింపేస్తావని గుర్తుందా"అంది ఉమ.

"ఇప్పుడు మాట్లాడడానికి మాటలే కరువయ్యాయి వినేవాళ్లు లేక" అనుకుంది మనసులో పావని బాధగా.

"ఏమిటే ఆలోచిస్తున్నావ్ ? కొంపముంచి నేను అన్నదే చేస్తున్నావా?"అంది ఆట పట్టిస్తూ.

"అబ్బే! అదేం లేదే! ఈ ఎలక్ట్రానిక్ యుగంలో మాటలేం ఉంటాయి? అన్ని మీటలే కాని" అంది నిర్లిప్తంగా.

"సరే! ముందు మా ఇంటికి రా! అక్కడ తీరిగ్గా మాట్లాడుకుందాం. మా ఇల్లు ఇక్కడికి దగ్గరే". అంటూ ఆటోను పిలిచి అడ్రస్ చెప్పింది ఉమ.

ఉమ. పావని చిన్నప్పటి నుంచి కలిసి చదువు కున్నారు. డిగ్రీ అయిన తర్వాత ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. ఉమభర్త సంజీవ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఉమకి ఇద్దరు పిల్లలు.పాప ఎనిమిదవ క్లాసు. బాబు ఆరో క్లాసు చదువుతున్నారు.

ఉమ, పావని ఎప్పుడో, ఏదో ఫంక్షన్‌లో కలుసుకున్నారు. మళ్లీ ఇప్పుడే కలుసుకోవడం.

ఉమ గలగల మాట్లాడుతుంటే పావని మౌనంగా వింటోంది. అది గమనిం చిన ఉమ "పావని! ఏవిటే ఆ పరధ్యానం? ఇదివరకు మమ్మల్ని మాట్లాడనిచ్చే దానివా? ఏమైంది? ఎందుకు ఇలా అయిపోయావు? ఏవైనా సమస్యలు ఉన్నాయా?" అంది ఆత్రుతగా.

''అబ్బే!అదేం లేదే! నువ్వు చెబుతుంటే వింటున్నాను"అంది నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

ఇద్దరు ఉమ ఇంటికి వచ్చేటప్పటికి అప్పటికే ఉమ భర్త సంజీవ్ వచ్చి, పావనిని పలకరించి, ఉమ చేతిలోంచి సరుకుల సంచి తీసుకుని లోపల పెట్టాడు. ఇద్దరికి గ్లాసులతో మంచినీళ్లు తీసుకువచ్చాడు.

ఉమ టీ పెట్టడానికి లేవపోతే "వద్దు మీ ఇద్దరు కబుర్లు చెప్పుకోండి. చాలా సంవత్సరాలయింది కదా కలుసుకుని, నేను టీ పెడతాను" అంటూ ప్లేట్లలో యాపిల్ ముక్కలు కోసి తీసుకువచ్చి, టీ పెట్టడానికి లోపలికి వెళ్లాడు. ఇంతలో స్కూలు నుంచి పిల్లలు ఇద్దరు వచ్చి, కాళ్లు కడుక్కుని, అప్పుడు పావని దగ్గరికి వచ్చి, "నమస్తే ఆంటీ!" అన్నారు.

వాళ్ల సంస్కారానికి ఆశ్చర్యపోయింది. ఉమ వంటింట్లోకి వెళ్లింది.

పిల్లలిద్దరూ తల్లి వెనకాలే వెళ్లి, ఆ రోజు స్కూల్లో జరిగిన విషయాలు అన్నీ గబగబా చెప్తున్నారు.

"పిల్లలు ఆగండి! మమ్మీని ఆంటీ తో మాట్లాడ నివ్వండి" అంటూ సంజయ్ వారించాడు.

"పర్వాలేదండి, వాళ్ల మాటలు వింటున్నాను, బాగున్నాయి" అంది మనస్ఫూర్తిగా పావని.

పావని ఆలోచిస్తోంది. తను ఇంటి పరిస్థితులు, ఇక్కడి పరిస్థితులకి భిన్నంగా ఉన్నాయి. ఆ కుటుంబాన్ని చూసేటప్పటికీ సంతోషంతో కడుపు నిండిపోయింది. తను కోరుకున్నది ఇది. తన కుటుంబంలో కూడా మార్పు రావాలి. తనకి డబ్బుకి లోటు లేదు. కానీ మనశ్శాంతికి కయివు వచ్చింది... అనుకుంటూ ఉమకి బైచెప్పి ఇంటికి వచ్చింది.

రాత్రి రఘు ఇంటికి వచ్చిన తర్వాత భర్తతో చెప్పింది ఉమ కుటుంబం గురించి. రఘు విసుగ్గా చూసాడు.

"ఎవరి కుటుంబం వారిది. వాళ్లతో మనకి పోలిక ఏమిటి?" అంటూ లైట్ ఆపి పడుకున్నాడు.

భోజనాలు అయిన తర్వాత పావని వంటిల్లు సర్దుతుంటే రఘు పిలిచాడు.

"ఎందుకు పిలిచారు?".

"ఎందుకంటే మన రమ్య ప్రవర్తన ఏమి బావులేదు. మధ్యాహ్నం భోజనం సంగతి చూశాను. నువ్వు ఒక్కదానివి ఎంతకని కష్టపడతావు? ఇంటర్ చదివే పిల్ల. ఆ మాత్రం తల్లికి సహాయం చేయకపోతే ఎలా? పిల్లాడిని చూస్తే వాడు అలాగే తయారయ్యాడు.

మొన్నటికి మొన్న నువ్వు మార్కెట్‌కి వెళ్లినప్పుడు మా ఫ్రెండ్ వస్తే, వాడిని పట్టించుకోకుండా, ఫోన్లో గేమ్స్ ఆడుతూ కూర్చున్నాడు. నేను చెప్తేనే కానీ, వాడికి మంచి నీళ్లు కూడా ఇవ్వలేదు. నాకు తల కొట్టేసినంత పని అయింది. పిల్లలు ఇద్దరు ఇలా తయారవుతే ముందు ముందు ఎలాగా? నాకు చాలా ఆందోళనగా ఉంది"అన్నాడు బాధగా.

"ఇప్పుడు మీకు తెలిసిందా? దీనికి అంతటికీ కారణం మీరే. వాళ్లకి చిన్నప్పటినుంచి మొబైల్స్ వద్దంటే ఇచ్చారు. సేఫ్టీ, స్టేటస్ అంటూ. ఇప్పుడు అనుకుని ఏం లాభం? మా ఫ్రెండ్ పిల్లల గురించి

కాలం గడుస్తోంది. పిల్లల తీరులో మార్పు లేదు. వాళ్లు చిన్నప్పటి నుంచి నేర్చుకున్న కళలని పక్కనపెట్టి ఫోన్లకి అతుక్కుపోతున్నారు. పావని అది భరించలేకపోతోంది. తను ఒక్కత్తి ఎంత చెప్పినా పిల్లలు వినేటట్లు లేరు.

ఒకరోజు రఘు ఆఫీసు నుంచి వస్తుంటే వెనకనుంచి ఆటో గుద్ది, అంత ఎత్తున ఎగిరి కింద పడ్డాడు. దాంతో తుంటి దగ్గర ఎముక విరిగింది.

తుంటిదగ్గర రాడ్ వేసి ఆపరేషన్ చేశారు. పది రోజులు హాస్పటల్లో ఉన్న తర్వాత ఇంటికి వచ్చాడు. ఆ పది రోజులు పావని తల్లడిల్లిపోయింది. జాగ్రత్తగా భర్తని ఇంటికి తీసుకువచ్చింది. వచ్చిపోయే చుట్టాలతో పావనికి పని ఎక్కువైంది. రఘుకి ఒళ్లు తుడవడం, కాలకృత్యాలు తీర్పించడం అన్నీ తనే చేస్తోంది. ఇంటి పని, రఘు పనితో అసలు విశ్రాంతి లేకుండా పోయింది.

ఒకరోజు పావని "రమ్యా! రైస్ కుక్కర్‌లో బియ్యం పెట్టు" అంది. చెవుల్లో ఇయర్ ఫోన్స్ పెట్టుకున్న రమ్య ఆ మాటలు వినిపించుకోలేదు.

మధ్యాహ్నం రఘుకి అన్నం పెడదామని కుక్కర్ తీసిన పావని ఉలిక్కిపడింది. "రమ్య! కుక్కర్ పెట్టమన్నాను కదా! ఎందుకు పెట్టలేదు? మధ్యాహ్నం అయిపోయింది. ఇప్పుడు డాడీకి భోజనం ఎలాగ? ఏం చేస్తున్నావ్? నా మాట నీకు వినిపించలేదా?" అంది ఖాళీ కుక్కర్ చూసి.

"ఏంటి అమ్మా! నేను వినలేదు. నువ్వు ఏం చేయమన్నావ్? అయినా నాకు చెప్పే బదులు నువ్వే చేసుకోవచ్చు కదా!" అంది గదిలోంచి బయటకు రాకుండానే. పావని వెంటనే కుక్కర్లో బియ్యం పెట్టి, రఘు కి ఆకలి వేస్తుంటే బ్రెడ్ కాల్చి పెట్టింది.

చెబితే, ఆరోజు విసుక్కున్నారు. ఇన్ని రోజుల నుంచి నేను ఎంత బాధ పడుతున్నానో మీకు తెలుసా? ఏదైనా అంటే సమాజం ముందుకు వెళుతుంటే మనం కూడా ముందుకు వెళ్లాలి అంటారు. మనం ముందుకు వెళుతున్నాం కానీ, నైతికంగా దిగజారి పోతున్నా దిగజారిపోతున్నాం. కుటుంబ గౌరవం లేదు. పిల్లలు ఎప్పుడు చూసినా ఫోన్ల మీదే ఉంటున్నారు. మార్కులు కూడా తక్కువ వస్తున్నాయి. మీ అండ చూసుకునే వాళ్లు అలా తయారయ్యారు. ఇప్పుడు మీరు ఏం చేస్తారో చెయ్యండి. ఇప్పుడు మీకు బాధ వచ్చింది కాబట్టి ఇలా అంటున్నారు. ఏం చేస్తారో మీరే చేయండి"అంటూ ఆక్రోశంగా అంది పావని.

పావని అన్న దాంట్లో నూటికి నూరుపాళ్లు నిజమే ఉంది. తను ఆరోజు చెబితే నేనే కొట్టి పడేసాను. పెద్ద ఫోన్ కొంటే ఒక స్టేటస్ అనుకున్నా ను కానీ, మనుషుల మధ్య బాంధవ్యాలు, ప్రేమానురాగాలు తగ్గి మానసికంగా దూరం అయిపోతున్నాం. "రాజుగారి కాలు విరగడం ఒకందుకు మంచిదే" అని నాకు కాలు విరగబట్టే ఇంట్లో పరిస్థితి ఏమిటో తెలునుకోగలిగాను. లేకపోతే పిల్లలు ఎలా తయారయ్యే వారో?" అనుకుని రఘు తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

రాత్రి పిల్లలు ఇద్దరు నీ పిలిచి "రమ్యా! నీ సంగీతం ఎంత వరకు వచ్చింది?"

"మానేసాను డాడీ! నాకు టైం సరిపోవట్లేదు"...

రమ్య చిన్న చిన్న కచేరీలు చేస్తోంది. రమ్యని అందరూ పొగడుతుంటే ఎంతో సంతోషంగా ఉంది. రమ్య అనుకుంది "ఫోన్ వద్దన్నప్పుడు కోపం వచ్చింది కానీ, అది ఉంటే నా కెరియర్ నాశనం అయిపోయేది. ఇప్పుడు నలుగురు నన్ను మెచ్చు కుంటుంటే ఎంతో బాగుంది. కాలేజీలో కూడా నన్ను ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు"అనుకుంది సంతోషంగా.

"పొద్దస్తమానం ఫోన్ నొక్కుతుంటే టైం ఎక్కడ సరిపోతుంది? అందుకే మీ ఇద్దరికీ చిన్న ఫోన్లు ఇస్తాను. అవి వాడుకోండి.

వంశీ! నువ్వు కూడా నీ "చెస్" ఆట కంటిన్యూ చెయ్. స్కూల్ తరఫున టోర్నమెంట్స్‌కి వెళ్లే వాడివి. అటువంటిది ఫోన్ రావడంతో మీ కెరియర్ అంతా పాడైపోయింది. ఈరోజు నుంచి అందరం కలిసి భోజనాలుచేద్దాం.

ఒక్కొక్కళ్లు ఒక్కొక్కటైం కాదు. ఏ రోజు జరిగిన విషయాలు ఆ రోజు చర్చించుకుందాం. పిల్లలు! మీ స్కూల్లో జరిగిన విశేషాలు మీరు చెప్పండి. ఇక ఆదివారాలు, రమ్య! అమ్మ దగ్గర చిన్న చిన్న పనులు నేర్చుకో! అది నీకు ముందు ముందు ఉపయోగ పడుతుంది. ఇంటికి ఎవరైనా వస్తే మంచినీళ్లు ఇవ్వడం నేర్చుకోండి. ఇవన్నీ రేపటి నుంచి మొదలుపెడదాం.మీకు చిన్న ఫోన్లు కొనిస్తాను. తీసుకు వెళ్లండి" ఇంకో మాటకి తావు లేకుండా కోపంగా అన్నాడు రఘు.

పిల్లలు ముందు గొణుక్కున్న, చేసేదేమీ లేక తర్వాత వాళ్ల కెరియర్ మీద దృష్టి పెట్టి గొప్పగా రాణించారు. వంశీ రాష్ట్ర చదరంగం 14 సంవత్సరాల విభాగంలో ఫస్ట్ వచ్చాడు

రమ్య చిన్న చిన్న కచేరీలు చేస్తోంది. రమ్యని అందరూ పొగడుతుంటే ఎంతో సంతోషంగా ఉంది. రమ్య అనుకుంది "ఫోన్ వద్దన్నప్పుడు కోపం వచ్చింది కానీ, అది ఉంటే నా కెరియర్ నాశనం అయిపోయేది. ఇప్పుడు నలుగురు నన్ను మెచ్చు కుంటుంటే ఎంతో బాగుంది. కాలేజీలో కూడా నన్ను ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు"అనుకుంది సంతోషంగా.

పావని కోరుకున్నది ఇదే. కుటుంబ సంబంధం ఎంత బలంగా ఉంటే దాని ప్రభావం అంతా సమాజం మీద చూపిస్తుంది. ఒక ఆరోగ్య కరమైన సమాజానికి ఒక మంచి కుటుంబం పునాది అవుతుంది. ★

జాగృతి యాప్ వినియోగంపై విన్నపం

జాగృతి

ఏడున్నర దశాబ్దాలకు పైబడిన సుదీర్ఘ ప్రస్థానంలో సాంస్కృతిక ఔన్నత్యం, రాజకీయాలు, సామాజిక అంశాలు, వర్తమాన సమస్యలు, కళలు, సాహిత్యం, విజ్ఞానశాస్త్రం, పర్యావరణం వంటి పలు అంశాలను చర్చించే విలువైన ఎన్నో వ్యాసాలను జాగృతి అందిస్తూ వస్తోంది. ఈ సంవత్సరం సంఘ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నాము.

ఈ సందర్భంగా పాఠకులకు మరింత చేరువయ్యేందుకు జాగృతి యాప్‌ని సిద్ధం చేశాం.

యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవడానికి ప్లేస్టోర్‌లో **Jagriti Weekly** అని సర్చ్ చేయండి లేదా పక్కనున్న QR Code స్కాన్ చేయగలరు.

APP Login -ఎడమవైపు Menu మీద క్లిక్ చేసి, Login ఎంపికపై క్లిక్‌చేస్తే Login Screen కనిపిస్తుంది.

1. తెరపై కనిపించే యూజర్ నెమ్, పాస్ వర్డ్‌తో లాగిన్ కావచ్చు.
2. Login Screen కింద **Click here to** login with Phone Number పైన క్లిక్ చేసి ఫోన్ నెం. నమోదు చేస్తే, మీ మొబైల్‌కి OTP వస్తుంది. OTPతో లాగిన్ అవ్వండి.
3. మొదటిసారి Login కాగానే, Password మార్పు చేసుకోమని సందేశంతో Screen వస్తుంది. మార్చుకొని, మరలా Login అవ్వాలి.
4. Dashboard: Profile information – User Id, Name, Profile status, Start, End Date, and Receipt Amount వివరాలు కనిపిస్తాయి.
5. Profile Management : View Profile–మీ వ్యక్తిగత చిరునామా, అమౌంట్ వివరాలు చెక్ చేసుకోండి. చిరునామా మార్పు కోసం పైన ఉన్న **JAGRITI** లోగోకి పక్కనే ఉన్న Edit Profileని క్లిక్ చేయండి. పోస్టల్ అడ్రసు ఇచ్చి, పిన్‌కోడ్ టైప్ చేస్తే రాష్ట్రం, జిల్లా వివరాలు వాటంతట అవే వస్తాయి. మండలం, సబ్ పోస్ట్ ఆఫీసు, సంఘ విభాగ్, జిల్లా, ఖండ/నగరాలను మీరు ఎంపిక చేస్తే సరిపోతుంది.
6. Support ticket: మీకు ఏదైనా సమస్య ఉంటే ఇందులో నమోదు చేయండి. 24 గంటలో మీకు కాల్ చేస్తాము.
7. మిగితా వివరాలు Subscriber Login Videoలో చూడండి.

– మేనేజర్

క్రీడాజగత్తులో ఆ నలుగురు...!

రాజకీయాలలోనే కాదు.. క్రీడారంగంలో సైతం ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి వయసు ఏమాత్రం అవరోధం కాదని పలు రకాల క్రీడలకు చెందిన దిగ్గజ క్రీడాకారులు తమ అసాధారణ ప్రతిభ, అసమాన్యమైన రికార్డులతో చెప్పకనే చెబుతున్నారు. తమ రికార్డులను తామే తిరగరాస్తూ నిత్యనూతనంగా సాగిపోతున్నారు.

క్రీడలకు వయసుతో ఏ మాత్రం సంబంధం లేదని, వయసు మీద పడుతున్నా ప్రపంచ రికార్డులు సాధించవచ్చని బ్యాడ్మింటన్, టెన్నిస్, హాకీ, క్రికెట్ దిగ్గజ క్రీడాకారులు చాటి చెబుతున్నారు. వయసు పెరిగే కొద్దీ క్రీడాకారులలో వాడివేడీ తగ్గిపోతుందన్నది కేవలం ఓ అపోహమాత్రమేనని అంతర్జాతీయ క్రీడాదిగ్గజాలు భారత బ్యాడ్మింటన్ క్వీన్ పీవీ సింధు, సెర్బియన్ టెన్నిస్ శిఖరం నొవాక్ జోకోవిచ్, భారత హాకీ మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ తాజాగా నిరూపించారు.

500 విజయాల తెలుగుతేజం...

పీవీ సింధు.. భారత, ప్రపంచ బ్యాడ్మింటన్ అభిమానులకు ఏమాత్రం పరిచయంలేని పేరు. చిరుప్రాయం నుంచే ఆ క్రీడకు అంకితమైన సింధు వివాహానంతరమూ క్రీడాజీవితాన్ని, విజయాల పరంపరను కొనసాగిస్తూనే ఉంది. ఇప్పటికే ప్రపంచ, ఒలింపిక్స్ పతకాలతో భారత మహిళా బ్యాడ్మింటన్ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఆమె మూడు పదుల వయసులోనూ దీక్ష, అంకితభావంతో పోరాటం కొనసాగిస్తోంది..

ఇటీవలే ముగిసిన ఇండోనేసియన్ మాస్టర్స్ సూపర్-500 ప్రీ-క్వార్టర్ ఫైనల్లో డెన్మార్క్ యువక్రీడాకారిణి లైన్ జేయర్స్ ఫీల్డ్‌ను వరుసగేమ్‌ల్లో చిత్తు చేయడం ద్వారా 500వ సింగిల్స్ విజయంతో అరుదైన ఘనతను సొంతం చేసుకొంది. భారత బ్యాడ్మింటన్ చరిత్రలోనే 500 సింగిల్స్, మొత్తం మీద 516 (డబుల్స్, మిక్సిడ్ డబుల్స్‌తో కలిపి) విజయాలు సాధించిన తొలి ప్లేయర్‌గా నిలిచింది. ప్రస్తుతం ప్రపంచ 13వ ర్యాంక్ ప్లేయర్‌గా ఉన్న సింధు 2027 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే లక్ష్యంతో తన ప్రస్థానం కొనసాగిస్తోంది.

జోకోవిచ్ 'గ్రాండ్' రికార్డు..!

అంతర్జాతీయ టెన్నిస్‌లో మేరునగధీరుడిగా పేరుపొందిన సెర్బియన్ గ్రేట్ నొవాక్ జోకోవిచ్ 400 గ్రాండ్ స్లామ్ సింగిల్స్ విజయాలతో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. 38 ఏళ్ల లేటు వయసులో ఈ ఘనత సాధించిన ఏకైక, ఒకే ఒక్క ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. తన సమకాలీన దిగ్గజాలు రోజర్ ఫెదరర్, రాఫెల్ నడాల్‌ల నుంచి నేటితరం ఆటగాళ్లు కార్లోస్ అల్ కరాజ్, యానిక్ సిన్నర్‌లకు గట్టిప్రత్యర్థిగా నిలిచిన జోకోవిచ్ లేటు వయసులోనూ తన దూకుడు కొనసాగిస్తున్నాడు. 2026 తొలిగ్రాండ్ స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ మూడోరౌండ్లో బోటిచ్ వాన్ డీని వరుస సెట్లలో ఓడించడం ద్వారా అరుదైన 400వ గ్రాండ్ స్లామ్ సింగిల్స్ విజయం నమోదు చేయగలిగాడు. మరే ఆటగాడు సాధించని (24 గ్రాండ్ స్లామ్ టైటిల్) విజయాల రికార్డు నెలకొల్పాడు. కేవలం ఆస్ట్రేలియన్ ఓపెన్ లోనే పదిసార్లు సింగిల్స్ టైటిల్ నెగ్గిన జోకోవిచ్ 102 విజయాలు, 10 పరాజయాల రికార్డుతో నిలిచాడు. తన సుదీర్ఘ టెన్నిస్ జీవితంలో 81వసారి గ్రాండ్ స్లామ్ టోర్నీలో పాల్గొంటున్న జోకోవిచ్ 21వసారి

ఆస్ట్రేలియన్ బరిలో నిలవటం ద్వారా రన్నరప్‌గా నిలువగలిగాడు.

గ్రాండ్ స్లామ్ నాలుగు (అమెరికన్, వింబుల్డన్, ఫ్రెంచ్, ఆస్ట్రేలియన్) టోర్నీలలో మూడింట 100 సింగిల్స్ విజయాలు చొప్పున సాధించిన అరుదైన రికార్డు సైతం జోకోవిచ్ పేరుతోనే ఉంది. వింబుల్డన్‌లో 102, ఫ్రెంచ్ ఓపెన్లో 101 విజయాలు సాధించిన రికార్డు సైతం జోకోవిచ్ నెలకొల్పాడు.

411 మ్యాచ్‌ల మన్ ప్రీత్ సింగ్....

భారత హాకీ మాజీ కెప్టెన్, దిగ్గజ మిడ్ ఫీల్డర్ మన్ ప్రీత్ సింగ్ 33 ఏళ్ల వయసులో అంతర్జాతీయ మ్యాచ్ రికార్డు కోసం ఎదురుచూస్తున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కు కాంస్య పతకం అందించడంలో ప్రధానపాత్ర వహించిన అతను 15 ఏళ్లుగా జాతీయజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ 411 మ్యాచ్‌లు ఆడాడు. మరో రెండు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడగలిగితే 413 మ్యాచ్‌లతో సరికొత్త భారత రికార్డు నెలకొల్పగలుగుతాడు.

2026 ఆసియాకప్, ప్రపంచకప్ పోటీలతో పాటు 2027 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో సైతం పాల్గొని వీడ్కోలు పలకాలని భావిస్తున్నాడు. అయితే ఎంపిక సంఘం మన్ ప్రీత్ ను ఎంతవరకూ కరుణిస్తుందన్నది అనుమానమే.

క్రికెట్ ప్రపంచంలో ఒకే ఒక్కడు...

క్రీడాజీవితాన్ని ఓ తపస్సుగా భావించి, వివాదాలకు దూరంగా ఉంటూ ఆటపైనే మనసులగ్నం చేసి 22 సంవత్సరాలపాటు అంతర్జాతీయ క్రికెట్లో కొనసాగిన మేరునగధీరుడు మాస్టర్ సచిన్ టెండుల్కర్. 16 ఏళ్ల చిరుప్రాయంలోనే అంతర్జాతీయ క్రికెట్లో అడుగుపెట్టి భారత క్రికెట్ మూలవిరాట్టుగా రెండు దశాబ్దాలపాటు నిలవటం ద్వారా సచిన్ చరిత్ర సృష్టించాడు.క్రికెట్‌లోని మొత్తం మూడు ఫార్మాట్ల (టెస్టు, వన్డే, టీ-20)లోనూ 664 మ్యాచ్‌లు ఆడిన తొలి, ఏకైక ఆటగాడు సచిన్ మాత్రమే. 1989 నుంచి 2013 వరకూ భారత క్రికెట్‌కు చిరునామాగా నిలిచిన సచిన్ 200 టెస్టుమ్యాచ్‌లు ఆడటం ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. సాంప్రదాయటెస్టు క్రికెట్లో 51 శతకాలు, 49 అర్ధశతకాలు, 50 ఓవర్ల వన్డే క్రికెట్లో 463 మ్యాచ్‌ల్లో 200 వికెట్లు, 30వేల పరుగులు సాధించాడు. మొత్తం 664 మ్యాచ్‌ల్లో 100 శతకాలు, 264 అర్ధశతకాలతో 34వేల 357 పరుగులతో 48.52 సగటు నమోదు చేశాడు. 67.58 స్ట్రయిక్ రేట్‌తో తనకు తానే సాటిగా నిలిచాడు. భారీఅంచనాలు, విపరీతమైన ఒత్తిడి, గట్టిప్రత్యర్థులను అధిగమించి 22 సంవత్సరాలపాటు అంతర్జాతీయ క్రికెట్లో కొనసాగటం కేవలం సచిన్‌కు మాత్రమే చెల్లింది. సచిన్ స్ఫూర్తి, ప్రేరణతో కేవలం క్రికెట్లోనే కాదు.. మిగిలిన క్రీడల్లోనూ అద్భుతంగా రాణించి తమకంటూ ప్రత్యేకస్థానం సంపాదించుకొన్న క్రీడాకారులందరికీ జేజేలు పలకాల్సిందే మరి.!

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

దేశం కోసం యువత

విజయవాడ : యువత దేశ ప్రయోజనాల కోసం కొంత సమయాన్ని తప్పనిసరిగా కేటాయించాలని, వివక్ష లేని సమాజ నిర్మాణంకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎమ్ వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. చెడు ఆలోచనలకు పరాభవంగా మంచి ఆలోచనలకు ప్రాభవంగా ఈ నూతన సంవత్సరం నిలవాలని ఆకాంక్షించారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మార్చి 19న విజయవాడలో నిర్వహించిన ఉగాది ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఆర్ ఎస్ ఎస్ అంటే రెడీ ఫర్ సెల్ఫ్ లెస్ సర్వీస్ అని స్పష్టం చేశారు. దివిసీమ ఉప్పెన సమయంలో మృతదేహాలను బయటకు తీసి అంతిమ సంస్కారాలు చేయడానికి ఎవరూ ముందుకు రాని సమయంలో సంఘ స్వయం సేవకులు సేవలందించారని గుర్తు చేశారు. తాను కూడా ఆనాటి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న సంగతిని గుర్తు చేసుకున్నారు. సంఘ వ్యవస్థాపకులు డాక్టర్జీ దార్శనికత కారణంగానే నేడు భారత్ పటిష్ఠంగా ఉందన్నారు.

డాక్టర్జీ ప్రారంభించిన ఆర్ఎస్ఎస్, నేడు వందేళ్ల మహా వృక్షంగా ఎదిగిందని, "భారతదేశం అంతా మన ఇల్లు-ఇక్కడ ఉన్న వారందరూ మన సోదరులు" అనే నినాదంతో ఆయన నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించారని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాలు కేవలం స్వప్రయోజనాలు, పెత్తందారీ ధోరణితో వ్యవహరిస్తున్నాయని, దీనివల్లనే సమాజంలో అశాంతి, అలజడులు రేగుతున్నాయని అన్నారు. గతంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలకు, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధానికి విస్తరణ కాంక్షే కారణమని పేర్కొన్నారు. కానీ, భారతదేశం ఎప్పుడూ ఏ దేశం మీద దండయాత్ర చేయలేదని ఆయన గుర్తు చేశారు. భారత దేశ మేధస్సును ముందుకు తీసుకెళ్తోంది మన యువకులే. ప్రపంచంలోని ప్రముఖ బహుళ జాతి సంస్థలకు మన వారు సీఈఓలుగా ఉన్నారంటే ఈ నేలలో విశిష్టత అలాంటిది." అని చెప్పారు.

మాతృభాష ప్రాముఖ్యతను వివరిస్తూ, "మాతృభాష కంటి చూపు లాంటిది, ఇతర భాషలు కళ్లద్దాలవంటివి" అని ఆయన చమత్కరించారు. ఇంగ్లీష్‌ను కేవలం అవసరం కోసం నేర్చుకోవాలని, మన మూలాలను మర్చిపోకూడదని సూచించారు. భారతీయకుటుంబవ్యవస్థను కాపాడుకోవాలని, పిల్లలు తమ తల్లిదండ్రులతో, తాతయ్యలతో సమయం గడపడం ద్వారా సంస్కృతిని నేర్చుకోవాలని కోరారు. ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రధానవక్త భరత్‌కుమార్ ప్రసంగిస్తూ మన పండుగ ప్రకృతితో ముడిపడి ఉంటుంది. పాశ్చాత్య దేశాలలో పండుగలు ప్రకృతితో ముడిపడి ఉండవు. ఉగాది సంఘ నిర్మాత డాక్టర్జీ జయంతి. 2025 విజయదశమి, సంఘశతాబ్ది సందర్భంగా , అక్టోబర్ 1న ఢిల్లీలో ప్రధానమంత్రి ఒక నాణాన్ని, పోస్టల్ స్టాంప్‌ని విడుదల చేసి మాట్లాడుతూ ఈ దేశాన్ని దైవంగా భావించి దేహాన్ని, దీపంగా మార్చుకొని, భారతమాతకు సేవ చేసే స్వయంసేవకులను తయారు చేసేటువంటి కేంద్రమైనటువంటి శాఖ తంత్రాన్ని అందించిన వారు డాక్టర్జీ అని అన్నారు.

ఒక శాఖలా ప్రారంభమైనటువంటి సంఘం, వారు స్వర్గస్తులైన సమయానికి (1940 నాటికి) 700 శాఖలు అయ్యాయి, లక్షల మంది స్వయంసేవకులు తయారయ్యారు. డాక్టర్జీ జీవించి ఉండగా వారిలా ఆలోచించే వ్యక్తులను తయారు చేశారు. తనలాగా ఆలోచించి పని చేసే వ్యక్తులను తయారు చేసే శాఖ ప్రక్రియను అందించిన వ్యక్తి డాక్టర్జీ. వారు స్వర్గస్తులైన 85 సం.ల తరువాత, సంఘ శతాబ్ది వేళ కూడా వారిలా ఆలోచించి, వారి అడుగుజాడల్లో నడుస్తూ తమ జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి భారతమాత సేవలో స్వయం సేవకులు శాఖా తంత్రాన్ని దేశంలో 91 వేల స్థలాల్లో నడుపుతున్నారు. నేను స్వయంసేవకుడిని, హిందువును అనే భావాన్ని గుండెల్లో పెట్టుకొని దేశ హితం కోసం మాత్రమే పనిచేసే స్వయంసేవకులు మాత్రమే సంఘ ఆస్తి. ఇటువంటి స్వయంసేపకులను తయారు చేసే శాఖ మాత్రమే సంఘ ఆస్తి, ఆ విధంగా పనిచేసేటటువంటి స్వయంసేవకులు అనేకమంది తలెత్తుకొని గుండెల్లో సంఘం మాది అని భావించే సంఘ కుటుంబాలే సంఘ ఆస్తి అని భరత్‌కుమార్ అన్నారు.

గణవేష పాల్గొన్న వారు:745, మిగతావారు: 1003,మాతృమూర్తులు: 311 మొత్తంసంఖ్య :2059, పద సంచలనంలో పాల్గొన్న సంఖ్య :560

నెల్లూరు: మార్చి 19న నెల్లూరు పురవీధుల గుండా ఆర్ఎస్ఎస్ స్వయం సేవకుల పదసంచలన్ జరిగింది. ఈ సంచలన్‌లో 556 మంది స్వయంసేవకులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఉగాది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కృష్ణచైతన్య విద్యాసంస్థలు అధినేత పర్వతరెడ్డి రాణాప్రమోద్‌రెడ్డి, ముఖ్యవక్తగా ప్రాంత ధర్మజాగరణ ప్రముఖ్ కొండారెడ్డి పాల్గొన్నారు. ఉత్సవ సంఖ్య 886.

భూమి-సుపోషణ అభియాన్

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి గోఆధారిత ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించడానికి మార్చి 1 నుండి ఏప్రిల్ 10 వరకు ఆంధ్రప్రదేశ్‌లో గ్రామవికాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు యోజన చేశారు. ప్రస్తుతం శ్రీసత్యసాయి, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, కోనసీమజిల్లాలలో భూమి సుపోషణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ అంతటా 500 గ్రామాలలో ఈ కార్యక్రమం చేయాలని గ్రామవికాస్ సంస్థ సంకల్పించింది.

నంద్యాల : మార్చి 22న సంఘమిత్ర ఆవాస వార్షికోత్సవం సందర్భంగా నంద్యాల నగరంలో సంఘమిత్ర సేవాసమితి ఆధ్వర్యంలో జరుగుతున్న అభ్యాసికలలో పాల్గొంటున్న బాల బాలికలకు బాలమేళ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా క్షేత్ర సేవప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షులు చిలుకూరు శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథి ప్రముఖ వ్యాపారవేత్త వంకదార శివప్రసాద్, లైఫ్ హాస్పిటల్ డాక్టర్ లక్ష్మీ సౌజన్య, శ్రీరామకృష్ణ విద్యాసంస్థల డీన్ గడ్డం ప్రగతి, ప్రముఖ వ్యవసాయదారుడు దేవన వెంకటరెడ్డి పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి.

నల్గొండ : ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో మార్చి 19న జరిగిన నల్గొండ నగర ఉగాది ఉత్సవంలో ముఖ్యఅతిథిగా సబ్ ట్రెజరీ ఆఫీసర్ కిరణ్‌కుమార్‌రావు, ముఖ్యవక్తగా వనవాసీ కల్యాణపరిషత్ దక్షిణమధ్య క్షేత్ర సంఘటన మంత్రి తాడేపల్లి శివరామకృష్ణ పాల్గొన్నారు.

మూడు చేపల కథ

కథ

అనగనగా ఒక గ్రామంలోని చెరువులో చాలా చేపలు నివసించేవి. ఒకరోజు ఇద్దరు జాలర్లు ఆ చెరువు పక్కనుంచి వెళ్తూ, అందులో ఎన్నో చేపలు ఉండటాన్ని గమనించారు. "మర్నాడు వచ్చి ఈ చేపలన్నింటినీ పట్టుకుందాం" అని మాట్లాడుకుంటూ వెళ్లిపోయారు.

ఆ జాలర్ల మాటలను విన్న ఒక తెలివైన చేప, భయపడి వెంటనే తన స్నేహితులైన మరో రెండు చేపల దగ్గరకు వెళ్లింది. "మిత్రులారా! మనం వెంటనే ఈ చెరువును వదిలి వేరే చోటికి వెళ్లిపోవాలి. లేకపోతే రేపు ఆ జాలర్లు వస్తే మన ప్రాణాలు దక్కవు" అని హెచ్చరించింది.

ఈ మాటలు విన్న ఆ రెండు చేపలు వేర్వేరుగా స్పందించాయి. రెండవ చేప, "వాళ్లు రేపు వచ్చాక చూద్దాంలే, అప్పటివరకు వేచి చూద్దాం" అని తనలో తాను అనుకుంది. ఇక మూడవ చేప, "ఈ ముసలి చేపకు చాదస్తం ఎక్కువ! ఆ జాలర్లు వస్తే మాత్రం ఏంటి? మన అదృష్టం బాగుంటే వాళ్ల వల నుంచి తప్పించుకోవచ్చు కదా" అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చింది.

మొదటి చేప మాత్రం ఏమాత్రం ఆలస్యం చేయకుండా, రాత్రికి రాత్రే తన బంధుమిత్రులను తీసుకుని సురక్షితమైన వేరే చెరువుకు వెళ్లిపోయింది. మరుసటి రోజు తెల్లవారగానే జాలర్లు రావడం చూసి, రెండవ చేప అప్రమత్తమై, వెంటనే తన కుటుంబాన్ని తీసుకుని వేరే ప్రాంతానికి చేరుకుంది. కానీ, తన అదృష్టాన్ని నమ్ముకుని అక్కడే ఉండిపోయిన మూడవ చేప, జాలర్లు వేసిన వలలో చిక్కుకుని తన ప్రాణాలను కోల్పోయింది. ★

మంచిమాట

వినయం నువ్వు ధరించే
విలువైన వజ్రం

మెదడుకు మేత

పచ్చని పెట్టెలో.. ఎర్రని రత్నాలు.. ఏమిటది?

జవాబు : దానిమ్మ

పద్యం

ఉపమింప మొదట తియ్యన
కపటం బెడనెడను చెఱకుకైవడినే పో
నెపములు వెదకును గడపట
గపటపు దుర్జాతిపొందు గదరా సుమతీ.

భావం : చెరకు గడ మొట్టమొదట తియ్యగా ఉండి, చివరకు పోయిన కొలది మధ్య మధ్య చప్పగా ఉంటుంది. మోసగాడు, దుర్మార్గునితో స్నేహం మొదట ఇంపుగా ఉన్నప్పటికీ చివరకు తప్పులను వెదకడం ప్రారంభమవుతుంది.

శ్లోకం

పరోపదేశే పాండిత్యం
సర్వేషాం సుకరం నృణామ్
ధర్మే స్వయమనుష్ఠానం
కస్యచిత్తు మహాత్మనః!!

భావం : ఇతరులకు ఉపదేశించడం చాలా సులభతరం. అదే తాను ఆచరించవలసి వచ్చినప్పుడు కష్టతరంగా ఉంటుంది. ఎవరో కొందరు మహాత్ములు మాత్రమే తాము చెప్పింది ఆచరించగలుగుతారు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

నిత్యము	దరి
తీరం	తక్కెడ
గృహము	నిచ్చం
తంత్రము	గీము
తర్కారి	తంతు

జవాబులు : నిత్యము-నిచ్చం; తీరం-దరి; గృహము-నీడ; తంత్రము-తంతు; తర్కారి-తక్కెడ

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

ప్రశాంత్ చంద్ర మహలనోబిస్

ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త, అనువర్తిత గణాంక శాస్త్రవేత్త. గణాంక శాస్త్రంలో ఆయన కనుగొన్న "మహలనోబిస్ డిస్టెన్స్" అనే కొలత, డేటా విశ్లేషణలో ప్రపంచవ్యాప్తంగా నేటికీ ప్రామాణికంగా ఉపయోగిస్తారు. 1931లో కోల్‌కతాలో 'ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్'ను స్థాపించి, భారతదేశంలో గణాంక శాస్త్ర అభివృద్ధికి పునాదులు వేశారు. భారతదేశ మొదటి ప్రణాళికా సంఘంలో సభ్యునిగా సేవలు అందించారు. గణాంక రంగంలో ఆయన చేసిన కృషికి గాను, ఆయన పుట్టిన రోజైన జూన్ 29ని భారతదేశంలో ప్రతి ఏటా 'జాతీయ గణాంక దినోత్సవం'గా జరుపుకుంటారు.

జనరల్ నాలెడ్జ్

1. మొక్కలు తమంతట తాము ఆహారాన్ని తయారుచేసుకునే ప్రక్రియను ఏమంటారు?
2. కణజాలాల వృద్ధిని కొలిచే 'క్రెస్కోగ్రాఫ్' పరికరాన్ని కనుగొన్నది ఎవరు?
3. భారతదేశంలో అణుశక్తి పరిశోధనలకు పునాది వేసిన శాస్త్రవేత్త ఎవరు?

సమాధానాలు : 1. కిరణజన్య సంయోగక్రియ; 2. సర్ జగదీశ్ చంద్ర బోస్; 3. హోమీ జహంగీర్ భాభా.

భక్తాగ్రేసరులు

కబీర్‌దాసు



కబీర్‌దాసు పుట్టుక గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ నీమా, నీరూ అనే నిరుపేద చేనేత ముస్లిం దంపతుల ఇంట పెరిగాడు. ఆయన హిందువని,మహ్మదీయుడని చివరి వరకు వాదోపవాదాలు సాగాయి. అంతగా చదువుకోకపోయినా గొప్ప జ్ఞాన సంపన్నుడు. అంతకు మించి రామభక్తుడు. మతవిద్వేషాలు, మూఢాచారాల పట్ల కలత చెందాడు. దీనికి తోడు సంసార జీవితంలో ఒడుదొడుకులకు వేసారిన ఆయన దేశాటన చేసి, వివిధ వ్యక్తుల సాంగత్యంతో జ్ఞానసంపన్నుడయ్యాడు. రామానందుడి శిష్యుడిగా ఆయన నుంచి జ్ఞానోపదేశం పొందాడు. కబీర్ ఉపదేశాలను శిష్యులు 'కబీర్ బీజక్' పేరిట గ్రంథస్థం చేశారు.ఆయన రాయడం నేర్చుకున్న ఏకైక పదం 'రామ' అని చెబుతారు. సుమారు 120 ఏళ్లు (1399-1518) జీవించిన అరుదైన ఆధ్యాత్మిక వేత్త. ఆయన మరణానంతరం భౌతికకాయం కోసం హిందూ ముస్లింలు వాదులాడుకున్నారని, ఆ సమయంలో భౌతికకాయం మాయమై, దానికి బదులుగా అక్కడ పుష్పాలు దర్శనమిచ్చాయని, దీనిని బట్టి ఆయన మహిమాన్వితం వెల్లడైందని చెబుతారు. ★

వారఫలాలు

30 మార్చి-05 ఏప్రిల్ 2026

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

విద్యార్థులు నైపుణ్యతను చాటుకుంటారు. దేవాలయాల సందర్శన. సోదరులు, స్నేహితులతో ఆనందాన్ని పంచుకుంటారు. చిత్ర విచిత్రమైన విషయాలు తెలుస్తాయి. వివాహాది వేడుకులు నిర్వహిస్తారు. వ్యాపారస్తులు లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగస్తులకు కొత్త హోదాలు. రచయితలు, పారిశ్రామిక వేత్తలు కొత్త ఆశలతో ముందడుగు వేస్తారు. 30,31 తేదీల్లో వృథా ఖర్చులు. ఆరోగ్యం సహకరించదు. మానసిక ఆందోళన. సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

పరపతి కలిగిన వారితో పరిచయాలు. అందరిలోనూ ప్రత్యేక గౌరవం. స్థిరాస్తి వివాదాల నుంచి బయటపడతారు. కొత్త ఆలోచనలతో కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారస్తులు కోరుకున్న లాభాలు పొందుతారు. ఉద్యోగులు సమర్థతను చాటుకుంటారు. వ్యవసాయదారులు, క్రీడాకారులకు మరింత అనుకూల కాలం. 31, ఏప్రిల్1 తేదీల్లో ధనవ్యయం. ఇంటాబయటా ఒత్తిడులు. వృత్తులు, వ్యాపారాలలో చిక్కులు. గణపతి ఆరాధన మంచిది.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

కాంట్రాక్టులు తుది క్షణంలో చేజారవచ్చు. తరచూ ప్రయాణాలు ఉంటాయి. విద్యార్థులు మరింత శ్రమపడాల్సిన సమయం. కుటుంబబాధ్యతలు పరీక్షగా మారవచ్చు. వ్యాపారస్తులకు కొంతమేరకు లాభాలు. ఉద్యోగాలలో అనుకోని మార్పులు జరుగవచ్చు. రచయితలు, రాజకీయ వేత్తలకు విదేశీ పర్యటనలు వాయిదా 1,2తేదీల్లో శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభం. విందువినోదాలు.. శ్రీకాలభైర వాష్టకం పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

మీ భావాలను అందరితో పంచుకుంటారు. వివాహయత్నాలు సానుకూలం. ఇంటి నిర్మాణాలు ముమ్మరం చేస్తారు. మీరు తీసుకునే నిర్ణయాలు అందర్నీ ఆకట్టుకుంటాయి. వ్యాపారులకు సమస్థాయిలో లాభాలు. ఉద్యోగస్తులు మార్పులను చూడాల్సి వస్తుంది. రాజకీయవేత్తలు, పరిశోధకులు, క్రీడాకారులు శ్రమకు ఫలితం దక్కించుకుంటారు. 4,5 తేదీల్లో ఆరోగ్యంపై జాగ్రత్తలు. విలువైన డాక్యుమెంట్లు జాగ్రత్త. శివాష్టకం పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ప్రముఖులతో చర్చలు సాగిస్తారు. ఆరోగ్యం కొంత మెరుగుపడుతుంది. నూతన ఉద్యోగావకాశాలు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. వ్యాపారస్తులకు అనుకోని పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగస్తులు మంచి గుర్తింపు. రచయితలు, పారిశ్రామిక వేత్తలు, కళాకారులు విజయాలు సాధిస్తారు. 30,31 తేదీల్లో ఖర్చులు పెరుగుతాయి. మానసిక ఆందోళన.. దత్తాత్రేయస్తోత్రాలు పఠించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

భూములు, వాహనాలు కొనుగోలు యత్నాలు ముమ్మరం. వివాహాది వేడుకలకు హాజరవుతారు. దైవారాధనలో పాల్గొంటారు. వ్యాపారస్తులకు పెట్టుబడుల్లో ఇబ్బందులు తొలగుతాయి. ఉద్యోగులు అదనపు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులు మంచి గుర్తింపు పొందుతారు. 2,3 తేదీల్లో వ్యయ ప్రయాసలు. ఆంజనేయ దండకం పఠించండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

మీ సేవలకు తగిన గుర్తింపు. ఆదాయం ఆశాజనకం. వేడుకల్లో పాల్గొంటారు. ఉద్యోగ యత్నాలు కలసివస్తాయి. కొన్ని ఆశయాలు సాధించే దిశగా అడుగులు వేస్తారు. వ్యాపారస్తులు అనుకున్న విధంగా లాభాలు గడిస్తారు. ఉద్యోగస్తులకు పైస్థాయి వారి ప్రశంసలు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 1,2 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. ఆదిత్య హృదయం పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడిస్తారు. నిర్ణయాలు సైతం అందర్నీ ఆకర్షిస్తాయి. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారస్తులు కోరుకున్న లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగస్తులకు ఉన్నత పోస్టులు రావచ్చు. 30, ఏప్రిల్1 తేదీల్లో స్వల్ప అనారోగ్యం. కుటుంబంలో ఒత్తిడులు. అనుకోని ప్రయాణాలు సంభవం. దుర్గాస్తోత్రాలు పఠించండి.



ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఎంతటి సమస్య ఎదురైనా ధైర్యం వీడరు. వ్యవహారాలు కొన్ని వాయిదా వేస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారస్తులు అనుకున్న లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగస్తులకు మరింత ప్రోత్సాహం. కళాకారులు, క్రీడా కారులు విదేశీ పర్యటనలు జరుపుతారు. 1,2 తేదీల్లో కొంత మేర చికాకులు. అనారోగ్య సూచనలు. బంధువులతో తగాదాలు. అంగారక స్తోత్రాలు పఠించండి..

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగయత్నాలలో విజయం సాధిస్తారు. ఒక సంఘటన విశేషంగా ఆకట్టుకుంటుంది. ఇంట్లో శుభకార్యాల నిర్వహణపై చర్చిస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారస్తులు మరింత శ్రద్ధ వహిస్తే లాభాలు. ఉద్యోగస్తులకు శ్రమ ఫలిస్తుంది. రాజకీయవేత్తలు, రచయితల సేవలు గుర్తింపులోకి వస్తాయి. 2,3 తేదీల్లో కుటుంబ సమస్యలు. ఆకస్మిక ప్రయాణాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

విద్యార్థులు, నిరుద్యోగుల యత్నాలు మరింత వేగవంతంగా కాగలవు. పరిస్థితులను కొంత అనుకూలంగా మార్చుకుంటారు. ముఖ్య సమావేశాలలో పాల్గొంటారు. వ్యాపారస్తుల యత్నాలు సఫలం. ఉద్యోగస్తులకు పనిభారం నుంచి విముక్తి లభిస్తుంది. పారిశ్రామికవేత్తలు, కళాకారులు ప్రతిభ చాటుకుంటారు. 4,5 తేదీల్లో మానసిక అశాంతి. కుటుంబంలో చిక్కులు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంటి నిర్మాణాలు చేపడతారు. మీ ఆలోచనలు కుటుంబ సభ్యులతో పంచుకుంటారు. వ్యాపారస్తులు మరింతగా లాభాలు అందుకుంటారు. ఉద్యోగులు విధి నిర్వహణలో ఆటుపోట్లు అధిగమిస్తారు. రచయితలు, కళాకారులు, క్రీడాకారులు ఇబ్బందులు తొలగి ఊరట చెందుతారు. 30,31 తేదీల్లో దూర ప్రయాణాలు. అనుకోని ఖర్చులు తప్పకపోవచ్చు. మానసిక అశాంతి. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.

పదరసం-557



ఆధారాలు

అడ్డం

1. ఉద్బోధ, హితవచనం (3)
3. ఎండమావి (4)
5. కర్ణుడి రాజ్యం (2)
7. ప్రాతఃకాలం (3)
8. పన్ను, రుసుం (2)
9. మాగాణి కాదు... (2)
10. దయ, మనసు (2)
11. యవనిక, పరదా (2)
13. నీరు తోడే సాధనం (2)
14. స్నేహితురాలు, సఖి (2)
15. గౌరవం (4)
17. దీంతో తలగోక్కోవడం ఎందుకు? (3)
18. ఇది నిలకడ మీద తెలుస్తుందట (2)
20. ఆజ్ఞ, ఆదేశం (3)
23. కపటం (3)
26. ఉపకారం (2)
27. గొప్పతనం (3)
28. పద్య రకాల్లో ఒకటి (2)
29. సంతోషం..తారుమారు (2)
30. ఇది ఎవరి కోసమూ ఆగదు (2)

నిలువు

1. ధరణి, భూమి (2)
2. అర్జునుడి శంఖం (4)
3. మృగంతో నక్షత్రం (4)
4. దీనికి మించిన సంపద లేదంటారు (2)
6. బంధుత్వం (4)
7. తగిన, హితమైనది (3)
11. జ్ఞానం (3)
12. కబళం (2)
13. రాత్రి, చీకటి (3)
14. కారాగారం (4)
15. మనుచరిత్ర కర్త (3)
16. నక్షత్రం (2)
19. భయం (2)
20. రాబడి (3)
21. లంచగొండులను దీనితో పోలుస్తారు (4)
22. కానుక (4)
24. ఒడ్డు, తీరం..కింద నుంచి (2)
25. ప్రపంచం (2)
26. వ్యాయామం (2)

పదరసం - 556 సమాధానాలు





ఉగ్రవాదుల ఉసురు తీసే 'ఉస్తాద్ భగత్ సింగ్'

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది కానుకగా రెండు తెలుగు సినిమాలు జనం ముందుకు వచ్చాయి. అందులో ఒకటి స్ట్రయిట్ తెలుగు సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'. మరొకటి హిందీ అనువాద చిత్రం 'ధురంధర్: ది రివెంజ్'. మొదటి సినిమా పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి కాకముందు మొదలెట్టిన సినిమాల్లో చివరిది కాగా, రెండవది గత ఏడాది డిసెంబర్ 5న విడుదలై, దేశ వ్యాప్తంగా విజయ దుందుభి మోగించిన 'ధురంధర్'కు సీక్వెల్.

దాదాపు పద్నాలుగు సంవత్సరాల క్రితం పవన్ కళ్యాణ్, హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో 'గబ్బర్ సింగ్' మూవీ వచ్చింది. అది సల్మాన్ ఖాన్ హిందీ చిత్రం 'దబంగ్'కు రీమేక్. 'గబ్బర్‌సింగ్' ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. దాంతో మరోసారి పవన్ – హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో మూవీ వస్తోందనే సరికి భారీ అంచనాలు నెలకొన్నాయి. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత వచ్చిన తొలి చిత్రం 'హరిహర వీరమల్లు' కమర్షియల్‌గా సక్సెస్ కాలేదు. ఆ తర్వాత వచ్చిన 'ఓజీ' మంచి ఓపెనింగ్స్ సాధించింది కానీ అభిమానులను పూర్తి స్థాయిలో సంతృప్తి పర్చలేకపోయింది. దాంతో అందరూ సహజంగానే 'ఉస్తాద్ భగత్ సింగ్' పై ఆశలు పెట్టుకున్నారు.

ఈ సినిమా కథ విషయానికి వస్తే... పిల్లలు పనికి కాదు బడికి వెళ్లాలని కోరుకుంటాడు ఉత్తమ ఉపాధ్యాయుడైన చంద్రశేఖరరావు (కె.ఎస్. రవికుమార్). అనాథ అయిన గూడెం పిల్లాడు ఉస్తాద్ భగత్ సింగ్ (పవన్ కళ్యాణ్)ను ఆయనే చేరదీసి పెంచి పెద్ద చేస్తాడు.కళ్లెదుట అన్యాయం జరిగితే తట్టుకోలేని దుందుడుకు స్వభావి ఉస్తాద్. తన ఆవేశాన్ని అణుచుకుని ఏసీపీ అవుతాడు. అతని గురువైన చంద్రశేఖరరావు రాజకీయాల్లో చేరి, సీఎంగా ఎంపికవుతాడు. అయితే ఆయన్ని హతమార్చి, సీఎం పీఠంపై కూర్చోవాలని అదే పార్టీకి చెందిన చదలమర్రి నల్ల నాగప్ప (పార్తీబన్) ప్రయత్నిస్తుంటాడు. అందుకోసం ఎంతకైనా తెగిస్తాడు. సీఎం చంద్రశేఖరరావుపై హత్యాయత్నం చేస్తాడు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రినైతే ఏకంగా చంపేయిస్తాడు. చివరకు తానే సీఎం సీటులో కూర్చుంటాడు. అందుకోసం టెర్రరిస్టుల సాయం కూడా తీసుకుంటాడు. ఆ టెర్రరిస్టులను హతమార్చి, సీఎం సీటుకు ఎసరు పెట్టిన నాగప్పకు, అతని కొడుకులకు ఉస్తాద్ భగత్ సింగ్ ఎలాంటి గుణపాఠాన్ని నేర్పాడన్నదే ఈ సినిమా కథ.

ఇలాంటి కథలను తెలుగు వాళ్లు కొన్ని దశాబ్దాలుగా చూస్తూనే ఉన్నారు. అయితే ఆ పాత కథను దర్శకుడు హరీశ్ శంకర్ కొత్తగా అయినా చెప్పాడా? అంటే అదీ లేదు! పాత కథను,పాత పంథాలోనే తెర మీద చూపించాడు. దాంతో సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకూ మనకు నెక్స్ట్ ఏం జరుగుతుందో అర్థమైపోతుంటుంది. అయితే... ఈ సినిమాకు హరీశ్ శంకర్ అద్దిన మెరుపులు ఏమైనా ఉన్నాయంటే అవి సంభాషణలు. పవన్ కళ్యాణ్ అభిమానులను దృష్టిలో పెట్టుకుని కొన్ని; జాతీయ భావాలకు ఊతమిచ్చేలా మరికొన్ని సంభాషణలు రాశాడు. అందుకు తగ్గ సన్నివేశాలను రూపకల్పన చేశాడు. ఆ సీన్స్‌లోనూ, ఆ సంభాషణల సమయంలోనూ థియేటర్లో విజిల్స్ పడుతున్నాయి. మరీ ముఖ్యంగా హీరో నుదుట బొట్టు పెట్టుకున్న విషయాన్ని సహచరుడు గుర్తు చేసి, దానిని తీసేస్తే మంచిది అన్నప్పుడు, 'నేను వెళుతోంది పాతబస్తీకి, పాకిస్థాన్‌కు కాదు' అని చెప్పడం బాగుంది. అలానే హీరోతో పాతబస్తీ ముస్లిం నాయకుడు 'మా కరెంట్ బిల్లులే వసూలు చేసుకోలేరు, మా దగ్గరున్న ఉగ్రవాదిని తీసుకెళ్లగలరా?' అన్నప్పుడు, హీరో వేలాది మంది ముస్లిం మధ్య నుంచి ఆ ఉగ్రవాదిని కొట్టి, నడిరోడ్డు మీద ఈడ్చుకుంటూ తీసుకెళ్లే దృశ్యానికి థియేటర్‌లో మంచి స్పందన లభిస్తోంది. ఇక క్లయిమాక్స్ లో ఆపరేషన్ సిందూర్‌ను గుర్తు చేస్తూ హీరో ఉగ్రవాదుల పీచమణిచే సన్నివేశాన్ని బాగా తీశారు.

బలమైన కథ లేకపోవడం 'ఉస్తాద్ భగత్ సింగ్'లో ప్రధాన లోపం. దానికి తోడు పవన్ కళ్యాణ్ ఇచ్చిన పరిమితమైన కాల్షీట్స్‌లోనే సినిమాను పూర్తి చేసినట్టు అర్థమౌతోంది. అందువల్ల సమయాను కూలంగా పైపైన కథను నడిపేశారు. పైగా ప్రథమార్ధంలో ఒక హీరోయిన్ తోనూ, ద్వితీయార్ధంలో మరో హీరోయిన్ తోనూ ఎంటర్‌టైన్‌మెంట్ అందించే చేసిన ప్రయత్నాలు వికటించాయి. పవన్ కళ్యాణ్ తెర మీద కనిపించిన సన్నివేశాలన్నీ ఫ్యాన్స్‌ను అలరించేలానే ఉన్నాయి. పాటల చిత్రీకరణ బాగానే ఉన్నా... 'తొలిప్రేమ'లోని 'నా మనస్సే...' సాంగ్‌ను రీమిక్స్ చేయడం హైలైట్‌గా నిలిచింది. పవన్ కళ్యాణ్‌తో స్టార్ హీరోలను ఇమిటేట్ చేయించిన సీన్ కూడా రక్తి కట్టింది. డాన్స్ రాదంటూ సహచరులు ఆటపట్టించడం, ఆపైన పవన్ కళ్యాణ్ సరదా స్టెప్పులతో డాన్స్ చేయడం ఫ్యాన్స్‌ను అలరిస్తుంది. సీతారామశాస్త్రి 'రుద్రవీణ' కోసం రాసిన 'తరలిరాద తనే వసంతం' పాట పల్లవినీ సందర్భానుసారంగా వాడేశారు.

పవన్ కళ్యాణ్ ఎక్కువ శ్రమ పడకుండా బాగానే చేశారు. రాశీఖన్నా, శ్రీలీల ఖాతాలో మరో సినిమా చేసినట్టయింది. అంతకు మించి చెప్పుకోవడానికి ఏమీ లేదు. తమిళ నట దర్శకులు పార్తీబన్, కె.ఎస్. రవికుమార్ ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించడం విశేషం. రావు రమేశ్, మురళీమోహన్, గౌతమి, గుండు సుదర్శన్, సత్యం రాజేశ్, ప్రవీణ్, కమల్ కామరాజ్, టెంపర్ వంశీ, వంశీ చాగంటి, ఎల్.బి.శ్రీరామ్, ప్రసాద్‌బాబు, ఆనంద్ ఇతర పాత్రల్లో కనిపిస్తారు. దేవిశ్రీ ప్రసాద్ సమకూర్చిన రెండు పాటల బాగానే ఉన్నాయి. అయితే థమన్ నేపథ్య సంగీతం పరమ రొటీన్‌గా ఉంది. చిరాకు తెప్పించింది. 'ధురంధర్: ది రివెంజ్' చిత్రంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులను అక్కడి భారత్ సీక్రెట్ ఏజెంట్ అంతమొందిస్తే... 'ఉస్తాద్...'లో దేశం లోపలి ఉగ్రవాదులను ఓ పోలీస్ అధికారి హతమార్చినట్టు చూపించారు. అంత మాత్రాన 'బోత్ ఆర్ నాట్ సేమ్'!

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.80/-



వెల : ₹.135/-



వెల : ₹.400/-

వెల : ₹.300/-



వెల : ₹.135/-

వెల : ₹.800/900 : 999/1200



వెల : ₹.250/-

వెల : ₹.150/-

వెల : ₹.99/-



వెల:₹.999/- సెట్



వెల:₹.450/-



వెల :₹.699/-



వెల : ₹.400/-



వెల : ₹.145/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 24